బుధవారం
03-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 72
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇమ్రాన్ సురక్షితమేగానీ...

రావల్పిండి: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చావు వార్తలకు తెర పడింది. ఆయన సురక్షితంగా ఉన్నారని సోదరి ఉజ్మా ఖానుమ్ తెలిపారు. అడియాలా జైల్లో ఉన్న తన సోదరుడిని ఆమె ఎట్టకేలకు మంగళవారం కలిశారు. ఆయన సురక్షితంగానే ఉన్నారుగానీ వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. మానసిక కుంగుబాటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వాలని ఆందోళనలు మిన్నంటిన వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. దీంతో ఇమ్రాన్ ఖాన్‌ను కలిసేందుకు ఉజ్మాతో పాటు ఓ న్యాయవాదికి జైలు అధికారులు అనుమతి ఇచ్చారు.

'ఎర్త్ సైన్స్' గర్వకారణం

- విద్య, వ్యవసాయ రంగాల సమగ్ర అభివృద్ధికి కృషి
- కాంగ్రెస్ పాలన అంటేనే సంక్షేమం, అభివృద్ధి
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం: రేవంత్

విశాలాంధ్ర బ్యూరో– కొత్తగూడెం : విద్య, వ్యవసాయ రంగాల సమగ్ర అభివృద్ధితో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. విద్య, వైజ్ఞానిక, పారిశ్రామిక రంగాల సమాంతర అభివృద్ధి కోసం దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలు విద్య వైజ్ఞానిక రంగాల్లో ఇతోధికంగా పురోభివృద్ధి చెందినప్పుడే దేశం లేదా రాష్ట్రమైన సమగ్రంగా మునుగడ సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలన అంటేనే సంక్షేమం, అభివృద్ధి ఫలాలను సమాంతరంగా ప్రజలకు అందించటమే అని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి తన సహచర మంత్రులు సీఎం భట్టి విక్రమార్క, వాకాటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాం రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులతో కలిసి కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని సీఎం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. మన్మోహన్ సింగ్ పేర ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకోవడం తెలంగాణకే గర్వకారణం అన్నారు. వర్సిటీ పరిధిలో ప్రత్యక్షంగా పరోక్షంగా వందలాది మందికి ఉద్యోగ ఉపాధి లభిస్తుందని తెలిపారు. గతంలో పాల్వంచలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం వందల ఎకరాల భూమి రైతులు అందిస్తే స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగ, ఉపాధి ఇవ్వడం కల్పించడంతో 1969లో మొట్టమొదటిసారి తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడ్డాయన్నారు. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ఈ ప్రాంతమే అన్నారు. భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ...దేశం అభివృద్ధి చెందడానికి ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీ అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉన్న గొప్ప విశ్వ విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆనాడు నెహ్రూ ప్రారంభించినవే అన్నారు. మన దేశం విద్య వైజ్ఞానిక రంగాల్లో ప్రపంచానికి పోటీగా నిలిచిందంటే ఆనాటి దూరదృష్టి గల నెహ్రూ పుణ్యమే నని గుర్తు చేశారు. బాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని వివరించారు. జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఈ జిల్లాకు అందించాలని లక్ష్యంతో ముందుకు పోతున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గోదావరి, కృష్ణా జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఉమ్మడి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో

- మిగతా 2 లో

దద్దరిల్లిన పార్లమెంట్

ఎస్ఐఆర్‌పై చర్చించాలని ప్రతిపక్షాల ఆందోళన

- మార్మోగిన 'ఓట్ చోర్, గద్దీ చోడ్' నినాదాలు
- ఉభయసభల్లో గందరగోళం...నేటికి వాయిదా

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళనకు దిగడంతో పార్లమెంట్ దద్దరిల్లింది. ఓట్ చోర్, గద్ది చోడ్ అంటూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. ఫలితంగా ఉభయసభల్లో గందరగోళం నెలకొన్నది. లోక్‌సభలో సభ్యుల్ని నియంత్రించేందుకు స్పీకర్ ఓంబిర్లా చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ముందుగా సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైనా అదే దృశ్యం పునరావృతం కావడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ పునఃప్రారంభమైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. ప్రతిపక్ష సభ్యులు ఎస్ఐఆర్‌పై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు ప్రతిపక్ష సభ్యులు పార్లమెంటు వెలుపల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ సహా పెద్ద సంఖ్యలో ప్రతిపక్ష ఎంపీలు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ

- మిగతా 2 లో

ప్రతిష్టంభనకు తెర

- ఎస్ఐఆర్‌పై 9న లోక్‌సభలో చర్చ
- సభ సజావుగా సాగేలా అఖిలపక్షం, బీఏసీలో నిర్ణయం

2 లో

పీఎంవో ఇక సేవాతీర్థ్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పీఎంఓ) ఇకనుంచి సేవాతీర్థ్‌గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా సౌత్‌బ్లాక్‌లోని పీఎంఓ నుంచి ప్రధానులు విధులు నిర్వర్తిస్తుండగా... ఆ కార్యాలయం కొత్త భవనంలోకి మారనుంది. ఈ నేపథ్యంలోనే పేరు మార్పుపై ప్రకటన వచ్చింది. రాజ్‌భవన్ పేరుతో కొనసాగుతోన్న గవర్నర్ల అధికారిక నివాసాలను ఇకపై 'లోక్‌భవన్'గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూచించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఒడిశా, త్రిపుర, పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు, గుజరాత్

- మిగతా 2 లో

హైకోర్టుకు పరకామణి కేసు నివేదిక

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: తిరుమల శ్రీవారి ఆలయం పరకామణిలో జరిగిన చోరీ కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ కేసుపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం హైకోర్టుకు తన నివేదిక సమర్పించింది. సిట్ బృందానికి నేతృత్వం వహించిన సీఐడీ అదనపు డీజీ రవిశంకర్ అయ్యనార్... నివేదికను సీల్డ్ కవర్‌లో ఉన్నత న్యాయస్థానానికి అందజేశారు. ఈ కేసుపై తదుపరి విచారణను హైకోర్టు శుక్రవారం చేపట్టనుంది. 2023 ఏప్రిల్‌లో తిరుమల పరకామణిలో టీటీడీ

- మిగతా 2 లో

గ్లోబల్ సమ్మిట్ కమిటీలతో భట్టి భేటీ



విశాలాంధ్ర– హైదరాబాద్: ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ వార్ రూమ్ ను మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సందర్శించారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పన తోపాటు ఈనెల 8, 9న భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి ఏర్పాటు చేసిన కమిటీలు, వాటి పనితీరు, ప్రగతి తదితర అంశాలపై కూలంకుషంగా చర్చించారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి ఏర్పాటుచేసిన ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, వేదిక, లాజిస్టిక్స్, ట్రాన్స్ పోర్ట్, ప్రోగ్రాం, కల్చరల్ ఈవెంట్స్, కమ్యూనికేషన్, డిజిటల్ మీడియా కమ్యూనికేషన్ కమిటీల అధ్యక్షులు, టీం సభ్యులతో ప్రత్యేకంగా సమీక్షించారు. అనంతరం ప్రతి విభాగంలో పనిచేస్తున్న బృంద సభ్యుల తో డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా మాట్లాడి పనులు జరుగుతున్న తీరును, వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పనుల్లో వేగం పెంచడంతోపాటు నాణ్యత, స్పష్టత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో సీనియర్ అధికారులు సవ్యసాచి ఘోష్, సంజయ్ కుమార్, సందీప్ కుమార్ సుల్తానియా, అజిత్ రెడ్డి, ప్రభుత్వ మీడియా సలహాదారు శ్రీరామ్ కర్రీ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

ఎర్త్‌సైన్స్ వర్సిటీతో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెండు: కూనంనేని



విశాలాంధ్ర – కొత్తగూడెం అర్బన్ : రాష్ట్రంలోనే అత్యంత భూ పరిధి గల ఏజెన్సీ జిల్లాగా ఉన్న కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదరి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుఅన్నారు. తన నియోజకవర్గంలో దేశ వైజ్ఞానిక రంగం గర్వపడేలా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నెలకొల్పటం చాలా ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. పాల్వంచలో వర్సిటీ ప్రారంభోత్సవానికి హాజరైన కూనంనేని మాట్లాడుతూ వర్సిటీ స్థాపనతో ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం, తన నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా రేవంత్ రెడ్డి తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల సహాయ సహకారాలు అందించటం అభినందనీయమన్నారు. నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీతారామ ప్రాజెక్టు పనులు వేగంగా జరిగేలా చూడాలని కోరారు. పాల్వంచలో 800 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదం లభించిందన్నారు. తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ దేశానికే తలమానికంగా ఇక్కడి ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయానికి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం ప్రభుత్వ సరైన నిర్ణయం అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు కూడా జరిగేలా ముఖ్యమంత్రి చొరవ చూపాలని అభ్యర్థించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామన్నారు. ప్రజలకోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తమ ఆశీర్వాదాలు మరోసారి అందించాలని ప్రజలను పొంగిలేటి కోరారు. అదనపు కలెక్టర్‌లు విద్యా చందన, వేణుగోపాల్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఆర్డీఓ మధు, ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మావోయిస్టు దేవన్న లొంగుబాటు?

విశాలాంధ్ర–చింతూరు: మావోయిస్టు పార్టీకి మరో భారీ దెబ్బ తగలనుందనే చర్చ నడుస్తోంది. ఆ పార్టీ అగ్రనేత, పీఎల్‌జీఏ నెంబర్–1 కమాండర్ బార్సే దేవా అలియాస్ దేవన్న లొంగిపోబోతున్నట్లు ప్రచారం ఉధృతంగా నడుస్తోంది. తన దళం... భారీగా ఆయుధాలతో సహా లొంగిపోతారని ప్రచారం జరుగుతోంది. దీనిని అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఆపరేషన్ కగార్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి బాధ్యతలను దేవన్న స్వీకరించారనే ప్రచారం ఉంది. అయితే దండకారణ్యంలో తీవ్ర

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రెండో విడత భూ సమీకరణకు నోటిఫికేషన్

విశాలాంధ్ర–సచివాలయం: రాజధాని ప్రాంతంలో రెండో విడత భూ సమీకరణకు సంబంధించి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాజధాని ప్రాంతంలోని ఏడు గ్రామాలలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజధాని అమరావతిలో ఏడు గ్రామాలలో 16,666.57 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమి సమీకరణకు ఆదేశాలు జారీ చేస్తూ...భూ సమీకరణ బాధ్యతను సీఆర్‌డీఏ కమిషనర్‌కు అప్పగించింది. రెండో విడత ల్యాండ్ పూలింగ్ చేపట్టాలన్న ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ గతవారం ఆమోదం తెలిపింది. రెండో దశలో మరో16 వేల ఎకరాలు సేకరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ప్రక్రియపై కసరత్తు చేపట్టిన ప్రభుత్వం పూర్తి జాబితా సిద్ధం చేసింది. రాజధాని నిర్మాణానికి మొదటి దశలో ప్రభుత్వ భూమి16 వేల ఎకరాలు సీఆర్డీఏకు అప్పగించారు. రాజధాని కోసం రైతుల నుంచి మొత్తం 50 వేల ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా తొలి విడతలో 34 వేల ఎకరాలు సమీకరించి సీఆర్డీఏకు అప్పగించారు. రెండో దశలో మరో 16 వేల ఎకరాలలు సేకరించడానికి సమాయత్తమైంది.

రాజధాని ప్రాంతంలో కొత్తగా రైల్వేస్టేషన్, రైల్వేలైన్, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం ఈ 16,666 ఎకరాల భూమిని సమీకరించనుంది. ఇందులో సీఆర్డీఏ పరిధిలోకి వచ్చే వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడిలో 7,562 ఎకరాలు, వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమిలో 9,104.57 ఎకరాలు సమీకరిస్తుంది. ఆయా గ్రామాల్లో 3,828 ఎకరాల మేర ప్రభుత్వ భూమి ఉంది. ఈ విడతలో భూములిచ్చిన రైతులకు గతంలో అమలు చేసిన పరిహారాలే వర్తిస్తాయి. జరీబు భూమికి నివాస స్థలం

- మిగతా 2 లో

'కిడ్నీ' చంపేస్తోంది

- వరుసపెట్టి కాటికిపోతున్న తండా వాసులు
- మహమ్మారిని మట్టుబెట్టడంలో ప్రభుత్వాలు విఫలం
- నిత్యం మోగుతున్న మరణమృదంగం
- ఆందోళనలో కుటుంబాలు
- హామీ నెరవేర్చాలని 'కూటమి' నేతలకు వేడుకోలు

విశాలాంధ్ర–ఎ.కొండూరు: ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు మరణాలతో గిరిజన తండాలు ఉలిక్కిపడుతున్నాయి. తాతలు... ముత్తాతలు చెలమలు, కుంటలలో నీళ్లు తాగిన రోజుల్లోనే ఎటువంటి రోగాలు... రొప్పులు లేవని, మాయదారి బోరు నీళ్లు తాగడం మొదలు పెట్టామో అప్పటి నుంచి తమ తండాల్లో కిడ్నీ జబ్బులు పెరిగిపోయాయని ఆందోళన చెందుతున్నారు. తమ కళ్లముందే పుట్టినవాళ్లు కాటికి పోతుంటే కన్నీటి వీడ్కోలు తప్ప

- మిగతా 2 లో

తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం కావాలి

- రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు తక్షణం పూర్తి చేయాలి
- విదేశీ ప్రతినిధులకు రాచమర్యాదలు
- అధికారుల సమీక్షలో మంత్రి దుద్దిళ్ల

విశాలాంధ్ర ప్రతినిధి – రంగారెడ్డి : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఈ నెల ఐదో తేదీ లోపు పూర్తి చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫ్యూచర్ సిటీ లో "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. ప్రాంగణంలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ... పనులు పెండింగ్‌లో పెట్టకుండా వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఆరో తేదీన డ్రై రన్ చేపట్టాలని

- మిగతా 2 లో

పీఎంవో ఇక సేవాతీర్థ్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాల గవర్నర్లు తమ బంగ్లాలను లోక్‌భవన్‌గా మార్చారు. మిగతా రాష్ట్రాలు కూడా పేరు మార్చాలని కేంద్రం నుంచి సూచనలు వచ్చాయి. వలసవాదానికి చిహ్నాలుగా ఉన్న పేర్లు తొలగించి ప్రజాస్వామ్య పంథాలో పేర్లు పెడుతున్నట్టు కేంద్రం చెప్పుకొస్తోంది.

రెండో విడత భూ సమీకరణకు నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

1,000 గజాలు, వాణిజ్య ప్లాటు 450 గజాలు ఇవ్వాలని గతంలోనే నిర్ణయించింది. మెట్ట భూములకు నివాస స్థలం 1,000 గజాలు, వాణిజ్య ప్లాటు 250 గజాలు పరిహారంగా ఇస్తుంది. రెండో విడత భూ సమీకరణతో ప్రభుత్వ భూమితో కలిపి అందుబాటులోకి రానున్న 20,494 ఎకరాల భూమికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ ఆదేశాలు జారీ చేశారు.

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి ఓట్లు దోచిపెట్టే పనిచేస్తోందని విమర్శించారు. తక్షణం ఎస్ఐఆర్ ప్రక్రియను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలో కూడా ఎస్ఐఆర్‌పై చర్చ కోరుతూ విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అయినా ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత సభలో కొన్ని అంశాలపై ప్రతిపక్షాలు లేకుండానే చర్చించారు. ఆపై పెద్దల సభను బుధవారానికి వాయిదా వేశారు.

హైకోర్టుకు పరకామణి కేసు నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగి రవికుమార్ 920 డాలర్లు అపహరిస్తూ పట్టుబడ్డాడు. ఈ ఘటనపై తిరుమల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే, అనూహ్యంగా ఈ కేసును లోక్ అదాలత్‌కు బదిలీ చేశారు. నిందితుడు రవికుమార్ తనకు చెందిన రూ.40 కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి విరాళంగా ఇవ్వడంతో 2023 సెప్టెంబర్‌లో కేసును రాజీతో మూసివేశారు. అయితే, లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరించడాన్ని సవాలు చేస్తూ పిల్ దాఖలు కాగా, విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ పరిణామాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. కేసు దర్యాప్తు చేసి నివేదిక అందజేయాలని సిట్‌ను ఆదేశించింది. విచారణ ప్రారంభించిన సిట్ అధికారులు... కేసు నమోదైనప్పుడు టీటీడీ చైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకర్‌రెడ్డి, లోక్‌అదాలత్‌లో పరిష్కారం జరిగినప్పుడు టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డిని, మాజీ ఈవో ధర్మారెడ్డితో పాటు పలువురు టీటీడీ, పోలీసు అధికారులను ప్రశ్నించి... వాంగ్మూలాలు నమోదు చేశారు. ఇప్పుడు సిట్ సమర్పించిన నివేదిక ఆధారంగా హైకోర్టు తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మావోయిస్టు దేవన్న లొంగుబాటు?

(మొదటిపేజీ తరువాయి)

నిర్బంధాన్ని ఆయన దళం భరించలేకపోతోంది. ఇప్పటికే పలువురు అగ్రనేతలు లొంగిపోవడం... ఎన్‌కౌంటర్‌లలో మరణించడం... జనవరి 1వ తేదీన భారీ సంఖ్యలో లొంగుబాటులు ఉంటాయని మావోయిస్టు నాయకత్వం నుంచి ప్రకటన వెలువడడం... తదితర పరిస్థితుల నడుమ దేవన్న సైతం లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బార్సే దేవా స్వస్థలం సుక్మా జిల్లా(ఛత్తీస్‌గఢ్) పూవర్తి గ్రామం. హిడ్మా, దేవన్నలది ఒకే ఊరు. పక్కపక్కనే నివాసాలు. హిడ్మా, దేవన్నకు చిన్నతనం నుంచే మంచి అనుబంధం ఉంది. హిడ్మా వెంటే పోరాటబాటలో దేవన్న నడిచాడు. 2017లో హిడ్మాకు పార్టీలో కీలక పదవి దక్కడంతో పీఎల్‌జీఏ నెంబర్-1 కమాండర్ బాధ్యతలను దేవన్న స్వీకరించాడు. దండకారణ్యంలో మెరుపు దాడులకు ఈ విభాగం ప్రత్యేకమైంది. అప్పటి నుంచి ఈ గ్రూప్‌తో దేవన్న పలు దాడులకు నాయకత్వం వహించాడు. ఆయనపై ఎన్ని కేసులు ఉన్నాయి? ఎంత రివార్డు ఉందన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. మార్చి 2026 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయంగా కేంద్రం ఆపరేషన్ కగార్ కొనసాగిస్తోంది. ఓ పక్క నేటి నుంచి పీఎల్జీఏ 25వ వార్షికోత్సవాలు జరుగుతున్న వేళ... బార్సే దేవా లొంగుబాటు నిజమైతే మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ అవుతుంది.

ఇమ్రాన్ ఖాన్ క్షేమమా?

తెహ్రీకే ఇన్సాఫ్ ప్రశ్న - పాకిస్థాన్ వ్యాప్తంగా ఆందోళనలు

మాజీ ప్రధాని మృతిపై ఊహాగానాలు

ఇస్లామాబాద్, రావల్పిండిలో ఉద్రిక్తత

రావల్పిండి: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ క్షేమమా? ఆయనను చూపించాలి అన్న డిమాండ్ ఆ దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ పార్టీ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను రావల్పిండిలోని అడియాలా జైల్లో 2023, ఆగస్టు ఉంచి ఉంచారు. అయితే ఆయన మరణించిన్నట్లు తాజాగా వదంతులు వచ్చాయి. ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నప్పటికీ ఆయనను కలిసేందుకు కుటుంబ సభ్యులకు అనుమతి లభించలేదు.

ఈ పరిస్థితి ఇమ్రాన్ ఖాన్ సోదరీమణులు, ఆయన కుమారులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఇమ్రాన్ ఖాన్‌ను తమకు చూపించాలని ఆయన సోదరీమణులు, కుమారుల డిమాండ్‌ను అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. పీటీఐ నేతలు కొందరు ఆయనను కలిసేందుకు విఫల ప్రయత్నం చేశారు. దీంతో ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారా అన్న అనుమానం వారికి కలిగింది. ఇదే ప్రశ్న ఆయన మద్దతుదారులు, సానుభూతిపరు లను ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో మంగళవారం పీటీఐ అధ్వర్యంలో ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు రాజధాని ఇస్లామాబాద్‌తో పాటు రావల్పిండిలో భారీగా నిరసనలు చేపట్టారు. నిషేధాజ్ఞలను ధిక్కరిస్తూ వీధుల్లోకి వచ్చారు. ఇది ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనకారులను అడ్డుకొనేందుకు ప్రభుత్వం రావల్పిండిలో సెక్షన్ 144 విధించింది. ప్రజా భద్రత దృష్ట్యా బుధవారం వరకు అన్ని బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కొన్ని సంఘాలు రావల్పిండిలో శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ (డీఐసీ) వెల్లడించింది. ఈ పరిణామాల వేళ ఇమ్రాన్ ఖాన్ కుమారులు ఖాసీం, సులేమాన్ మీడియాతో మాట్లాడుతూ తమ తండ్రి విషయంలో ఏదో జరగకూడనిది జరిగినట్లు అనుమానం వ్యక్తంచేశారు. ఆయన క్షేమమేనా అని ప్రశ్నించారు. మరణించారన్న భయం వెంటాడుతోందని చెప్పారు. ఏ విషయం తెలియక మానసి కంగా కుంగుబాటుకు గురవుతున్నట్లు తెలిపారు. జైలు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమను మానసికంగా క్షోభ పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ తమ తండ్రిని కలవనివ్వడం లేదన్నారు. నెలన్నర రోజుల నుంచి ఆయనను 'డెత్ సెల్'లో ఏకాంతవాసంలో ఉంచినట్లు తెలిసిందని, ఇది మరింతగా ఆందోళనకు గురి చేస్తున్నాదన్నారు. కాగా, ఇటీవల బలూచిస్థాన్ రెబల్స్‌కు చెందిన 'ఎక్స్' పోస్టు ఇమ్రాన్ ఖాన్ మరణించినట్లు దుమా రం రేపింది.

పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, ఐఎస్ఐ కలిసి ఆయనను హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని ఆ పోస్టు పేర్కొంది. మీడియా సంస్థలు కూడా కొన్ని వార్తలను ప్రచురించినట్లు మరికొన్ని పోస్టుల దుమారంతో ఇమ్రాన్ సోదరీమణులు ఇటీవల జైలు వద్దకు వెళ్లగా పోలీసులు వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ పరిణామాల క్రమంలో పీటీఐ నాయకులు, కార్యకర్తలు, ఇమ్రాన్ ఖాన్ అభిమానులు భగ్గుమన్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇమ్రాన్‌ను చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇస్లామాబాద్, రావల్పిండిలో ఉద్రిక్తతలు పెరిగాయి.

వెంటిలేటర్‌పై ఖలీదా జియా

- **ఢాకా ఆసుపత్రి వద్ద భారీ భద్రత-నిఘా**
- **చైనా నుంచి రెండు ప్రత్యేక వైద్య బృందాలు**
- **త్వరలో బంగ్లాదేశ్‌కు తనయుడు రెహమాన్**
- **పూర్తిగా సహకరిస్తాం: భారత్**

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ చైర్‌పర్సన్ ఖలీదా జియా (80) ఆరోగ్యం రోజురోజుకూ విషమిస్తున్నది. ఆమెను వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచారు. దీంతో పార్టీ శ్రేణులు, అభిమానులలో ఆందోళన పెరుగుతోంది. తమ అభిమాన నాయకురాలి యోగక్షేమాలు తెలుసుకోవడం కోసం వారు ఆత్రుతగా ఉన్నారు. ఆమె త్వరగా కోలుకోవాలంటూ ప్రత్యేక ప్రార్థనలు ఆచరిస్తున్నారు. ఇదే క్రమంలో ఖలీదా జియా చికిత్స పొందుతున్న ప్రైవేటు ఆసుపత్రి వద్దకు చేరుకుంటున్నారు. దీంతో ఎవర్‌కేర్ ఆసుపత్రి వద్ద పోలీసులు కట్టదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎస్ఎస్‌పీ సైతం రంగంలోకి దిగింది. నిఘా పెంచింది. సోమవారం అర్థరాత్రి 2 గంటలప్పుడు ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి 20 మందికిపైగా సిబ్బందిని మోహరించారు. వచ్చి, పోయే రోగుల కదలికలను గమనిస్తున్నారు. ఖలీదా జియా కోసం చైనా నుంచి ప్రత్యేకంగా ఐదుగురు వైద్యులతో కూడిన నిపుణుల బృందం అర్ధరాత్రి ఆసుపత్రికి చేరుకోగా, మరో బృందం మంగళవారం చేరుకున్నది. ఈ మేరకు మెడికల్ బోర్డు అధిపతి, కార్డియాలజిస్ట్ డాక్టర్ షహబుద్దీన్ తాలుక్‌దార్ తెలిపారు. ఖలీదా జియాను విదేశాలకు తీసుకెళ్లే పరిస్థితి లేదన్నారు. తీవ్రమైన అనారోగ్యంతో నవంబరు 23న ఆసుపత్రిలో చేరిన ఖలీదా జియా ఆరోగ్యం మరింతగా విషమించడంతో ఆమెను కొరోనరీ కేర్ యూనిట్‌కు బదిలీ చేశారు. ఆదివారం రాత్రి వెంటిలేటర్ ఏర్పాటు చేశారు.

ఖలీదా జియా చాలా చాలా కీలక వ్యక్తి (వీవీఐపీ)గా బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఆమె కోసం ప్రత్యేక భద్రతా దళం (ఎస్ఎస్ఎఫ్) భద్రత ఏర్పాటు చేసింది. దీంతో నలుగురు ఎస్ఎస్‌పీ సిబ్బంది అర్థరాత్రి ఆసుపత్రికి వెళ్లి, సుమారు మూడు గంటల పాటు వివిధ సెక్షన్లలో తనిఖీలు నిర్వహించారు. ఖలీదా జియా నాల్గో అంతస్తులోని కేబిన్‌లో ఉండగా, ఆమె భద్రతా దృష్ట్యా చుట్టూ ఉన్న కేబిన్లు ఖాళీ చేయించారు. ఈ మేరకు బీఎన్‌పీ వైస్ చైర్మన్ అహ్మద్ ఆజం ఖాన్ తెలిపారు. బీఎన్‌పీ స్థాయి సంఘం సభ్యుడు సలాహుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ దశాబ్దంగా లండన్‌లో ఉంటున్న తమ తాత్కాలిక చైర్మన్ తారిక్ రెహమాన్ (ఖలీదా జియా తనయుడు) త్వరలో బంగ్లాదేశ్ వస్తున్నారన్నారు. ఇదిలావుంటే, భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఖలీదా జియా ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఆమె కోలుకోవాలని పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

'కిడ్నీ' చంపేస్తోంది!

(మొదటిపేజీ తరువాయి)

చేసేదీమీలేకుండా పోయిందని తండా వాసులు బావురుమంటున్నారు. 2017లో గిరిజన తండాల్లో దానావలంగా వ్యాపించిన కిడ్నీ వ్యాధులపై కదిలిన ప్రభుత్వ యంత్రాంగం... తండా గ్రామాలలో పర్యటించి, నీటిని పరీక్షించి తాగవద్దు అని హెచ్చరికలు జారీచేయడంతో అప్పటి నుంచి శుద్ధి చేసిన నీళ్లను తాగుతున్నాం అని గిరిజనులు చెబుతున్నారు. అయితే శాశ్వత పరిష్కారం దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మండలం లోని 21 పంచాయతీలకు... 15 అనుబంధ గిరిజన తండాలకు జలజీవన్ ప్రాజె క్టు ద్వారా శు ద్ధమైన కృష్ణా జలాలను అందించేలా పనులు చేపట్టి ... ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకు ట్రయల్ రన్‌గా తాగునీటిని అందిస్తున్నా, వ్యాధి తీవ్రత తగ్గక పోవడంతో భయాందోళన చెందుతు న్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ బతుకులు మట్టిలో కలిసిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. మరో ఉద్దానంగా మారిన ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి మూలాలను కనుగొనడంలో ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో విఫలం చెందుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబు నాయుడు... ఐసీఎంఆర్‌కు లేఖ రాసి శాశ్వత పరిష్కారం చేస్తాం అన్న మాటను అధికారంలోకి వచ్చి 18 నెలలైనా పట్టించుకోవడం లేదని తండా వాసులు అంటున్నారు. వైద్యులు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తున్నా... వ్యాధి తగ్గుముఖం పట్టకపోగా రోజురోజుకి మృత్యు ఘంటికలు మోగుతూనే ఉన్నాయని గిరిజనలు ఆవేదన వెళ్లగక్కుతున్నారు. సంక్షేమ పథకాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు తప్ప కిడ్నీ వ్యాధి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం లేదని వాపోతున్నారు. రెండు తరాలు మారినా... మూడో తరం వారు వ్యాధి తీవ్రతతో మంచాలపై మూలుగుతూను ఉన్నారు. బాధిత కుటుంబాలకు రూ.10 వేలతో పరిష్కారం చూపడం కాదు... వ్యాధి మూలాలు కనుగొని శాశ్వత పరిష్కార దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, కన్నవారి శోకాలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. కేవలం రెండు నెలల్లోనే దీప్లానగర్ తండాకు చెందిన భరోతు ధర్మ(35), జరబల మంగ్య (56), చైతన్య నగర్‌కు చెందిన బాణావత్ కోటమ్మ (65), బాణావత్ పీరీ (84), బాణావత్ రాముడు (65) కిడ్నీ మహమ్మారికి మృతి చెందడం ఆయా కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. యువకులు కిడ్నీ కాటుకు మృత్యు వాత పడుతుండడంతో తమకు దిక్కెవరంటూ, తాము ఎలా బతకాలో తెలియడం లేదని బాధిత కుటుంబాలు బావురుమంటున్నాయి. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలోనైనా మహమ్మారిని మట్టుబెడతారన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని, పొరపాట్లు జరగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు, అతిథులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని, పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీఎస్ రామకృష్ణారావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రెవెన్యూ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, ప్రోటోకాల్ సెక్రటరీ నర్సింహా రెడ్డి, ప్రేమ్ రాజ్, నీటి సరఫరా బోర్డు ఎండీ కె.అశోక్ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, ఆర్ అండ్ బీ, ఫైర్ సేఫ్టీ, ట్రాన్స్‌పోర్టు, ఆర్టీసీ, టీజీ ఎస్పీడీసీఎల్, టూరిజం, ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఎర్త్ సైన్స్' గర్వకారణం

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు... చీరలు ఇలా అనేక కార్యక్రమాలను ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించామని గుర్తు చేశారు.

సర్పంచ్ ఎన్నికలలో మరోసారి కాంగ్రెస్ వైపే ప్రజలు ఉన్నారని నిరూపించాలని, మంచి అభ్యర్థులను, పని చేయగలిగే వారిని ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డబ్బులకు, మద్యం బాటిళ్లకు, ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీలలో జరిగే తెలంగాణ విజయోత్సవాలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కి రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేతోపాటు ప్రధాని మోదీని ఆహ్వానిస్తామన్నారు.

భూగర్భ ఖనిజాలే వర్సిటీ స్థాపనకు ప్రధాన కారణం: భట్టి

భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కొత్తగూడెం జిల్లాను ఎంపిక చేయటం చాలా ప్రయోజనకరమన్నారు. ఇక్కడ భూగర్భ ఖనిజాలు ఉండడమే వర్సిటీ స్థాపనకు ప్రధాన కారణమన్నారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరుగుతాయని తెలిపారు.

ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే ఈ విశ్వ విద్యాలయానికి నేడు తొలి అడుగు వేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు.

దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని చెప్పారు. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి అవసరమైన అన్ని వసతులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి... ఆయన సహచరులను కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ బి. రోహిత్ రాజు ఘనంగా స్వాగతం పలికారు.

దశాబ్దంలోగా అణు యుద్ధం: మస్క్

న్యూయార్క్: రాబోయే దశాబ్దం లోపు అణు యుద్ధం జరుగవచ్చునని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. హంటర్ యాష్ అనే వ్యక్తి పెట్టిన పోస్టుకు ఆయన స్పందించారు. శక్తిమంతమైన దేశాల మధ్య యుద్ధాన్ని, యుద్ధ ముప్పును అణ్వాయుధాలు నిరోధిస్తాయన్న పిచ్చి నమ్మకం కొన్ని దేశాల ప్రభుత్వాల్లో ఉన్నది కాబట్టి రాబోయే ఐదు నుంచి పదేళ్లలో అణు యుద్ధం అనివార్యమని మస్క్ వ్యాఖ్యానించారు. దీనిపై మరింత వివరణ ఇవ్వలేదు. ఇదే క్రమంలో కొందరు నెటిజన్లు స్పష్టతను కోరినప్పటికీ మస్క్ స్పందించలేదు. కాగా, ఆయన గతంలో సామూహిక వలసలు, రాజకీయ కారణాలతో యూరప్-బ్రిటన్ మధ్య అంతర్యుద్ధం, తైవాన్ విషయంలో అమెరికా-చైనా మధ్య ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ ఘర్షణలు వంటివాటి గురించి వేర్వేరు ప్రకటనలు చేశారు. ఇవన్నీ మూడవ ప్రపంచ యుద్ధానికి కారణాలుగా వ్యాఖ్యానించారు. మరోవైపు అణ్వస్త్రాల పరీక్షలను పునరుద్ధరించేందుకు అమెరికా, రష్యా పోటీ పడుతున్నాయి. అణ్వాయుధాల పరీక్షలను పునరుద్ధరిస్తామని రెండు అణు శక్తులు ఇప్పటికే ప్రకటించాయి. దీంతో మస్క్ తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇది సర్వత్రా చర్చకు దారితీశాయి.

మూడు దేశాల్లో 1,200 మందికిపైగా మృతి

కొలంబో: ఇండోనేసియా, శ్రీలంక, థాయిలాండ్ దేశాలను వరదలు ముంచెత్తాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో సంభవించిన ఆకస్మిక వరదలు భారీ నష్టాన్ని కలిగించాయి. ముంపునకు గురైన ఈ మూడు దేశాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ మంగళవారానికి 1,230కు చేరింది. ఇండోనేసియాలో 659 మంది, శ్రీలంకలో 390 మంది, థాయిలాండ్‌లో 181 మంది చనిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. వేలాది మంది నిర్వాసితులయ్యారని, అనేక మంది సహాయం కోసం నిరీక్షిస్తూ ఇళ్ల పైకప్పులపై ఉన్నారన్నారు. ఇండోనేసియాలో 475 మంది ఆచూకీ లేరన్నారు. హెలికాప్టర్లు, బోట్లు సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు తెలిపారు. శ్రీలంకలో 352 మంది జాడ లేరని, దిత్వా తూపాను భారీ నష్టాన్ని మిగిల్చిందని విపత్తు నిర్వహణ కేంద్రం పేర్కొంది. చాలా చోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయని, వంతెనలు కూలాయని, రోడ్లు మూసుకుపోయాయని, వాటిని పునరుద్ధరించడం సవాల్‌గా మారిందని తెలిపింది. కాండీ నగర వాసులు ఆహార, దప్పికలతో అల్లాడుతున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురుస్తాయని పేర్కొంది. దక్షిణ థాయిలాండ్‌లో క్లీనప్ ప్రారంభం కాగా 15 లక్షల కుటుంబాలు, 39 లక్షల మంది ప్రజలు ప్రభావితమైనట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాతో పాటు మౌలిక వసతుల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. బాధితులకు తాజాగా తయారు చేసిన భోజనం అందించడం కోసం బహిరంగ కిచెన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు థాయిలాండ్ అంతర్గత శాఖ తెలిపింది. 26 వేల మంది బాధితులకు 239 మిలియన్ భాత్ (7.4 మిలియన్ డాలర్లు) పరిహారం రూపేణ చెల్లించనున్నట్లు వెల్లడించింది.

ప్రతిపక్షాలు నిలదీస్తే డ్రామాలా?

మోదీ వ్యాఖ్యలు అప్రజాస్వామికం

11 ఏళ్లల్లో దేశాభివృద్ధి శూన్యం

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

ప్రతిపక్షాలను, పార్లమెంట్ సమావేశాలను కించపరుస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యల్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ తప్పుబట్టారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తితే... అది ఎందుకు డ్రామా అవుతుందో మోదీ సమాధానం చెప్పాలన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా మంగళవారం రామకృష్ణ మాట్లాడుతూ... పార్లమెంట్‌లో మోదీ ప్రతిపక్షాలను ఉద్దేశించి డ్రామాలు ఆడవద్దని, అభివృద్ధిపై చర్చించాలంటూ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. 11 ఏళ్ల మోదీ హయాంలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ రంగాల్లో మనం ముందుకు పోయాం?, ఎక్కడెక్కడ వెనుకబాటుకు గురయ్యాం?, దేశానికి ఏం అభివృద్ధి జరిగిందని ఆయన ప్రశ్నించారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ భారత్ ముందుకు పోతోందని మోదీ చెబుతున్నారని, కానీ ప్రపంచ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గిపోయిందన్నారు. 2014లో మోదీ ప్రధాని అయ్యే నాటికి ఒక డాలర్‌కు మారకం విలువ రూ.60 ఉంటే, ప్రస్తుతం రూ.89.65 పైసలకు చేరుకుందంటే... రూపాయి విలువ ఎలా పడిపోయిందో తెలుస్తుందన్నారు. దానికితోడు అంతర్జాతీయంగా మన అప్పులు పెరిగాయన్నారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు రూ.55 లక్షల కోట్ల అప్పులు ఉంటే, ప్రస్తుతం రూ.200 లక్షల కోట్లకు పెరిగిపోయాయని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రధాని ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని వివరించారు. మౌలిక సమస్యల్ని ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, రైతుల సమస్యలు అలాగే ఉన్నాయని, ధరలను నియంత్రించలేక పోయార న్నారు. నిరుద్యోగ సమస్య యథాతథంగా ఉందని, విదేశీ బ్యాంకుల నుంచి నల్లధనం వెనక్కి రప్పిస్తామని ఎన్నికల్లో ఆర్భాటంగా ప్రచారం చేసి..దానిని నెరవేర్చలేకపోయారన్నారు. కాబట్టి మోదీ ఏమీ చేయలేకపోగా, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ప్రతిపక్షాలను డ్రామాలాడుతున్నారంటూ అగౌరపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ఎస్ఐఆర్ గురించి పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు చర్చించకూడదంటే ఎలా అని ప్రశ్నించారు. మోదీ పదేపదే మతం పేరుతో ప్రజలను విభజించే ధోరణితో వ్యవహరిస్తున్నారని, వాటిపైన ప్రతిపక్షాలు మాట్లాడితే ఓర్చుకోలేక పోతున్నారని అన్నారు. మోదీ స్పష్టంగా పార్లమెంట్‌ను, ప్రతిపక్షాలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. కేరళ సీఎం పినరయి విజయన్‌పైన, మాజీ ఆర్థికశాఖ మంత్రి థామస్ ఐజాక్‌పైన అక్రమ కేసులు బనాయించడాన్ని రామకృష్ణ తప్పుపట్టారు. నాడు రిజర్వు బ్యాంకు అనుమతితో అక్కడ కార్యకలాపాలు చేస్తే, దానిపై అక్కడ కుంభకోణం జరిగిందని వారిపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కేరళలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పాలక ఎల్‌డీఎఫ్‌ని అప్రతిష్ట పాల్జేయడానికి సాక్షాత్తూ సీఎంపైనే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చివరకు నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీపైనా కేసులు పెట్టడాన్ని ఆయన ఖండించారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని సీపీఐ తరఫున ఖండిస్తున్నామన్నారు. వామపక్ష, ప్రజాస్వామ్య వాదులంతా ప్రధాని చర్యల్ని తూర్పారబట్టాలని కోరారు.

ప్రతిష్టంభనకు తెర

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పై పార్లమెంటులో చర్చించేందుకు అధికార పక్షం అంగీకరించింది. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. డిసెంబర్ 8న జాతీయ గీతం వందేమాతరం 150వ వార్షికోత్సవం, డిసెంబర్ 9న ఎన్నికల సంస్కరణల పై లోక్‌సభలో చర్చ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంస్కరణలపై చర్చలో భాగంగానే ఎస్ఐఆర్ పై కూడా చర్చించనున్నారు. , లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం, బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ లోక్‌సభ స్పీకర్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగిందని, డిసెంబర్ 8న సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి లోక్‌సభలో వందే మాతరం వార్షికోత్సవంపై, డిసెంబర్ 9న మంగళవారం ఉదయం 12 గంటల నుంచి సర్ అంశంపై చర్చ జరపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 8న లోక్‌సభలో వందేమాతరంపై వివరణాత్మక చర్చ నిర్వహించాలని బీఏసీ సమావేశం నిర్ణయించిందని, ఇందు కోసం పదిగంటల సమయం కేటాయించారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక చర్చను ప్రారంభిస్తారన్నారు. అదే సమయంలో బుధవారం నుంచి జరిగే శీతాకాల సమావేశాల్లో లోక్‌సభలో ఎలాంటి అంతరాయం లేకుండా కార్యకలాపాలు నిర్వహించాలని ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. పార్టీలు సభ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అంగీకరించాయని, తీవ్రమైన అంశాలపై దృష్టి సారించినట్లుగా చెప్పారు. 9-10 తేదీల్లో ఎస్ఐఆర్ అంశంపై చర్చ జరుగుతుందని, ఇందుకు పది గంటల సమయం కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండూ ఈ అంశంపై అభిప్రాయాలను చెబుతాయన్నారు. చర్చ పూర్తయ్యాక డిసెంబర్ 10న కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ స్పందిస్తారన్నారు.

90 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపు : ఎర్రబెల్లి

విశాలాంధ్ర తొర్రూర్ : స్థానిక సంస్థల ఎన్నికలలో 90 స్థానాలు టీఆర్ఎస్ గెలుపు ఖాయమని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న నాగబోయిన సునీల్‌యాదవ్, గ్రామ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహంకాల పుష్పనాదం, మహంకాల రమేష్, శివరాత్రి అక్కయ్య, చిన్నబోయిన పరశురాములు, బొల్లం పరుశురాములు, గార సుదర్శన్, నాగబోయిన సంపత్, నాగబోయిన సతీష్, వల్లపు వెంకన్న, వల్లపు కుమార్, సూర ఉపేందర్, డికొండ సుధాకర్, వల్లపు సాయిలు, బొల్లం మల్లయ్య, బొల్లం అజయ్, బొల్లం ఉమేష్, గద్దల శేఖర్ మరియు వంద మందిని మాజీ మంత్రి దయాకర్ రావు పార్టీ కండువాలు కప్పి బి.ఆర్.ఎస్ పార్టీలోనికి ఆహ్వానించారు. అంతమైన మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి చీరల పేరుతో మహిళల ఐకేపీ ఖాతాల నుండి డబ్బులు తీసుకుని 1200 రూపాయల చీరలు పంచుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. యాసంగి నుండి ఇప్పటివరకు రైతులకు బోనస్ ఇవ్వలేదని, తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం పనులు ప్రారంభించలేక పోయిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మండలాధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, మాజీ జెడ్పీటిసి మంగళపల్లి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి నల్లమాస ప్రమోద్ కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఎన్నమనేని శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-మరిపెడ: ఈనెల 3నుంచి డిసెంబరు 5 వరకు స్వీకరించనున్న సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో రిటర్నింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 సెంటర్ల ద్వారా 48 గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను స్వీకరిస్తామన్నారు.నామినేషన్ కేంద్రాల్లో ఎన్నికల నియమావళి ప్రకారమే ప్రతీ ఒక్కరు వ్యవహరించాలి అని అన్నారు.నామినేషన్ పత్రంలో ప్రతీ కాలమ్ ను నిశితంగా పరిశీలించాలన్నార.పోటీ అభ్యర్థుల అర్హతలు సరిచూసుకోవాలని, నామినేష న్ పత్రంతో జత చేసిన పత్రాలను పరిశీలించాలని అన్నారు.స్క్రూటి సమయంలో కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.

జిల్లా పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలి: కలెక్టర

విశాలాంధ్ర, కొమరం భీమ్ : జిల్లా పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. నవంబర్ 28, 29లో రంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువు ప్రాంతంలో జరిగిన 44వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఖోఖో పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల విద్యార్థినులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, సహాయ గిరిజన అభివృద్ధి అధికారి శివకృష్ణ లతో కలిసి అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థినులు క్రమశిక్షణ, సామర్థ్యం, కఠోర శ్రమతో తర్ఫీదు పొంది విజయం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శిక్షణ అందించిన కోచ్‌లు, సిబ్బందిని అభినందించారు.

నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో 3వ విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామపంచాయతీలో ఈ నెల 3 నుండి జరగనున్న 3వ విడత నామినేషన్ ప్రక్రియ కొరకు చేసిన ఏర్పాట్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, సిఐలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితాలో పూర్తి వివరాలతో రూపొందించాలని, ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులు జాగ్రత్త వహించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సామాగ్రి జిల్లాలో అందుబాటులో ఉందని, అవసరం మేరకు వినియోగించుకోవాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 3వ విడత నామినేషన్ ప్రక్రియ

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మెదక్ జిల్లాలో మూడవ విడత సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే నామినేషన్ స్వీకరణ ప్రక్రియకి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మూడో విడత ఎన్నికలు జరిగే కొల్చారం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. 3 నుండి 5 వరకు 7 మండలాలకు సంబంధించిన 183 గ్రామపంచాయతీలు, 1528 వార్డులకు నామినేషన్ ప్రక్రియకి సంబందించి పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసాచారి, ఎంపీడీవో , రిటర్నింగ్ అధికారులు రెవిన్యూ సిబ్బంది తదితరులున్నారు. పరిశీలకులు భారతి లక్పతి నాయక్ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. చేగుంట, శంకరంపేట(ఏ),మెదక్ ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ కేంద్రం పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. మక్కరాజీపేట్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ 30.59 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. దాచారం గ్రామంకు చెందిన దంపతులు గుండెల్లి శిరిష, యాదగిరి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా, వారి వద్ద ఉన్న సరైన పత్రాలులేని రూ.30,59,500 నగదును పోలీసులు గుర్తించారు. నగదు గురించి స్పష్టమైన వివరణ ఇవ్వకపోవడంతో, ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసి, స్వాధీనం చేసిన నగదును తదుపరి విచారణ కోసం సంబంధిత అధికారులకు అప్పగించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

విశాలాంధ్ర, ఇల్లందు : ప్రభుత్వం హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రామాణిక విద్య అందించడంతోపాటు నాణ్యమైన భోజన సౌకర్యాల కోసం నిధులు కేటాయిస్తుందని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్ అన్నారు. హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. మంగళవారం ఏటిడిఓ ఆఫీస్ లో ఇల్లందు పరిధిలో గల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్స్, ఎస్సీ ఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని విద్య, సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు. కుటుంబానికి సంబంధించి ఎన్నో కారణాలు, ఎన్నో ఆశలతో తమ పిల్లలను తల్లిదండ్రులు ఆశ్రమ పాఠశాలలో పంపిస్తానని గుర్తు చేశారు. పిల్లల పట్ల చాలా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పాఠశాలలకు వచ్చే నిధులను, సంక్షేమ పథకాలను ఖచ్చితంగా విద్యార్థులకు అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులను పక్కా ప్రణాళికతో పరీక్షకు సన్నద్ధం చేయించి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. ఉద్దీపకం అమలుపై కాంప్లెక్స్ హెచ్ఎం, ఎస్సిఆర్పీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల సంక్షేమం, శుభ్రత, నిధుల వినియోగ విషయంలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇల్లందు ఏటిడిఓ భారతీదేవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఎస్సిఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్” అవగాహన

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : డిజిటల్‌గా అరెస్ట్ చేస్తామని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేసే సైబర్ నేరగాళ్ళ మాయమాటలు నమ్మి మోసపోవద్దని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రామానుజం అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన “ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్” పేరుతో నిర్వహిస్తున్న సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పర్యవేక్షణలో ఖమ్మం పోలీస్ శిక్షణ కేంద్రంలో 150 మంది విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ..మీ వ్యక్తిగత సమాచారాన్ని, ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు, లను ఎవరితోనూ పంచుకోవద్దని అన్నారు. అపరిచిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఫోన్ ద్వారా వచ్చిన అటాచ్‌మెంట్‌లను తెరవవద్దని సూచించారు. డిజిటల్ అరెస్ట్, బెదిరింపుల గురించి భయపడవద్దని అన్నారు. డబ్బును బదిలీ చేయమని లేదా నగదు తీసుకుని ఇవ్వమని కోరే ఇటువంటి అభ్యర్థనలను విశ్వసించవద్దని పేర్కొన్నారు. మీరు ఏదైనా మోసానికి గురైనట్లు భావిస్తే, వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిందర్, సిఐ నరేష్ కుమార్ సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మూడవ విడత నామినేషన్ల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో,సంగారెడ్డి : గ్రామ పంచాయతీ మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మొదటి, రెండవ విడతలలో 17 మండలాలలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల షెడ్యూల్ ను అనుసరిస్తూ సజావుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ నెల 3 నుండి 5వ తేదీ వరకు మూడవ విడతగా కల్హేర్, కంగ్టి ,మనూరు, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాల పరిధిలోని 234 గ్రామ పంచాయతీలు,1960 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చనితెలిపారు. డిసెంబర్ 05 చివరి తేదీ అని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాఫీగా జరిగేలా అన్ని వర్గాల వారు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

దివ్యాంగుల క్రీడాపోటీలు

విశాలాంధ్ర - మణుగూరు : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం -2025 జి ఎం దుర్గం సందర్భాన్ని పురస్కరించుకొని మణుగూరు లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జీఎం దుర్గం రామ చందర్ తెలిపారు. ఈ నెల 3న ఉదయం నుంచి పివి కాలనీ భద్రాద్రి స్టేడియంలొ సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అవసర పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని నింపి వారిని ప్రోత్సహించేందుకు గాను ఈ క్రీడా పోటీలు అవసరమన్నారు. ఈ క్రీడాపోటీల్లో వారికి అనువైన పద్ధతిలో రన్నింగ్ రేస్, బాల్ త్రో, లాంగ్ జంప్ వంటి సులువైన ఆటలను ఆడించడం జరుగుతుందన్నారు. మణుగూరు ప్రాంత దివ్యాంగుల పాఠశాలల విద్యార్థులు, ఇతర దివ్యాంగులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని జీఎం కోరారు.

సమస్యలపై మాట్లాడే అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచలం గ్రామపంచాయతీ ప్రజల గొంతుకగా సిపిఎం, బిఆర్ ఎస్, గోండ్వాన పార్టీల నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటారని జీడీపీ పార్టీ ప్రచార కార్యదర్శి చింత అరుణ అన్నారు. మంగళవారం భద్రాచలం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న సిపిఎం, బిఆర్ఎస్, జిడిపి కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ 12వ వార్డులో అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొరసా చిట్టిబాబు విజయం కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌గా మానే రామకృష్ణను, 12వ వార్డు అభ్యర్థిగా కోర్స చినబాబులను గెలిపించాలని కోరారు. జిడిపి, ఆదివాసి సంఘాల నాయకులు అన్ను, కోర్స చినబాబు, కణితి రాధ,మిడియం నాగమణి పాల్గొన్నారు.

విద్యాసంస్థల సంఘం అధ్యక్షుడిగా ప్రవీణ్

విశాలాంధ్ర కారేపల్లి: సింగరేణి డివిజన్ గుర్తింపు పొందిన విద్యాసంస్థల సంఘం అధ్యక్షులుగా యర్రా సాయి ప్రవీణ్‌ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రమైన కార్యాలయంలోని లిటిల్‌స్టార్ పాఠశాలలో నిర్వహించిన ఎన్నికలలో సింగరేణి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్ మిత్రులందరూ పాల్గొని యర్రా సాయి ప్రవీణ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా గుర్తింపు పొందిన విద్యాసంస్థల అధ్యక్షులు కాంతారావు సింగరేణి పాఠశాలల కరస్పాండెంట్లు జేమ్స్ చాకో(విద్యాన్)మినీ జోజో(మాంటిస్సోరి), అరండకల్ మహేష్ (భాగ్యనగర్) వాంకుడోత్ కోటేశ్వరరావు(కె వి)మల్లెల నాగేశ్వరరావు(బ్రిలియంట్) శేష కుమార్(సరస్వతి)టి ఆర్ ఎంఎస్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో బట్టల వ్యాపారి మృతి

విశాలాంధ్ర, ఏదులాపురం మున్సిపాలిటీ :ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బట్టల వ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాల పాడు గ్రామం వద్ద గల ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి లారీ రోడ్ మీదకు ఎక్కుతుండగా కోదాడ క్రాస్ రోడ్ వైపుకు టూ వీలర్ పై వస్తున్న కూరపాటి వెంకటేశ్వర్లు బట్టల వ్యాపారి పై నుంచి లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

సావిత్రమ్మ పార్థివ దేహానికి నివాళి

విశాలాంధ్ర ఏదులాపురం మున్సిపాలిటీ :ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి లోని ఎదులాపురం 32 వ వార్డుకి చెందిన అంబటి నర్సయ్య భార్య అంబటి సావిత్రమ్మ సోమవారం గుండెపోటు అకాల మరణం చెందారు. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ధ్వారా తెలుసుకొని వారి స్వగృహం ఎదులాపురం నందు మృతదేహాన్ని సందర్శించి కాంగ్రెస్ జిల్లా నాయకులు భూక్య సురేష్ నాయక్ పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. వారి ఆత్మకి శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థించారు. వారి కుటుంబాన్ని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి ని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్‌పార్టీ ఎల్ల వేళలా అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఏదులాపురం మున్సిపల్ నాయకులు కేసిరెడ్డి.సురేష్ రెడ్డి,మేళ్లచెరువు.సురేష్ భద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ రే మెషిన్ కొనుగోలుకు ఆఫ్ లైన్ టెండర్ల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : ఎక్స్ రే మెషిన్ కొనుగోలుకు జిల్లా కలెక్టర్ ఆఫ్ లైన్ టెండర్లకు ఆమోదం తెలిపారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధీకృత విక్రేతలు షార్ట్ టెండర్ ను సీల్డ్ కవర్‌లో కలెక్టరేట్, వివి పాలెం, ఖమ్మం నందు గల మొదటి అంతస్తు, ఎఫ్1, రూం నెంబర్ 1 లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 3 నుండి 9 సాయంత్రం 5.00 గంటల లోపు సమర్పించాలని, తక్కువ ధర సూచించిన ఏజెన్సీకి ఈ నెల 10వ తేదీ మ. 2.00 గంటలకు టెండర్ ఫైనల్ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి అన్నారు. షార్ట్ టెండర్లో పాల్గొనే వారు ఇఎండి యాభై వేల రూపాయలు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, ఖమ్మం పేరున డిడి ద్వారా చెల్లించాలని అన్నారు. ఎక్స్ రే మిషన్ పూర్తి సాంకేతిక స్పెసిఫికేషన్ కొరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, ఖమ్మం కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిబంధనల మేరకు అత్యధిక పరిహారం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం ఇవ్వడానికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ పరిహారం నిర్దారణ కు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి, చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతా రామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని అన్నారు. ప్రాజెక్ట్ రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, భూసేకరణ చేయాలని ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది, అక్కడి భూములు సారవంతం అవుతాయన్నారు. ఉన్నదాంట్లో మంచి రేటు ఇచ్చే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. బాజుమల్లాయి గూడెం గ్రామంలో ఎకరానికి రూ.2 లక్షల 70 వేలు ఉందని, భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా రూ.5 లక్షల 40 వేలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ.10 లక్షల 80 వేలు చెల్లించాలని నిర్ణయించగా, ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ క్రింద రూ.64 వేలు కలిపి మొత్తం 11 లక్షల 44 వేలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపామని, అదేవిధంగా రేలకాయపల్లి గ్రామంలో ఎకరానికి 2 లక్షల 92 వేల రూపాయలు ఉందని, భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా 5 లక్షల 85 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి 11 లక్షల 70 వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించగా, ఆర్బిట్రేషన్ లో 12 శాతం వడ్డి క్రింద 70 వేల 390 వేల రూపాయలు కలిపి మొత్తం 12 లక్షల 40 వేల 390 రూపాయలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపామని, దీనికి రైతులు మరింత పెంచాలని కోరారని అన్నారు. సమావేశంలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ తమ భూముల్లో సుబాబుల్ పంట వేశామని, పంట చేతికి వచ్చే సమయానికి, భూములను కోల్పోవడం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని అన్నారు. ఎస్.డి.సి. ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ భూ సేకరణ అధికారులు, నిర్వాసిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు పగడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: పంచాయతీ ఎన్నికలకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు మరో 9 రోజుల సమయం ఉందని, రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ కల్పించాలని, రెండవ దశ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తయిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రణాళిక చేసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం రవాణా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రచార ఖర్చుల వివరాలు నమోదు చేసేందుకు రిజిస్టర్ లు అందించాలని అన్నారు. 6న మండల స్థాయిలో పి.ఓ, ఏ.పి.ఓ లకు శిక్షణ నిర్వహించి, అక్కడే పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఓ.పి.ఓ లు 6న మండల స్థాయిలో శిక్షణ వేదిక వద్దకు వచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి. వీర బుచ్చయ్య, జిల్లా పరిషత్ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సహకార అధికారి శ్రీమాల పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయసేకరణ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్: మంచిర్యాల మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ (ఫేజ్-02)కు సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం బుధవారం ఉదయం జరగనుంది. ఓ.సి మహాలక్ష్మి కంపెనీ సమీపంలో నిర్వహించబోయే ఈ కార్యక్రమ ఏర్పాట్లను, పనుల పురోగతిని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, రేపు జరగబోయే ఈ ప్రజాభిప్రాయ సేకరణకు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పర్యావరణవేత్తలు ప్రతి ఒక్కరూ హాజరై తమ అమూల్యమైన అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. రామ కృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ (ఫేజ్-02) ప్రారంభం కావడం వల్ల రామకృష్ణాపూర్ పట్టణానికి పూర్వ వైభవం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎస్.ఓ. టు జి.ఎం జి.ఎల్ ప్రసాద్, డి.జి.ఎం (పర్సనల్): అశోక్,పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డి.జి.ఎం (ఐఈడి) కిరణ్ కుమార్, డి.జి.ఎం (ఈ అండ్ ఎం) దూప్ సింగ్, ఎన్విరాన్మెంటల్ అధికారి వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేనేజర్ (ఐటి) రవి,ఎస్టేట్ ఆఫీసర్ నవనీత, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కమిషన్ల పాలన : కోరుకంటి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: రాష్ట్రంలో, కమిషన్ల పాలన నడుస్తోందనీ, ప్రశ్నించిన ప్రతిపక్షాలను బద్నాం చేసే కుట్రలు చేస్తున్నారనీ రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్టీపీసీ యాజమాన్యం ఒక యూనిట్‌కు రూ.4. 70 పైసలకే ఇవ్వడానికి సిద్ధంగా ఉండగా, మంత్రివర్గ కేబినెట్ ఇచ్చిన డి.పి.ఆర్ 10, 800 కోట్ల ప్రకారం యూనిట్‌కు రూ. 7.40.పైసలు పడుతుందని, కమిషన్ల కోసమే రామగుండంలో కొత్త థర్మల్ పవర్ ప్లాంట్‌కు క్యాబినెట్ నిర్ణయమన్నారు. ఇదే విషయాన్ని హరీశ్‌రావు ప్రశ్నిస్తే తట్టుకోలేక దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇక్కడి ఎమ్మెల్యే హరీష్ స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు అడిగిన వాటిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రామగుండంలో రోడ్ల వెడెల్పు పేరున అవినీతికి పాల్పడుతున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరిగోపు ఐలయ్య యాదవ్, బాదే అంజలి, గాధం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రం చేసిన ధాన్యాన్ని తీసుకురావాలి

విశాలాంధ్ర కే సముద్రం: రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచారకులు అజ్మీర శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లాలోని కేసముద్రం మండలం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధనసరి వారు నిర్వహించు పెనుగొండ, ధనసరి, ఉప్పరపల్లి, వరి కొనుగోలు కేంద్రాలను కేసముద్రం మండల వ్యవసాయ అధికారి బి వెంకన్న, మరియు, సొసైటీ సీఈవో గోపాల మల్లారెడ్డి లతో కలిసి సందర్శించారు. వరి ధాన్యానికి మద్దతు ధర, పొందే విషయంలో రైతులను ఉద్దేశించి పలు సలహాలు సూచనలు ఇచ్చిన తర్వాత ఆయన మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు సెంటర్కు తీసుకువచ్చే ముందు 17 శాతం లోపు తేమ ఉండేటట్టు చూసుకొని తెలిపారు. పొలం వద్దనే ఆరబోసుకొని చెత్త,మట్టి పెల్లలు లేకుండా శుభ్రం చేసుకుని కొనుగోలు సెంటర్కు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులు ఎన్ సాయి చరణ్, ఎం శ్రీనివాస్, డి రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

జనని భగవద్గీత సత్సంగం

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ పంచవటి కాలనీలోని పంచవటి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం గీత జయంతి సందర్భంగా జనని భగవద్గీత సత్సంగం మేడిపల్లి వారిచే నిర్వహించబడిన సంపూర్ణ గీతా పారాయణ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు శరత్ కుమార్ శర్మ మరియు మహిళలు, భక్తులు, వివిధ కాలనీ వాసులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ప్రజల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తులు, అభివృద్ధికి అండగా నిలబడే వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుడ్ల శ్రీలత-దేవేందర్ నుగెలిపించాలని,గడపగడపకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేపట్టారు. వార్డ్ మెంబెర్ బంగారి గోవర్ధన్, మాజీ టౌన్ అధ్యక్షులు తాళ్లపెల్లి నరేందర్,టౌన్ అధికార ప్రతినిధి కూరపాటి వేణు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నామ కారం చందు గాంధీ, మాజీ జడ్పీటీసీ ఎండీ వలియాభి- సలీం, సాయి, గోపాల్, వికాస్,హరికృష్ణ, చందు, దేవేందర్, అబుసాబ్, మహేష్, లక్ష్మణ్, అనిల్, చందు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ఏటూరునాగారం బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కాకుల మర్రి శ్రీలత, లక్ష్మణ్ బాబు గెలుపు కోసం ఏటూరునాగారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, టౌన్ అధ్యక్షుడు కాజా పాషా ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలతకు,బ్రహ్మరథం ప్రజలుపడుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు గడదాస్ సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటూరు నాగారం మండల కేంద్రంలోని సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు 3 వార్డు,9వ వార్డు సభ్యులు బట్టు మానస గోపి, పర్వతాలు ఎల్లయ్యతో కలిసి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి శ్రీలతతో ప్రచారం చేయటం జరిగినదన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాకులమర్రి శ్రీలతతో ఇంటింటికి తిరిగి శ్రీలతక్కను గెలిపించుకోవాలని ప్రచారంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి,కాకులమరి ప్రదీప్ రావు,కూనూర్ అశోక్,ఎండి వలీ బాబా, కోనేరు నాగేష్,తాడూరి రఘు, తూరం పద్మ,ప్రమీల, లలిత, సఫియా, సర్దార్ పాషా,వెంకటరాం నర్సయ్య, కుమ్మరి చంద్రబాబు,గండేపల్లి నరసయ్య,బాస పుల్లయ్య, బాలకృష్ణ,బాసాని శేఖర్,బట్టు గోపి, పర్వతాలు ఎల్లయ్య ,జాడి భోజరాజు, యలవర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

స్మార్ట్ ఫోన్లపై నిఘా నేత్రం

జనానికి జవాబు చెప్పవలసిన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రభుత్వం జనం చేతుల్లో ఉండే సెల్ ఫోన్లలోకి కూడా తొంగి చూడాలని నిర్ణయించింది. అంటే ఇక మీద సొంతం, గోప్యత లాంటి వాటికి అవకాశమే ఉండదు. సమాచార్ సాథీ అనే ఆప్‌ను స్మార్ట్ ఫోన్లలో ప్రవేశ పెడ్తారట. కొత్తగా తయారు చేసే అన్ని స్మార్టు ఫోన్లలో 2026 మార్చ్ నుంచి సంచార్ సాథీ అనే సాఫ్ట్‌వేర్‌ను చేర్చాలని, ఇప్పటికే ఉన్న ఫోన్లలో కూడా సాఫ్ట్‌వేర్ అప్డేట్ పేరుతో సంచార్ సాథీని ఎక్కించాలని కేంద్ర ప్రభుత్వం సమాచార, టెలీ కమ్యూనికేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పనుపున దూర్చే ఈ సాఫ్ట్‌వేర్‌ను తొలగించడానికి వీలు లేదన్న వాదనతో పాటు ఎవరైనా ఈ సాఫ్ట్‌వేర్ వద్దనుకుంటే తొలగించవచ్చునన్న సంజాయిషీ కూడా వినిపిస్తోంది. ప్రభుత్వం చెప్పాపెట్టకుండా ప్రవేశ పెడ్తున్న ఈ సాఫ్ట్‌వేర్‌పై పెద్ద దుమారం రేగింది. ఇది పెగాసస్ 2 లాంటిదని ప్రతిపక్షాలు దుయ్యబడ్తున్నాయి. ఇప్పటికే స్మార్ట్ ఫోన్లలో బూటకపు వార్తలను జొప్పించి జనం మనసులను వికలం చేయడం నిరాఘాటంగా కొనసాగుతోంది. చరిత్రను వక్రీకరిస్తున్నారు. ఇప్పుడు అదే ఫోన్‌ను ప్రభుత్వం జనం మీదే నిఘా నేత్రంగా వినియోగించాలను కుంటోంది. విద్వేషం పెంచే ప్రయత్నం బాహాటం గానే చేస్తోంది. ప్రభుత్వం ఆదేశం నిజానికి వ్యక్తుల జీవితాల్లోకి చొరబడడమే. సరిహద్దులో చొరబాటుదార్లను నిరోధించ లేని మోదీ ప్రభుత్వం వ్యక్తుల జీవితాల్లోకి మాత్రం చొరబడ్తానంటోంది. జనం పడక గదుల్లో కూడా ఇక గోప్యత, సొంతం అన్నవే లేకుండా పోవచ్చు. ఫోన్ల ద్వారా జనం ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఏం మాట్లాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అని తెలుసుకోవడానికి ప్రభుత్వం ఎక్కడ లేని ఆత్రుత ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం మన ఫోన్లలో కెమెరా ఆపేయొచ్చు. లొకేషన్ నిలిపివేయొచ్చు. ఫోన్ మూగపోయేట్టు చేయొచ్చు. కానీ ఒక్కసారి సంచార్ సాథీ ఆప్ మన ఫోన్లలో ప్రవేశించిన తరవాత ప్రభుత్వం గుప్పెట్లో లేని జనం జీవితాల్లో ఏమీ మిగలదు. సంచార్ సాథీ ఆప్ లేకుండా స్మార్ట్ ఫోన్ మార్కెట్లో దొరకకుండా పోతుంది. జనమంతా ప్రభుత్వ గుప్పెట్లో బందీలు అయిపోతారు. ఇక గూఢచర్యం అనుమానితుల మీదే కాదు. ప్రతి పౌరుడి మీద ప్రభుత్వం గూఢ చర్యం చేస్తూనే ఉంటుంది. సంచార్ సాథీవల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ప్రభుత్వం ఏకరువు పెడ్తోంది. వినియోగదార్ల రక్షణ కోసమే ఈ ఆప్‌ను ఫోన్లలో ప్రవేశ పెడ్తున్నామని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అంటున్నారు. ఇందులో బలవంతం ఏదీలేదు అంటూనే మీరు రిజిస్టర్ చేసుకోకపోతే చేసుకోకండి అంటున్నప్పటికీ అది నిద్రాణంగా ఉంటుంది. గోప్యత ప్రాథమికహక్కుల్లో భాగంకదా అనివాదించే వారి మాటలను వినిపించు కోవడానికి సిద్ధంగాలేదు. రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని పట్టించుకునే ఉద్దేశం ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదు. ప్రతిపక్షం ఏదో ఓవివాదం లేవనెత్తాలని ప్రయత్నిస్తోందని సింధియా అంటున్నారు. 2024లో సైబర్ నేరగాళ్లు రూ. 22,800 కోట్లు కాజేశారని, ఇలాంటివి నిరోధించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తూ ఉంటే ప్రతిపక్షం యాగీ చేస్తోందని ఆయన చెప్తున్నారు. నిజం గమనించడానికి నిరాకరించే వారికి నిజం చూపించలేమని సింధియా కించిత్తు ఆగ్రహం కూడా ప్రదర్శించారు. స్మార్ట్ ఫోన్లు తయారు చేసే ఆపిల్, సాంసంగ్, షావోమీ లాంటి కంపెనీలన్నింటికీ కేంద్ర ప్రభుత్వం సంచార్ సాథీ ఆప్‌ను అన్ని ఫోన్లలో చేర్చాలని ఆదేశించింది. అయితే ఆపిల్ సంస్థ మాత్రం తాము ఈ ఆదేశం పాటించబోమని తెగేసి చెప్పింది. ఈ ఆప్‌ను తప్పనిసరిగా ఫోన్లలో దూర్చాలనడం కేవలం సమ్మెట దెబ్బ కాదు, అది ఓ డబుల్ బ్యారెల్ తుపాకీ అని ఆప్ కంపెనీలో కొందరు భావిస్తున్నారని అంటున్నారు.

సంచార్ సాథీ ఆప్‌ను ఫోన్లలో ప్రవేశపెట్టడం అనివార్యం అనీ, దీన్ని తొలగించడానికి వీలు లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగానే చెప్తోంది. కావాలంటే ఫోన్లోంచి తొలగించొచ్చు అన్న జ్యోతిరాదిత్య సింధియా చెప్తున్న మాటలు నమ్మశక్యంగా లేవు. ఎందుకంటే అది ఇక అన్ని ఫోన్లలోకీ చేరుతుంది. ఇది పని చేయకుండా చేయలేం. ఈ ఆప్‌ను ఫోన్లో నుంచి తొలగించడానికి వీలులేదని సమాచార శాఖ ముందు స్పష్టంగానేచెప్పింది. ఆతరవాత వద్దనుకుంటే తొలగించ వచ్చునని అంటోంది. ఏ మాట నమ్మాలో తెలియని తికమకలో పడిపోక తప్పదు. పౌరుల మీద నిఘా వేసి ఉంచాలనుకోవడంలో ప్రభుత్వ ఉద్దేశం పైకి చెప్పక పోయినా స్పష్టంగా తెలుస్తూనే ఉంది. మోదీ నిరంకుశత్వం ఇప్పుడు పౌరుల వ్యక్తిగత వ్యవహారాల మీద, గోప్యతా అధికారం మీద కూడా స్వారీ చేయాలని చూస్తోంది. ఇలాంటి నిఘా వ్యవస్థలో ప్రజలు నోరు తెరవడమే ప్రమాదకరమై పోతోంది. భయం భయంగా తిరగాల్సి వస్తోంది. ఇంట్లో ఉన్నా ప్రభుత్వం నిఘా కళ్లు ఎక్కడ ఉన్నాయో వెతకాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం అన్నమాట వినగానే మౌనంగా ఉండవలసిన దుస్థితికి దారి తీస్తుంది. ఇంట్లోకూడా స్వేచ్ఛగా మాట్లాడుకునే అవకాశమే ఉండదు. మీ ఫోన్ మిమ్మల్నే ఎప్పుడూ డిజిటల్ అరెస్ట్ స్థితిలో ఉంచుతుంది. మొబైల్ ఫోన్ల ఐఎంఇఐ. నంబర్ చెక్ చేయడానికి, మీ ఫోన్ గురించి తెలుసుకోండి (కేయూఎం) అన్న సదుపాయాలు ఇప్పటికే ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. అలాంటప్పుడు ప్రతి ఫోన్లో ప్రత్యేక యాప్ చేర్చడంలో ఉద్దేశం ఏమిటో! ఎన్ని రకాలుగా ఆలోచించినా జనమందరిమీద నిఘా వేసి ఉంచడానికి మించిన ప్రయోజనం ఏమిటో అంతు పట్టదు. ఒకవేళ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకుంటే కనిపెట్టడానికి సాధనాలు ఉన్నాయి. అవసరమైన వారు కావాలంటే ఆ సాధనాలను వినియోగించు కుంటారు. అవసరంలేనప్పుడు తొలగిస్తారు. ప్రభుత్వానికి అభ్యంతరం ఎందుకు ఉండాలో! సైబర్ భద్రత పేరిట నిఘా వేసే వ్యవస్థలను, యాప్‌లను ప్రవేశపెడ్తున్నారు. సైబర్ భద్రతకు ప్రమాదం కలిగించే అంశాలనుంచి కాపాడడానికి కొత్తయాప్ ప్రవేశ పెడ్తున్నారట. కానీ ఆ ప్రమాదం ఏమిటో, దాన్ని ఎలా నివారిస్తారో మాత్రం ప్రభుత్వం ఇప్పటిదాకా స్పష్టంగా చెప్పనే లేదు. అయినప్పటికీ మన జేబులో ఫోన్ ఉందంటే ఓ ప్రభుత్వ గూఢచారి సదా మన వెన్నంటి తిరుగుతున్నట్టే. భద్రత పేరు మీద మోదీ ప్రభుత్వం రాఫేల్ యుద్ధ విమానాల వ్యవహారం సుప్రీంకోర్టుకెక్కినా బయట పడగలిగింది. ప్రభుత్వంమీద వచ్చే ఏ ఆరోపణపై విచారణకు ఈ ప్రభుత్వం అంగీకరించదు. కానీ ప్రజల చుట్టూ నిఘా నేత్రాలు పరిచేస్తోంది.

సంచార్ సాథీలాంటివెన్నో!

మోదీ ప్రభుత్వం ఏదోఒక సందర్భంలో ఏదోఒక వివాదాస్పద నిర్ణయం తీసుకుంటూనే ఉంది. పౌరుల హక్కులను కాలరాసేలా, ప్రజల గోప్యతను దెబ్బతీసేలా తీసుకుంటున్న చర్యల పట్ల ప్రజలు తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. తాజాగా భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల శాఖ మొబైల్ వినియోగదారుల భద్రత పేరుతో 'సంచార్ సాథీ' అనే పోర్టల్‌ను (వెబ్‌సైట్) ప్రారంభించింది. దీనిని ప్రధానంగా మొబైల్ ఫోన్ దొంగతనాలు అరికట్టడానికి, నకిలీ సిమ్ కార్డులను గుర్తించడానికి తీసుకువచ్చారు. దీన్ని యాప్ రూపంలోనూ వాడుకోవచ్చు. దీనికి సంబంధించి ప్రభుత్వ సమాచార విభాగం పీఐబీలో ఒక ప్రకటన సైతం జారీ చేసింది. అంతలోనే ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించడంతో మోదీ సర్కారు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఇంత హడావిడిగా తీసుకున్న నిర్ణయం వెనుక అంతర్యం ఏమైఉంటుంది?

నిజానికి, సంచార్ సాథీ యాప్ వల్ల ఉపయోగాలు లేకపోలేదు. పోయిన లేదా దొంగతనానికి గురైన ఫోన్‌ను బ్లాక్ చేయడం యాప్ ప్రధాన ఉద్దేశం. మీ పేరు మీద ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో తెలుసుకోవడం రెండో ప్రయోజనం. ఈ పోర్టల్‌లోని ఒక ఫీచర్ ద్వారా మీ పేరు మీద ప్రస్తుతం ఎన్ని సిమ్ కార్డులు యాక్టివ్‌గాఉన్నాయో తెలుసుకోవచ్చు. మీకుతెలియని నంబర్లు ఉంటే, అక్కడికక్కడే ఆ నంబర్లను రిపోర్టు చేసి తొలగించవచ్చు. అలాగే, సెకండ్ హ్యాండ్ ఫోన్ల తనిఖీకి ఇదిఉపకరిస్తుంది. మీరు పాతఫోన్ కొంటున్నప్పుడు, అది దొంగిలించిన ఫోనా లేక బ్లాక్‌లిస్ట్‌లోఉందా అని తెలుసుకోవచ్చు. మోసపూరిత కాల్స్‌పై ఫిర్యాదు చేయడానికీ అవకాశం ఉంది. బ్యాంక్ ఫ్రాడ్, లాటరీమోసాలు లేదా సెక్స్-టార్షన్ వంటి అనుమానాస్పద కాల్స్ లేదా మెసేజ్‌లు వస్తే, వాటిని ఈ పోర్టల్ ద్వారా

రిపోర్టు చేయవచ్చు. లాభాలనేవి ఒక కోణం నుంచి చూసే అంశం మాత్రమే.

సంచార్ సాథీ వల్ల నష్టాలూ ఉన్నాయి. వాస్తవానికి దీనివల్ల వినియోగదారులకు ప్రత్యక్షంగా ఎటువంటి నష్టాలు లేవు. ఇది పూర్తిగా ఉచితం, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తుంది. కానీ, కొన్ని సాంకేతిక, ఆచరణాత్మక పరిమితులు ఉన్నాయి. టెక్నికల్ సమస్యలు విషయానికొస్తే, కొన్నిసార్లు సర్వర్ డౌన్ కావడం వల్ల పోర్టల్ ఓపెన్ కాకపోవచ్చు లేదా ఓటీపీ రావడం ఆలస్యం కావచ్చు. అన్‌బ్లాక్ చేయడంలో జాప్యం ప్రధాన లోపం. మీరు పొరపాటున మీ ఫోన్‌ను బ్లాక్ చేసినా, లేదా పోయిన ఫోన్ దొరికిన తర్వాత అన్‌బ్లాక్ చేయాలను కున్నా, ఆ ప్రక్రియ పూర్తవడానికి కొంతసమయం పట్టవచ్చు. వెంటనే కాక పోవచ్చు. పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడమనేది తప్పనిసరి. ఫోన్ బ్లాక్ చేయాలంటే ముందుగా పోలీస్ స్టేషన్‌లో లేదా ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్ లేదా 'లాస్ట్ రిపోర్ట్' నమోదు చేయాలి. ఇది కొంతమందికి ఇబ్బందిగా అనిపించవచ్చు. డిజిటల్ అవగాహన లేనివారికి ఈ యాప్ శుద్ధదండగ. స్మార్ట్‌ఫోన్‌వాడకం లేదా ఇంటర్నెట్ గురించి పెద్దగా తెలియని వారికి ఈ పోర్టల్ ఉపయోగించడం కొంచెం కష్టంగా ఉండవచ్చు. ఇక అసలైనది డేటా గోప్యత. ఇది ప్రభుత్వ వెబ్‌సైట్ అయినప్పటికీ, మన వ్యక్తిగత వివరాలు (ఆధార్, ఫోన్ నంబర్లు) ఇస్తున్నాం కాబట్టి, సైబర్ భద్రత పరంగా ఆందోళన ఎప్పుడూ ఉంటుంది. అందుకే ప్రతిపక్షాలు దీన్ని వ్యతిరేకించాయి. ప్రజల వివరాలను గోప్యంగా ఉంచడంలో ఈ యాప్ పనిచేస్తుందన్న హామీ లేదు. పైగా ప్లే స్టోర్‌లో 'సంచార్ సాథీ' పేరుతో చాలా నకిలీ యాప్స్ ఉన్నాయి. ప్రభుత్వం దీనికి అధికారికంగా ఎలాంటి మొబైల్ యాప్‌ను విడుదల చేయలేదు. కేవలం సంచార్‌సాథీ.కామ్ వెబ్‌సైట్‌ను మాత్రమే ఉపయోగించాలి.

మోదీ ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలు జాతీయ భద్రత, పరిపాలనా సౌలభ్యం కోసమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అవి పౌర హక్కులకు, సమాచార గోప్యతకు భంగం కలిగించేలా ఉన్నాయని ప్రతిపక్షాలు, న్యాయ నిపుణులు, పౌర హక్కుల సంఘాలు మొదట్నించీ తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ప్రజలను ఆందోళన లోకి నెట్టేసిన మోదీ సర్కారు నిర్ణయాలు చాలానే ఉన్నాయి. ఇందులో మొదటిది డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం-2023. ఈ చట్టం ప్రజల డేటాను రక్షించడానికి అని చెబుతున్నా, ఇందులో ప్రభుత్వానికి ఇచ్చిన అపరిమితమైన మినహాయింపులు వివాదాస్పదమయ్యాయి. 'జాతీయ భద్రత' లేదా 'శాంతి భద్రతలు' అనే కారణాలతో ప్రభుత్వం పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని వారి అనుమతి లేకుండానే సేకరించవచ్చు. ఇది పౌరుల గోప్యతహక్కును దెబ్బ తీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఆర్‌టీఐ చట్టాన్ని ఉద్దేశపూర్వకంగానే బలహీనపర్చడం ఆందోళన కలిగిస్తోంది. డేటా చట్టం ద్వారా సమాచార హక్కు చట్టంలోని కొన్ని నిబంధనలను సవరించారు. దీనివల్ల ప్రభుత్వ అధికారుల వ్యక్తిగత వివరాలను కోరడం కష్టమవుతుంది. ఇక రెండోది టెలికమ్యూనికేషన్స్ చట్టం-2023. పురాతన టెలిగ్రాఫ్ చట్టాన్ని భర్తీ చేస్తూ తెచ్చిన ఈ కొత్త చట్టం ప్రభుత్వానికి విస్తృత అధికారాలను ఇస్తుంది. ఇది ప్రజల స్వేచ్ఛపై నిఘా పెంచింది. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజల సందేశాలను అడ్డగించడానికి, నెట్‌వర్క్‌లను ఆధీనంలోకి తీసుకోవడానికి ఇది అనుమతిస్తుంది. ఇంటర్నెట్ షట్-డౌన్ ఇందులో భాగమే. ఇంటర్నెట్ సేవలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి చట్టబద్ధంగా లభించింది. ప్రపంచంలోనే అత్యధికంగా ఇంటర్నెట్ షట్-డౌన్లు జరుగుతున్న దేశంగా భారత్ ఉండటం గమనార్హం. ఐటీ రూల్స్-2021 కూడా ప్రజలహక్కులను పరోక్షంగా హరిస్తోంది. సోషల్ మీడియా, డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫారమ్‌లను నియంత్రించ డానికి ఈ నిబంధనలను తెచ్చారు. ఫాక్ట్ చెక్ యూనిట్ పేరుతో ప్రభుత్వం గురించి వచ్చే వార్తలను "తప్పు" అని ప్రభుత్వమే నిర్ణయించి, వాటిని సోషల్ మీడియా నుండి తొలగించేఅధికారం తీసుకోవడం భావ ప్రకటనా స్వేచ్ఛకు ప్రమాదమని ఎడిటర్స్ గిల్డ్‌తోపాటు కోర్టులుకూడా ప్రశ్నించాయి. అలాగే, ఐటీచట్ట సవరణలు (2019), చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలో చేసిన సవరణలు పౌర హక్కుల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడానికి వాడుతున్నారనే విమర్శ ఉంది. కేవలం అనుమానంతో ఒక 'వ్యక్తిని' కూడా ఉగ్రవాదిగా ప్రకటించవచ్చు. ఈ కేసుల్లో విచారణ లేకుండానే ఏళ్ల తరబడి జైల్లో ఉంచడం, బెయిల్ దొరకక పోవడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా విమర్శలు ఉన్నాయి. భీమా కోరేగావ్ కేసు ఇందుకొక ఉదాహరణ. ఎన్నికల చట్టాల (సవరణ) బిల్లు-2021 ద్వారా ఓటర్ ఐడీని ఆధార్‌తో లింక్ చేయడం వల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగు తుందని ఆరోపణలు ఉన్నాయి. పెగాసస్ స్పైవేర్ ఆరోపణలు గురించి అందరికీ తెల్సిందే. ఇలా మోదీప్రభుత్వం తీసుకున్న ప్రతినిర్ణయమూ హక్కులను హరించేవే.

ఒకే వేదికపైకి విప్లవ శక్తులు

ఈడ్పుగంటి నాగేశ్వరరావు

భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం ఒక చారిత్రక సంఘటన. దీనికి చరిత్రలో ఎంతో ప్రాధాన్యత ఉంది. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ పుట్టక ముందు ప్రధానంగా మూడు రాజకీయ పార్టీలు ఉండేవి. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 1885 లో ఆవిర్భవించినా దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీ వచ్చిన తరువాత మాత్రమే ప్రాచుర్యంలోకి వచ్చింది. కాంగ్రెస్ చాలాకాలం సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరలేదు. డొమినియన్ స్వాతంత్ర్యం, మరికొన్ని సంస్కరణలను మాత్రమే కోరింది. కాంగ్రెస్ తర్వాత హిందూ మహాసభ ఒక రాజకీయ పార్టీగా ఆవిర్భవించింది. ఇది హిందూ మతతత్వ పార్టీగా హిందూ మతరాజ్యాన్ని వాంఛించింది. తరువాత ముస్లింలీగ్ వచ్చింది. ఇది ఒక ముస్లిం మత సంస్థ. ఇది ముస్లిం అధికార రాజ్యాన్ని డిమాండ్ చేసింది. ఇదే కాలంలో గదర్ విప్లవకారులు, జాతీయ విప్లవకారులు అమెరికా, కెనడా, యూరప్ దేశాలను కేంద్రంగా చేసుకుని తమ విప్లవ కార్యకలాపాలను నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో అక్టోబరు రష్యా విప్లవ స్ఫూర్తితో 1925 డిసెంబరు 26న భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది.

కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో లౌకిక, ప్రజాతంత్ర రాజ్యనిర్మాణం జరగాలని కోరింది. సోషలిస్టు సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రకటించింది. ఉత్పత్తి సాధనాల సామాజికీకరణను వాంఛించింది. దేశంలో ప్రజలందరికీ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానం అవకాశాలు, ప్రజలకు పూర్తి సార్వభౌమాధిపత్యంతో కూడిన దోపిడీలేని సోషలిస్టురాజ్యం కావాలని కోరింది. ఈ లక్ష్యం సాధించేందుకు అన్ని విప్లవ శక్తులను సమీకరించింది. ఆనాటికి కాంగ్రెస్ పార్టీ ఆలోచనలతో ఉన్న ముజఫర్ అహ్మద్, ఎస్ఏడాంగే, మిరాజ్‌కర్ వంటి వారు కమ్యూనిస్టు పార్టీ వైపు మొగ్గారు. గదర్ విప్లవకారులలోని అనేక మంది కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చారు. యూరప్‌లో కమ్యూనిస్టులుగా ఉన్న ఎంఎన్‌రాయ్, వీరేంద్రనాథ్ చటోపాధ్యాయ, ఉపేంద్రనాథ్ దత్తా, సోమేంద్ర చటర్జీ వంటి వారు భారత కమ్యూనిస్టు పార్టీతో భాగమయ్యారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ ఎంతో శక్తిమంతంగా రూపుదిద్దుకుంది. ఎన్నో కుట్ర కేసులను ఎదుర్కొన్నది. బ్రిటీష్ సామ్రాజ్య వాదుల వలస పాలనను అడుగడుగునా సవాల్ చేసింది. ప్రజా సంఘాల నిర్మాణం ద్వారా ఆదివాసీల హక్కుల కోసం, సంస్కరణల కోసం పోరాడింది. కుల వ్యతిరేక పోరాటాలకు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. రైతులను, కూలీలను, విద్యార్థులను సాంస్కృతిక వారసత్వాన్ని తట్టి లేపింది. వర్గ పోరాట ఉద్యమాలకు పునాదులు వేసింది.

కమ్యూనిస్టు పార్టీ జాతీయోద్యమంలో ఒక ప్రధాన భాగంగా ఉంది. అందులో ఒక విప్లవ స్రవంతిగా ఉంది. కాంగ్రెస్ సంస్థలో గాంధీజీ, లాలాలజపతిరాయ్, మదన్‌మోహన్ మాలవ్య వంటి వారు భిన్న భావనలకు ప్రతినిధులుగా ఉండేవారు. మత ధోరణులు కూడా వీరిలో ఉండేవి. కానీ కమ్యూనిస్టు పార్టీ సర్వం సహాధికారం గల రాజ్యాన్ని మాత్రమే కోరింది. రాజులు, జమీందారులు, నవాబులుతో కూడిన ఫ్యూడల్, భూస్వామ్య, మతోన్మాద ధోరణులు పోవాలని, సామాజిక పీడన అంతం కావాలని, నూతన ప్రజాతంత్రరాజ్యం భారతదేశంలో నెలకొనాలని కమ్యూనిస్టుపార్టీ పోరాడింది. దీనితో పాటు సామ్రాజ్యవాదం పోయి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కోరింది. తొలిగా సంపూర్ణస్వాతంత్ర్యం నినాదాన్నిఇచ్చింది కమ్యూనిస్టు పార్టీ.

స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టు పార్టీ అప్పటి వరకు చదువుకున్న వారికి మాత్రమే పరిమితమైన ఓటు హక్కు స్థానంలో వయోజన ఓటు హక్కును కోరింది. చదువు స్థానంలో వయసును ఓటు హక్కుకు ప్రాతిపదికగా సాధించింది. ప్రజాతంత్ర భావాలు దేశమంతటా విస్తరించటానికి కమ్యూనిస్టు పార్టీ కృషి చేసింది. కమ్యూనిస్టు పార్టీ పుట్టుకకు ముందు దేశంలో హిందూ-ముస్లిం ఘర్షణలు రెచ్చగొట్టబడి తీవ్ర విధ్వంసం, వినాశనం జరిగింది. కానీ కమ్యూనిస్టు పార్టీ హిందూ- ముస్లిం ఐక్యతకు పునాదులు వేసింది. కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులు ఒకరు ముజఫర్ అహ్మద్ ముస్లిం అయితే మరొకరు ఎస్.ఎ.డాంగే బ్రాహ్మణ సమాజం నుంచి వచ్చారు. హైదరాబాద్ రాష్ట్రంలో మఖ్దూం మొహియుద్దీన్ ముస్లిం అయితే రాజబహదూర్‌గౌర్ హిందువుగా ఉన్నారు. అంటరానితనం పోవాలని, సామాజిక న్యాయం కావాలని, కుల వ్యవస్థ, కుల దోపిడీతో సహా అన్ని రకాల దోపిడీ పోవాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. వర్గ దోపిడీ, జాతి వివక్షతలకు వ్యతిరేకంగా నూతన సమ సమాజ నిర్మాణానికి కమ్యూనిస్టు పార్టీ కృషి చేసింది. అందుకు ప్రజాతంత్ర విప్లవమే మార్గమని విశ్వసించింది.

నేడు దేశంలో ఫ్యూడలిజం నిర్మూలనైంది. ఇంకా భూస్వామ్య విధానం అవశేషాలు మిగిలి ఉన్నాయి. కూలిపని కొనసాగుతున్నది. కార్పొరేట్ కంపెనీలు, సంపన్నుల ఎస్టేట్‌లు ఉన్నాయి. కుల పీడన సైతం వేళ్లూనుకుని ఉంది. ఇవన్నీ భూస్వామ్య వ్యవస్థ అవశేషాలే. అవి పూర్తిగా తుడిచి పెట్టుకుపోవాలి. నేడు భూస్వామ్య వ్యవస్థ, కార్పొరేట్ కంపెనీలు వారి దోపిడీ కొనసాగుతున్నది. బడా పెట్టుబడిదారుల కింద నేటికి నలిగిపోతున్న వర్గాలకు కమ్యూనిస్టు పార్టీ అండగా నిలవాల్సి ఉంది. మతోన్మాద శక్తుల ఆగడాలను కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకిస్తుంది తప్ప ఏ మతానికి వ్యతిరేకం కాదు. ఆత్మ, కర్మ, స్వర్గం, నరకం వంటి భావనలను వ్యతిరేకిస్తాం. మతం పేరుతో ప్రజల మధ్య విభజనను కమ్యూనిస్టు పార్టీ అనుమతించదు. ఎక్కడో స్వర్గం ఉన్నదనే భావనను అంగీకరించం, ఈ భూమి మీద స్వర్గం రావాలని కమ్యూనిస్టులు ఆకాంక్షిస్తారు. మతాల మధ్య ఐక్యతను ఆహ్వానిస్తామే తప్ప మతాల మధ్య చిచ్చురగిల్చే చర్యలను కమ్యూనిస్టులు ఎప్పుడూ వ్యతిరేకిస్తారు. అందుకే లౌకిక రాజ్య నినాదాన్ని తొలి నుంచి కమ్యూనిస్టు పార్టీ స్వీకరించింది.

భారతదేశంలో రైతాంగం కోసం కమ్యూనిస్టు పార్టీ తొలి నుంచి పోరాడింది. సంస్థాన రైతులను సమీకరించింది. జమీందారీ, జాగీర్దారీ విధానానికి వ్యతిరేకంగా టెంకనాల్, తిరువాన్కూర్, తెభాగ ఉద్యమాలను, తెలంగాణ సాయుధ పోరాటాన్ని, మునగాల రైతాంగ పోరాటాన్ని, మరెన్నో ఉద్యమాలను కమ్యూనిస్టు పార్టీ నడిపింది. ఆదివాసుల హక్కుల కోసం వర్లీ ఆదివాసుల తిరుగుబాటుకు నాయకత్వం వహించింది. గోదావరి పరిలేకర్ (గోపాలకృష్ణ గోఖలే మేనకోడలు) కమ్యూనిస్టుగా ఈ పోరాటాన్ని నడిపింది. అంబేద్కర్ సాగించిన చెరువు పోరాటానికి మద్దతుగా నిలిచిన ఆర్.ఆర్.మోరే సైతం మహారాష్ట్రలో ప్రముఖ కమ్యూనిస్టునాయకుడు. అంబేద్కర్ సహచరులు అనేకమంది కమ్యూనిస్టు పార్టీలో ఉండి పోరాడారు. కమ్యూనిస్టు పార్టీ కొన్ని విషయాలలో అంబేద్కర్‌తో కలిసి పోరాడింది. కొన్ని విషయాలలో అంబేద్కర్‌తో విభేదించింది. దళితుల హక్కుల కోసం, ఆత్మ గౌరవం కోసం కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ కట్టుబడి పనిచేసింది. అందుకే నేటికి రిజర్వేషన్లు కొనసాగాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతున్నది. ఆధునిక కాలంలో సైతం కమ్యూనిస్టు పార్టీ ఎన్నో త్యాగాలను చేసింది. సిక్కు ప్రత్యేక రాజ్యం వద్దన్నందుకు ఎందరో కమ్యూనిస్టులు తమ రక్తం చిందించవలసి వచ్చింది. గోవా విముక్తిలో కమ్యూనిస్టులు బలిదానం చేయవలసి వచ్చింది. పుదుచ్చేరి విముక్తి పోరాటానికి నాయకత్వం వహించి, జాతీయనాయకునిగా గుర్తించిన సుబ్బయ్య కమ్యూనిస్టు నాయకుడు. అయోధ్యలో మత సామరస్యం కోరుతూ 50 వేల మందితో ఉద్యమించిన చంద్ర రాజేశ్వరరావు కమ్యూనిస్టు నాయకుడు. దేశంలో విప్లవ శక్తులను ఒక వేదిక మీదకు సమీకరించటంలో కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ చారిత్రక పాత్ర నిర్వహిస్తూనే ఉంది.

ఆంధ్ర రాష్ట్రంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి కమ్యూనిస్టు పార్టీ పునాదులు వేసింది. తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషి చేసింది. గురజాడ దేశ భక్తిని ఊరూరా చాటి చెప్పింది. వీరేశలింగం సంస్కరణోద్యమాన్ని కొనసాగించింది. కన్యాశుల్కం నాటకాన్ని తొలి రోజుల్లో కమ్యూనిస్టులే ప్రదర్శించి మూఢ విశ్వాసాలపై ధ్వజమెత్తారు. ప్రజానాట్యమండలి ద్వారా తెలుగునాట సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించింది. మా భూమి నాటకం, నాజర్ బుర్రకథ, కూచిపూడి నాట్యాలకు ప్రాచుర్యాన్ని కల్పించి పాత సంప్రదాయాల ఆధునికీకరణకు తోడ్పడింది. బహుముఖ రంగాలలో కమ్యూనిస్టు పార్టీ తట్టుకుని నిలబడింది. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు తాను జీవించి ఉన్న కాలంలో దేశానికి స్వాతంత్ర్యం వస్తుందనుకోలేదని, తెలంగాణ అడవుల నుంచి సాయుధ పోరాట కాలంలో సజీవంగా బయటకు వస్తానని అనుకోలేదని స్వయంగా చెప్పారు. అజ్ఞాత జీవితంలోనే ఎందరో కమ్యూనిస్టులు వీర మరణం చెందారు. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో గతాన్ని నెమరు వేసుకుని భవిష్యత్తులో సోషలిస్టు సమసమాజ స్థాపనోద్యమంలో మనం పురోగమించాలని ఆశిద్దాం! ప్రజాతంత్ర విప్లవ శక్తులను ఒక వేదిక పైకి తెచ్చి లక్ష్య సాధనకు శ్రమిద్దాం!

(సీపీఐ ఎన్టీఆర్ జిల్లా వర్క్‌షాప్‌లో కామ్రేడ్ ఈడ్పుగంటి ప్రసంగానికి కమ్యూనిజం సంపాదకులు చలసాని రామారావు అక్షర రూపం.)

ఎవరికీ పట్టని నాకో ఉద్యోగుల వెతలు

సుదర్శి వేణు

ప్రతి సంవత్సరం డిసెంబర్ 1 న ప్రపంచం ఎయిడ్స్ దినాన్ని ఘనంగా జరుపుకుంటూ. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంచడం, బాధితుల పట్ల సమాజంలో గౌరవం పెంపొందించడం, నివారణ చర్యలను బలోపేతం చేయడం ఈ దినోత్సవ లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్య విభాగాలు సభలు, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ "ఎయిడ్స్‌రహిత ప్రపంచం" అనే సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తాయి. అయితే అదే రోజు, ఎయిడ్స్ నిర్మూలన కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎయిడ్స్ కంట్రోల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితం మాత్రం ఎవరికీ కనిపించదు. ప్రపంచం ఒకవైపు "ఎండింగ్ ఎయిడ్స్" నినాదాలు చేస్తుంటే, మరొకవైపు ఆ ఉద్యమానికి ప్రాణం పోస్తున్న కార్మికుల జీవితాలు మాత్రం నిర్లక్ష్యంలోనే మగ్గిపోతున్నాయి. హెచ్ఐవీ, టీబీ వంటి అంటువ్యాధుల ముప్పు మధ్య సేవలందిస్తూ, ఉద్యోగ భద్రత లేకుండా, సామాజిక రక్షణ లేకుండా, రిటైర్మెంట్ హక్కులు లేకుండా ఈ ఉద్యోగులు జీవితం గడుపుతున్నారు. ప్రపంచం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మెడల్స్, ప్రసంగాలు, ప్రదర్శనలుంటాయి. కానీ తమ జీవితాలకు భరోసా ఇవ్వని వ్యవస్థపై ఈ ఉద్యోగులు నిశ్శబ్దంగా పోరాడుతూనే ఉంటారు. ఎయిడ్స్‌పై పోరాటంలో ముందు వరుసలో నిలిచిన వారు, తమ జీవన యుద్ధంలో మాత్రం ఒంటరిగానే మిగిలిపోతున్నారు. అంతర్జాతీయంగా ఎయిడ్స్‌ను ఎదుర్కొంటున్నప్పుడు, దేశంలో ఆ పోరాటాన్ని మోస్తున్న ఉద్యోగులను విస్మరించడమే నిజమైన విపరీతం. ప్రపంచం ఎయిడ్స్ దినం కేవలం క్యాండిల్ లైటింగ్, బ్యానర్ల కోసం కాదు. ఎయిడ్స్ నియంత్రణలో పనిచేస్తున్న ఉద్యోగుల జీవితాలకు కూడా వెలుగులు అవసరం.

ఆంధ్రప్రదేశ్‌లో హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, నిర్ధారణ, చికిత్స సేవలు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) ద్వారా అమలవుతున్నాయి. జిల్లా కేంద్ర ఆసుపత్రులు, ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల స్థాయిలో ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్), డీఎస్ఆర్‌సీ (సుఖవ్యాధుల చికిత్స కేంద్రాలు), ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల పంపిణీ, ఫాలోఅప్ సేవలు నిరంతరంగా అందు తున్నాయి. రోగ నిర్ధారణ నుంచి మందుల వరకూ, మానసిక సహాయం నుంచి కుటుంబ స్థాయి అవగాహన వరకూ ఈ వ్యవస్థ ఒక ప్రజారోగ్య మిషన్‌లా పనిచేస్తోంది. ఈ విస్తృతమైన సేవల వెనుక దాదాపు 1,200 మందికి పైగా ఏపీ శాక్స్ ఉద్యోగుల అహర్నిశల శ్రమ ఉంది. కౌన్సిలర్లు, జిల్లా సూపర్ వైజర్లు, డేటా మేనేజర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డాక్టర్స్, కేర్ కో ఆర్డినేటర్లు ఇలా అనేక విభాగాల్లో వారు రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని మోస్తున్నారు. అయినప్పటికీ, ఈ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వాల నుంచి రావాల్సిన గౌరవం, న్యాయం, భద్రత ఇప్పటికీ అందడం లేదు. ఏపీ శాక్స్ ఉద్యోగుల దీనగాథ రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి, కేంద్ర ప్రాయోజిత పథకాలలోని వ్యవస్థాగత లోపాలకు అద్దం పడుతోంది. ప్రాణాంతక హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణలో ముందువరుసలో నిలుస్తున్న ఈ ఉద్యోగులు నేడు ఆర్థిక అనిశ్చితి, ఉద్యోగ భద్రత లేని జీవితం, మానసిక వేదనల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. పాతికేళ్ల సేవకు ప్రతిఫలంగా దక్కుతున్నది చాలీచాలని వేతనం; భవిష్యత్తుకు భరోసా మాత్రం శూన్యం.

ఏపీ శాక్స్ ఉద్యోగులు నాకో మార్గదర్శకాల ప్రకారం పనిచేస్తున్నా, వారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కాదు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా కూడా గుర్తింపును పొందడం లేదు. పూర్తి స్థాయి కేంద్ర నిధులతో నడిచే ఈ పథకం అమలు మాత్రం రాష్ట్ర స్థాయి సమాజాల ద్వారా జరుగుతోంది. ఆసుపత్రులు, కార్యాలయాలు, సిబ్బంది, పర్యవేక్షణ రాష్ట్ర వ్యవస్థల్లోనే ఉన్నా, ఉద్యోగుల హక్కుల విషయంలో కేంద్రం-రాష్ట్రం పరస్పరం బాధ్యత నెట్టేసుకుంటున్నాయి. "ప్రజా ఆరోగ్యం" రాష్ట్ర జాబితాలోని అంశం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న ఏపీ శాక్స్ ఉద్యోగులకు "ఇది సెంట్రల్ సెక్టార్ స్కీమ్" అంటూ ప్రయోజనాలు నిరాకరించడం న్యాయపరంగా, నైతికంగా అంగీకార యోగ్యం కాదు. ఇరవై ఏళ్లకు పైగా సేవలందిస్తున్న అనేక మంది ఉద్యోగులకు ఇప్పటికీ ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్య బీమా, గ్రాట్యుటీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, డెత్ బెనిఫిట్స్ లేవు. ఇది ప్రజాశ్రేయస్సుకు అంకితమైన శ్రమకు ఇచ్చిన అవమానం. హెచ్ఐవీ, టీబీ వంటి అంటువ్యాధుల ముప్పు మధ్య పని చేస్తూ అనేక మంది ఉద్యోగులు ఆరోగ్యాన్ని, కొందరు జీవితం కూడా కోల్పోయారు. కానీ వారి కుటుంబాలకు ప్రభుత్వ పరిహారం లేదు, కారుణ్య నియామకం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 16, 21, 39(ఇ), 43(ఎ) సమానత్వం, సమాన ఉద్యోగావకాశాలు, గౌరవ జీవనం, దోపిడీ నిరోధం, తగిన వేతనం ఇవన్నీ ఈ ఉద్యోగుల విషయంలో నిరంతరం ఉల్లంఘనలకు గురవుతున్నాయి. వేతన నిర్ణయాల్లో కూడా వివక్ష స్పష్టమే. 2018 లో జీఓ నం. 27 ద్వారా రాష్ట్ర ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులకు 50% వేతన పెంపు, 2023 లో జీఓ నం. 167 ద్వారా 100% గ్రాస్ శాలరీ అమలు ఏపీ శాక్స్ కాంట్రాక్టు ఉద్యోగులకు నిరాకరించారు. మోదీ ప్రభుత్వం ఇటీవల తీసుకు వచ్చిన కొత్త లేబర్ కోడ్స్ కూడా ఈ ఉద్యోగుల జీవితాల్లో ఎలాంటి ఉపశమనం తీసుకురాలేదు. ఏపీ శాక్స్ ఉద్యోగులను రాష్ట్ర వ్యవస్థలోకి తీసుకుని క్రమబద్ధీకరించుకోవచ్చనీ, అందుకు కేంద్రానికి అభ్యంతరం లేదనీ, నిధులకు ఆటంకం ఉండదని 2014 ఆగస్టులోనే భారత ప్రభుత్వం రాతపూర్వకంగా రాష్ట్రానికి స్పష్టం చేసింది. 2019 లో ఏర్పాటైన సుజాతారావు కమిటీ కూడా ఇదే స్పష్టం చేసింది. ఎయిడ్స్ నియంత్రణ స్వల్పకాలిక పథకం కాదని, నిరంతర ప్రజారోగ్య కార్యక్రమమని గుర్తించి, దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉద్యోగుల రెగ్యులరైజేషన్ అవసరమని, కాంట్రాక్టుగా కొనసాగించడం చట్టపరమైన సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించింది. కేంద్ర నిధులు ఉన్నంత కాలం రెగ్యులరైజేషన్ వల్ల రాష్ట్రంపై పెద్ద భారం ఉండదని విశ్లేషించింది. సామాజిక భద్రత లేకుండా ఉద్యోగులను కొనసాగించడం మానవ హక్కుల ఉల్లంఘన అని పేర్కొంది. ఉద్యోగ భద్రత లేకుండా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం అసాధ్యమని కూడా తేల్చింది. ఏపీ శాక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం విలీనంచేసుకుని, హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో పాటు సాంక్రమికేతర వ్యాధుల నివారణ కార్యక్రమాల్లో కూడా ఈ అనుభవజ్ఞులైన ఉద్యోగుల సేవలను వినియోగించుకోవచ్చునన్న ఒక ప్రయోజనకర ప్రతిపాదన కూడా ఉంది. అది వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచుతుంది, ఉద్యోగులకు భద్రతను ఇస్తుంది. ఏపీ శాక్స్ ఉద్యోగులు అడుగుతున్నది విలాసాలు కాదు...హక్కులు. ఉద్యోగ భద్రత, సమాన వేతనం, సామాజిక భద్రత, కుటుంబ రక్షణ. ఇవి దయాధర్మాలు కాదు రాజ్యాంగ హామీలు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటే అది జీతం పెంపు మాత్రమే కాదు జీవితాలకు భరోసా. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసే నిర్ణయం.

రాష్ట్ర అధ్యక్షులు
ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయిస్ యూనియన్
(ఏఐటీయూసీ అనుబంధం)

మానవబాంబు బెదిరింపు

ముంబైలో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

ముంబై: మానవబాంబు ఉందంటూ బెదిరింపు రావడంతో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. కువైట్ నుంచి హైదరాబాద్ వస్తోన్న విమానంలో ఈ భయానక ఘటన చోటుచేసుకుంది. దాంతో అధికారులు విమానాన్ని ముంబైకి దారి మళ్లించారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కువైట్ నుంచి వస్తోన్న ఇండిగో విమానం మంగళవారం హైదరాబాద్‌లో ల్యాండ్ కావాల్సి ఉంది. అది రావడానికి ముందు హైదరాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. విమానంలో మానవబాంబు ఉందని ఆ మెయిల్ పంపిన దుండగులు బెదిరించారు. దాంతో అప్రమత్తమైన అధికారులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా విమానాన్ని దారి మళ్లించి... ముంబైలో అత్యవసరంగా దింపారు. తర్వాత విమానంతో సహా ప్రయాణికులను ఐసోలేషన్ ప్రాంతానికి తరలించి, ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

యూపీలో గ్యాంగ్‌స్టర్ కాల్చివేత

లక్నో: సినీఫక్కీలో అర్ధరాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో బవేరియా గ్యాంగ్ లీడర్ మిథున్ హతమయ్యాడు. ఉత్తరప్రదేశ్‌లోని బిదోలీ సమీపంలో దట్టమైన అడవుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. 20 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న అతడి తలపై రూ.1.25 లక్షల రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ఝింఝానా ప్రాంతంలో బవేరియా గ్యాంగ్ నేరపూరిత చర్యలకు పాల్పడేందుకు యత్నిస్తుందని పోలీసులకు సమాచారం అందింది. దాని ఆధారంగా పోలీసులు, ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఆ గ్యాంగ్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నాయి. అరెస్టు తప్పించుకునేందుకు ముఠా సభ్యులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, దాంతో పోలీసులు ఎదురుకాల్పులు జరపాల్సి వచ్చిందని అధికారులు వెల్లడించారు. దాంతో మిథున్ ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. అతడి అనుచరుడు ఒకరు తప్పించుకున్నాడని చెప్పారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడగా... పోలీస్ ఇన్‌స్పెక్టర్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని వెల్లడించారు.

రెడ్‌కార్పెట్ పరచాలా?

రోహింగ్యాల అక్రమ వలసలపై సుప్రీం

న్యూఢిల్లీ: రోహింగ్యా శరణార్థుల అదృశ్యంపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారికి... న్యాయస్థానం అసాధారణ రక్షణలు కల్పించాలా అని ప్రశ్నించింది. రోహింగ్యాలు అదృశ్యమవుతున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'వారికి రెడ్‌కార్పెట్ వేసి... ఆహ్వానించాలని మీరు కోరుకుంటున్నారా' అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. రోహింగ్యాలు సొరంగ మార్గాల ద్వారా భారత్‌లోకి వచ్చి... ఆహారం, ఆశ్రయం వంటి హక్కులను డిమాండ్ చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. 'ఉత్తర భారతదేశంలో మనకు చాలా సున్నితమైన సరిహద్దు ఉంది. చొరబాటుదారులు చట్టవిరుద్ధంగా ప్రవేశిస్తే... వారిని ఇక్కడ ఉంచాల్సిన బాధ్యత మనకు ఉందా' అని వ్యాఖ్యానించింది.

ఇండిగోకు జీఎస్టీ షాక్

రూ.117 కోట్ల భారీ జరిమానా

న్యూఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు జీఎస్టీ షాక్ తగిలింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనలకు సంబంధించి కొచ్చి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ రూ. 117.52 కోట్ల జరిమానా విధించింది. ఈ మేరకు మంగళవారం కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. 2018-19, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి కంపెనీ క్లెయిమ్ చేసిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను జీఎస్టీ అధికారులు తిరస్కరించారు. ఈ నేపథ్యంలోనే రూ.1,17,52,86,402 జరిమానాతో పాటు డిమాండ్ ఆర్డర్ జారీ చేసినట్లు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ తన ఫైలింగ్‌లో పేర్కొంది. అయితే, అధికారుల ఆదేశాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, దీనిపై న్యాయపరంగా తమకు గెలిచే అవకాశాలు బలంగా ఉన్నాయని కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది.

71ఏళ్ల వయసులో ప్రభుత్వ కొలువు పొందినట్టు ఉంది: కమల్ హాసన్



తిరువనంతపురం: మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, నటుడు కమల్‌హాసన్ ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఇలా పెద్దలసభలో ఎంపీగా ఎన్నికైనప్పుడు మీ అనుభూతి ఏమిటని కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో ఓ వ్యక్తి ప్రశ్నించారు. దానికి బదులుగా కమల్ ... ఏడు పదుల వయసులో ప్రభుత్వ కొలువు పొందినట్టుగా ఉందని సమాధానమిచ్చారు. 'ఆ క్షణంలో నా తల్లిదండ్రులు డి.శ్రీనివాసన్ అయ్యంగార్, రాజ్యలక్ష్మిలను తలచుకున్నాను. నేను రాజ్యసభకు వెళ్లి సంతకం చేసినప్పుడు వారే గుర్తుకొచ్చారు. తాను స్కూల్లో ఓ డ్రాపౌట్ స్టూడెంట్‌ను. కనీసం ఎస్‌ఎస్‌ఎల్సీ పాసైనా... నాకు రైల్వేలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చేదని మా అమ్మ ఎప్పుడూ అంటుండేవారు. అలాంటిది 71 ఏళ్ల వయసులో ఉద్యోగం సాధించినట్టుంది. ఆ సమయంలో నా తల్లికి ఫోన్ చేసి... ప్రభుత్వ కొలువులో పనిచేస్తున్నానని చెప్పాలనిపించేంత గర్వంగా అనిపించింది' అని కమల్ హాసన్ తన రాజ్యసభ ఎంపీ అనుభవాన్ని పంచుకున్నారు. తనను తాను మధ్యేవాదిగా చెప్పుకుంటానని పేర్కొన్నారు. తన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ కూడా తాను సైద్ధాంతికంగా నమ్మే అంశాలకు మద్దతిస్తోందని ఆయన స్పష్టం చేశారు. కమల్ చివరిసారిగా... మణిరత్నం దర్శకత్వం వహించిన 'థగ్ లైఫ్' మూవీలో నటించారు. అయితే... ఆ సినిమాకు అనుకున్నంత స్పందన రాలేదు.

'సంచార్ సాథీ'పై దుమారం

- దద్దరిల్లిన పార్లమెంటు
- గోప్యత హక్కును కాలరాస్తారా?
- ప్రతిపక్షాల ఆందోళన
- దిగొచ్చిన కేంద్రం
- తప్పనిసరి కాదంటూ కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య వివరణ

న్యూఢిల్లీ: 'సంచార్ సాథీ ' అంశం పార్లమెంట్‌ను కుదిపేస్తోంది. భారత్‌లో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఇది రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై పార్లమెంట్‌లో మంగళవారం తీవ్ర చర్చ జరిగింది. ప్రతిపక్ష ఇండియా ఐక్యసంఘటన పార్టీలు సభా కార్యక్రమాలను అడ్డుకోవడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ అంశంపై వాయిదా తీర్మానం పెట్టిన కాంగ్రెస్... సంచార్ సాథీపై విస్తృత చర్చ జరపాలని డిమాండ్ చేసింది.ఫోన్ యూజర్ల కదలికలు, సందేశాలు, కాల్స్‌పై ప్రభుత్వం నిఘా పెడుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇదొక డిస్టోపియన్ టూల్ అని దుయ్యబట్టారు. ప్రతి భారతీయుడిపైనా నిఘా పెట్టడమే కాకుండా వారి ఆర్థిక హక్కులపై దాడిగా వేణుగోపాల్ అభివర్ణించారు. దీని అమలు రాజ్యాంగ విరుద్ధమని ఆయన విమర్శించారు. ఈ అంశంపై రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి వాయిదా తీర్మానం ఇచ్చారు. ఇది దారుణమైన పరిణామని, భవిష్యత్తుల్లో నియంతృత్వానికి దారితీస్తుందని శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది ధ్వజమెత్తారు. ప్రజల గోప్యతను హరిస్తుందని దుయ్యబట్టారు. అలాగే, టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ కూడా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఈ నేపథ్యంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టతనిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... అవసరం లేదనుకుంటే యూజర్లు సంచార్ సాథీ యాప్‌ను తొలగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. 'దాన్ని యాక్టివేట్ చేయకండి (సంచార్ సాథీ). యాప్‌ను మీ ఫోన్‌లో ఉంచడం.. తొలగించడం అంతా మీ ఇష్టం. ఉదాహరణకు మీరు ఫోన్ కొన్నప్పుడు, చాలా యాప్‌లు ముందే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి.. గూగుల్ మ్యాప్స్ కూడా వస్తుంది.. గూగుల్ మ్యాప్స్‌ను వాడకూడదు అనుకుంటే దాన్ని తొలగించుకోవచ్చు' అని అన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ల నుంచి గూగుల్ మ్యాప్‌లను డిలీట్ చేయడం సాధ్యం కాదు. కానీ, దాన్ని డిసేబుల్ చేయవచ్చు. ఐఫోన్లలో మాత్రం గూగుల్ మ్యాప్స్‌ను పూర్తిగా డిలీట్ చేయొచ్చు. మంత్రి మాత్రం సంచార్ సాథీకి సంబంధించిన అపోహలను తొలగించడానికి తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. "ఇది వినియోగదారుల భద్రతకు సంబంధించిన అంశం. ఇందులో ఏది తప్పనిసరి కాదు. ఇష్టం లేకుంటే మీరు రిజిస్టర్ చేసుకోవద్దు.. అది అలా డార్మెంట్‌గా ఉంటుంది. మీకు డిలీట్ చేయాలనిపిస్తే, డిలీట్ చేయండి. కానీ దేశంలోని ప్రతి వ్యక్తికి మోసాల నుంచి తమను రక్షించడానికి ఒక యాప్ ఉందని తెలియదు. అందుకే ఈ సమాచారాన్ని విస్తృతంగా తెలియజేయడం మా బాధ్యత' అని ఆయన కేంద్రం మార్గదర్శకాలపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. దేశంలో ఇక నుంచి విక్రయించే ప్రతి సెల్‌ఫోన్‌లో తప్పనిసరిగా 'సంచార్ సాథీ' యాప్ ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలని ఫోన్ దిగుమతిదార్లు, తయారీదార్లను టెలికాం శాఖ ఆదేశించింది. 90 రోజుల్లోపు ఈ నిబంధనలను అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటికే విక్రయించిన ఫోన్లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలని పేర్కొంది. ఈ దిశగా తీసుకున్న చర్యలకు సంబంధించిన కంప్లయెన్స్ నివేదికను 120 రోజుల్లోగా సమర్పించాలని తెలిపింది. ఈ యాప్ ఫోన్ యూజర్లకు స్పష్టంగా కనిపించేలా ఇన్‌స్టాల్ చేయాలని, మొదటిసారి డివైజ్ సెటప్ సమయంలోనే ఇది యూజర్లకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం యాపిల్, సామ్‌సంగ్, గూగుల్, వివో, ఒప్పో, షియోమీ వంటి ప్రధాన కంపెనీలు ఇండియాలో హ్యాండ్‌సెట్లు తయారు చేస్తున్నారు. వీటికి తాజా ఆదేశాలు వర్తిస్తాయి.

రెండు విడతల్లో 'జన గణన'

కులగణన కూడా అప్పుడే
డిజిటల్ విధానంలో నిర్వహిస్తాం
కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జనగణన కార్యక్రమం రెండు విడతల్లో చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. జనగణనతో పాటే కులగణన కూడా ఉంటుందని వెల్లడించింది. డిజిటల్ విధానంలో 2026 ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు వెల్లడించింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్‌రాయ్ సమాధానం ఇస్తూ... జనగణన గురించి వివరణ ఇచ్చారు. జన గణన మొదటి విడతలో హౌస్ లిస్టింగ్, సెన్సెస్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగుతుంది. అయితే ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని తెలిపారు. 'జన గణన 2027 ఫిబ్రవరి నుంచి మార్చి1 మధ్యలో జరుగుతుంది. అయితే లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లో మంచుతో కప్పపడే నాన్-సింక్రోనస్ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది' అన్నారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్లు మంత్రి చెప్పారు. దేశంలో జన గణనకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాలను తదుపరి జన గణన కోసం పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ... ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా కుల గణన కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు తెలిపారు. మరో ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ... 2027 జనాభా లెక్కింపు డిజిటల్ వేలో నిర్వహిస్తామని, మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఈ డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. ఇంతకు మునుపే రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్పీజీ/పీఎన్జీ కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరియల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి. దేశంలో చివరిసారి 2011లో జనాభా లెక్కలు సేకరించారు. ఆ తర్వాత కోవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన నిలిచిపోయింది. త్వరలో చేపట్టనున్నది 16వ జనాభా గణన. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత లెక్కవేసుకుంటే ఇది ఎనిమిదోసారి.

త్వరలో ఐఎన్ఎస్ అరిదమన్ జలప్రవేశం

నేవీ చీఫ్ అడ్మిరల్

న్యూఢిల్లీ: స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అణ్వాయుధ సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమన్‌ను త్వరలో జలప్రవేశం చేయనున్నట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి తెలిపారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్ట్ 75 ఇండియా కింద ఆరు అత్యాధునిక సబ్‌మెరైన్లను కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. త్వరలో కాంట్రాక్టు కుదరనున్నదన్నారు. 2029 నాటికి నేవీలోకి నాలుగు రఫేల్ యుద్ధ విమానాలు రానున్నట్లు చెప్పారు. గత ఏడాది నేవీ డే నుంచి ఇప్పటి వరకు ఓ సబ్‌మెరైన్‌తో పాటు నేవీ షిప్‌లను సొంతం చేసుకున్నట్టు తెలిపారు. ఐఎన్ఎస్ ఉదయ్‌గిరిని తమకు చెందిన నేవీ డిజైన్ బ్యూరో డిజైన్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మాక్రన్ తీరం వద్ద పాకిస్థాన్ నేవీని ఐఎన్ఎస్ ఉదయ్‌గిరి అడ్డుకున్నట్లు చెప్పారు.

కాల్పుల విరమణ కోరింది పాకిస్థానే

వైస్ అడ్మిరల్ స్వామినాథన్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో నౌకాదళం దాడుల ముప్పును గ్రహించే పాకిస్థాన్, కాల్పుల విరమణ కోసం ప్రాథేయపడినట్లు నౌకాదళం వైస్ అడ్మిరల్ కె.స్వామినాథన్ మీడియాకు తెలిపారు.ఆపరేషన్ సిందూర్ సందర్భంగా అతితక్కువ సమయంలో 30కిపైగా నౌకలను, జలాంతర్గాములను సమీకరించినట్లు చెప్పారు. విక్రాంత్ క్యారియర్ బ్యాటిల్ గ్రూప్‌లో భాగంగా మక్రాన్ తీరంలో నౌకలను ముందు వరుసలో నిలిపినట్లు వెల్లడించారు. 'ఏప్రిల్‌లో వరుసగా ఆయుధ పేలుళ్ల విజయవంతంగా నిర్వహించటం సహా భారత నౌకాదళం మోహరింపు వల్ల పాకిస్థాన్ నౌకాదళం తన తీరప్రాంతానికే పరిమితమైంది. భారత నౌకాదళం దాడుల ముప్పును గ్రహించి పాకిస్థాన్ కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేయటానికి ఒక కారణం' అని స్వామినాథన్ వివరించారు. అంతకుముందు జరిగిన ఓ సమావేశంలో పాక్ ఆయుధ సంపత్తి గురించి స్వామినాథన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రపంచ నలుమూలల నుంచి పాక్ ఆయుధాలను సేకరించడం ఆదోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. సైనిక సామర్థ్యాలను పెంచుకునే పనిలో పాక్ నిమగ్నమైందని వ్యాఖ్యానించారు. మరోవైపు చైనా నేవీ కూడా ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద దళంగా మారిందని తెలిపారు. చైనా హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఐదు నుంచి ఎనిమిది వాహన నౌకలను ఏర్పాటు చేసిందని, దీంతో మరింత దృఢంగా మారుతోందని పేర్కొన్నారు.

పాకిస్థాన్ తప్పుడు ప్రచారం: భారత్

న్యూఢిల్లీ: దిత్వా తుపానుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీలంకను ఆదుకునేందుకు భారత్ రంగంలోకి దిగింది. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట మానవతాసాయాన్ని అందిస్తోంది. శ్రీలంకకు తామూ సాయం చేస్తామన్న పాక్‌కు కూడా భారత్ సహకరించింది. పాక్ విమానాలు భారత గగనతలం మీదుగా శ్రీలంక చేరేందుకు అడిగిన వెంటనే అనుమతించింది. అయితే, భారత్‌పై దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్న పాక్ మరోసారి తన కుయుక్తులు ప్రయోగించింది. పాక్ మీడియా భారత్‌పై తప్పుడు వార్తలు వండివార్చింది. మానవతా సాయానికి ఉద్దేశించిన విమానాలను భారత్ తన గగనతలంలోకి అనుమతించలేదంటూ వార్తలు ప్రచురించింది. పాక్ దుష్ప్రచారాన్ని భారత్ వర్గాలు వెంటనే ఖండించాయి. పాక్ అడిగిన వెంటనే కావాల్సిన అనుమతులు ఇచ్చామని తెలిపాయి. ప్రామాణిక పద్ధతులు, సాంకేతిక అంశాలు, భద్రతాపరమైన సమస్యలను పరిగణనలోకి తీసుకుని అనుమతులు ఇచ్చామని తెలిపాయి. భారత వర్గాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పాక్ అధికారికంగా అనుమతి కోరింది. సంక్షోభంలో ఉన్న శ్రీలంక ప్రజలను దృష్టిలో పెట్టుకుని భారత్ అత్యంత వేగంగా స్పందించింది. కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కావాల్సిన అనుమతులు జారీ చేసింది. పాక్ మీడియా వార్తలన్నీ అసత్యాలేనని భారత వర్గాలు తేల్చి చెప్పాయి. శ్రీలంకను ఆదుకునేందుకు భారత్ 53 టన్నుల వివిధ రకాల సహాయక సామగ్రి పంపింది. శ్రీలంక ఎయిర్ ఫోర్స్‌తో కలిసి భారత నేవీ పలు సహాయక చర్యల్లో పాల్గొంటోంది. జాతీయ విపత్తు నిర్వహణ బృందం, వైద్య బృందాన్ని కూడా శ్రీలంకకు పంపించింది. ఇందుకుగాను భారత్‌కు శ్రీలంక ధన్యవాదాలు తెలిపింది. దిత్వా బారినపడి ఇప్పటివరకూ 360 మంది కన్నుమూశారు.

గుజరాత్ మునిగిపోతోంది

రాహుల్‌గాంధీ విమర్శ

న్యూఢిల్లీ: డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నప్పటికీ... గుజరాత్ మునిగిపోతోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో డ్రగ్స్, అక్రమ మద్యం ముప్పు పెరిగిపోతోందని మండిపడ్డారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న జన ఆక్రోశ్ యాత్ర సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు డ్రగ్స్, అక్రమమద్యం, నేరాల ముప్పు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. 'గుజరాత్ మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టిన భూమి. ఇక్కడ సత్యం, నైతికత, న్యాయం, సంప్రదాయం ప్రబలంగా ఉన్నాయి. కానీ కొన్ని సంవత్సరాలుగా, రాష్ట్ర యువత భవిష్యత్తు మాదకద్రవ్యాలు, నేరాలు చీకటి ప్రపంచం వైపు నెట్టబడుతోంది' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అధికారంలో ఉన్న వారి నుండి నేరస్థులకు రక్షణ లభిస్తున్నందున. వారు నిర్లక్ష్యం చేయబడటం వలనే మహిళలు పెద్దసంఖ్యలో వీధుల్లోకి వస్తున్నారని అన్నారు. 'గుజరాత్ అడుగుతోంది. బీజేపీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది. ఏ బీజేపీ మంత్రి వీటన్నింటికీ రక్షణ కల్పిస్తున్నారు. గుజరాత్‌కి దేశద్రోహం చేసేవారిని ఎందుకు కాపాడుతున్నారు' అని పేర్కొన్నారు. జన ఆక్రోశ్ యాత్ర సమయంలో మరో ప్రధాన సమస్య రైతుల గురించి కూడా ప్రస్తావనకు వచ్చిందని అన్నారు. ఇటీవల వచ్చిన వినాశకరమైన వరదలు వేలాది గుజరాతీ కుటుంబాలను నాశనం చేశాయి. రైతుల పంటలను నాశనం చేశాయి. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, సహాయ ప్యాకేజీల గురించి మాట్లాడుతూనే ఉన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నా... నేడు గుజరాత్ మునిగిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రధాని అయినప్పటికీ గుజరాత్‌కు తగిన ఉపశమనం లభించలేదని మండిపడ్డారు. ప్రతి కుటుంబం తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతోందని అన్నారు. రైతుల రుణాలు ఎందుకు మాఫీ చేయలేదని, డ్రగ్స్‌ను ఎందుకు అరికట్టడం లేదని ప్రతి కుటుంబం ప్రశ్నిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆందోళనలను వింటూనే ఉంటుందని, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని నిరంతరం బయటపెడుతోందని చెప్పారు.

బీజేపీ అభ్యర్థిగా సోనియా గాంధీ

కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారిన స్థానిక ఎన్నికలు

తిరువనంతపురం: రాష్ట్రంలో విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. అక్కడ స్థానిక ఎన్నికల్లో బీజేపీ తన అభ్యర్థిగా 'సోనియా గాంధీ'ని నిలబెట్టింది. ఆ పార్టీ నిర్ణయం అక్కడి కాంగ్రెస్ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. ఏం జరిగిందంటే.. మరో వారం రోజుల్లో కేరళ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు దశల్లో ... అంటే ఈ నెల తొమ్మిది, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. 13న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు సమయాత్తమవుతున్నాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోటాపోటీగా అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు వ్యూహాలకు పదునుపెడుతోంది. ఇందులో భాగంగానే మున్నార్ పంచాయతీ ఎన్నికల్లో 'సోనియా గాంధీ' అనే మహిళను బరిలోకి దింపింది. ఇక ఈ స్థానానికి కాంగ్రెస్ మంజుల రమేష్‌ను నిలబెట్టింది. అయితే, ప్రత్యర్థి పేరు ...కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ పేరు కావడంతో ఆ పార్టీకి ఇది పెద్ద తలనొప్పిగా మారింది. సోనియా గాంధీ పేరుండడం వల్ల ఎన్నికల సమయంలో ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో బీజేపీ అభ్యర్థి 'సోనియా గాంధీ' పేరు స్థానికంగా మార్మోగిపోతోంది. ఆ మహిళ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

యడియూరప్పకు ఊరట

పోక్సో కేసు విచారణపై సుప్రీం స్టే



బెంగళూరు: కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అతడిపై చేపట్టిన పోక్సో విచారణపై సుప్రీంకోర్టు మంగళవారం స్టే విధించింది. విచారణ ప్రక్రియను నిలిపివేయడంతో పాటు, యడియూరప్పపై ఉన్న కేసును రాష్ట్ర హైకోర్టుకు తిరిగి ఎందుకు బదిలీ చేయకూడదో తెలియజేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కర్నాటక సీఐడీకి నోటీసులు జారీ చేసింది. కేవలం అస్పష్టమైన, సాంకేతిక కారణాలతో ఈ అంశం యోగ్యతను పరిశీలించలేమని పేర్కొంటూ ... నవంబరు 13న తమ క్లయింట్‌పై కేసును కొట్టివేయడానికి హైకోర్టు నిరాకరించిందని యడియూరప్ప తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూత్రా, సిద్ధార్థ్ దేవ్ వాదనలు వినిపించారు. గతేడాది ఫిబ్రవరిలో బెంగళూరులోని తన నివాసంలో జరిగిన బీజేపీ సమావేశంలో తనపై, తన 17ఏళ్ల కుమార్తెపై యడియూరప్ప లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2024, మార్చి 14న సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసి సీఐడీకి బదిలీ చేశారు. సీఐడీ పోక్సో కింద ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి, చార్జిషీట్ దాఖలు చేసింది.

నాందేడ్ పరువు హత్య కేసులో

కీలక విషయాలు

నాందేడ్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఇటీవల ప్రేమించిన వ్యక్తిని తండ్రి, సోదరుడు హత్య చేయగా.. ఓ యువతి తన ప్రియుడి మృతదేహాన్ని పెళ్లి చేసుకున్న ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ పరువు హత్య కేసులో మరో కీలక విషయం బయటకు వచ్చింది. హంతకుల కుటుంబంతో మృతుడు సక్షం టాటేకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లో నిందితులు గజానన్, సాహిల్, హిమేష్‌తో కలిసి సక్షం నృత్యం చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అచల్, ఆమె తండ్రి గజానన్ కొందరు యువకులతో కలిసి నృత్యం చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వారిలో సక్షం కూడా ఉన్నాడు. తన కుటుంబసభ్యులు సక్షంతో సన్నిహితంగా ఉండేవారని... తమ వివాహానికి కూడా ఒప్పుకున్నారని అచల్ జాతీయమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. అయితే పెళ్లి జరగాలంటే అతడు మతం మార్చుకోవాలని షరతు పెట్టడంతో అందుకు కూడా ఒప్పుకున్నాడని... అంతలోనే ఈ దారుణం జరిగిందని వాపోయింది. సక్షంను హత్య చేయడానికి ముందు తన సోదరులు తనను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి... అతడిపై కేసు పెట్టాలని ఒత్తిడి చేశారని... అందుకు తాను నిరాకరించడంతో సక్షంను హత్యచేశారని, వారికి పోలీసులు కూడా సహకరించినట్లు ఆరోపించింది. తమ కుమార్తె వేరే కులం వ్యక్తిని ప్రేమించిందని, ఈ విషయం బయటకు తెలిస్తే తమ పరువు పోతుందని భావించిన గజానన్ అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి కుమార్తె ప్రేమించిన వ్యక్తిని హత్య చేసిన ఘటన ఇటీవల మహారాష్ట్రలోని నాందేడ్‌లో చోటుచేసుకుంది.

దీంతో యువతి తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు, వారి స్నేహితులు సహా మొత్తం 8 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు. అదేరోజు సక్షం అంతిమ సంస్కారాల్లో పాల్గొన్న అచల్ ప్రాణం పోయినా అతడే తన భర్త అంటూ ప్రియుడి మృతదేహాన్ని వివాహం చేసుకుంది. అతడిని హత్య చేసిన తన కుటుంబసభ్యులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేసింది.

విశాలాంధ్ర
హైదరాబాద్

పారిశుధ్య కార్మికులకు సత్కారం

విశాలాంధ్ర, కాప్రా : నిత్యం వీధులను అద్దంలా తీర్చిదిద్దే పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని ప్రముఖ పారిశ్రామికవేత్త బొండాడ గ్రూప్ చైర్మన్ బొండాడ రాఘవేంద్రరావు అన్నారు. బొండాడ గ్రూప్ ఆధ్వర్యంలో కుషాయిగూడ పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను మంగళవారం ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలను అందజేశారు. పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవి అని వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఆయన అన్నారు. సేవా కార్యక్రమాలలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందనన్నారు. ఈ కార్యక్రమంలో బొండాడ గ్రూప్ సీఈఓ సత్యనారాయణ, గురురాజ్, కుమార్ తదితర ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం 129 డివిజన్ షాపూర్‌నగర్‌కి చెందిన ప్రవలిక గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆర్థిక పరిస్థితి బాగోలేక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50000, అదే విధంగా నిజాంపేట్ వాసులు కీర్తికి రూ.20000 ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొలను హన్మంత్‌రెడ్డి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ సిద్దనోల సంజీవ రెడ్డి,లక్ష్మణ్, అజాం తదితరులు పాల్గొన్నారు

స్రవంతి సేవాభావంపై మేయర్ ప్రశంస

విశాలాంధ్ర, హైదరాబాదు : సమాజ సేవకు పదవో, ఉన్నతోద్యోగమో కాదు. మంచి మనసు ఉంటే చాలు అని నిరూపిస్తున్న జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలు స్రవంతిని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అభినందించారు. గత పది సంవత్సరాల నుంచి పారిశుధ్య కార్మికురాలిగా సేవలందిస్తున్న స్రవంతి, నలుగురికి ఉపయోగపడే విద్యే నిజమైన విద్య అన్న సందేశాన్ని ఓ సమావేశంలో విన్నారు. ఆ ప్రేరణతో నాలుగేళ్ల క్రితం నుంచే స్థానికంగా పేద పిల్లలకు ఉచిత ట్యూషన్లు ప్రారంభించింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుండి 7.30 గంటల వరకు నర్సరీ నుండి ఆరో తరగతి వరకు పిల్లలకు పాఠాలు చెబుతూ ఇప్పటివరకు వందల మంది విద్యార్థులను అక్షరాస్యులను చేసింది.ఆమె సేవాభావంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తన అధికారిక ఎక్స్ , ఫేస్ బుక్ హ్యాండిల్‌లో ప్రశంసించారు. ఉదయం నగరాన్ని శుభ్రం చేసే మా జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలు సాయంత్రం పేద పిల్లలకు గురువుగా మారడం నిజంగా అభినందనీయం. ఆమె సేవాభావం, సమాజాభ్యున్నతికి కట్టుబాటు ఎనలేనిది. ఇలాంటి నిస్వార్థ సేవా యోధులు మా జీహెచ్ఎంసీ కుటుంబంలో ఉండటం గర్వంగా ఉంది. ఇటువంటి నిజమైన హీరోలను జీహెచ్ఎంసీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంది అంటూ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అభినందించారు.

ప్రజా సమస్యలు పరిష్కారించాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 311 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 113, రెవెన్యూ శాఖకు సంబంధించి 34, ఇందిరమ్మ ఇండ్ల కోసం 87, మున్సిపల్ శాఖకు 24, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 52 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అనేక సమస్యలను పరిష్కరించారు.

త్వరలో ల్యాబ్ టెక్నీషియన్స్ కు పోస్టింగ్స్ : చిన్నారెడ్డి

పోటీ పరీక్షల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 1,260 మంది ల్యాబ్ టెక్నీషియన్స్ కు త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి తెలిపారు.మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజా భవన్ కు భారీ ఎత్తున ల్యాబ్ టెక్నీషియన్స్ తరలి వచ్చారు. తమకు పోస్టింగ్స్ త్వరగా ఇప్పించాలని ల్యాబ్ టెక్నీషియన్స్ కోరారు. వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడిన చిన్నారెడ్డి త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు ల్యాబ్ టెక్నీషియన్స్ కు తెలిపారు. దీంతో ల్యాబ్ టెక్నీషియన్స్ సంతోషం వ్యక్తం చేశారు.

వ్యర్థాల నుంచి ఖనిజాల వెలికితీత ఒప్పందం

విశాలాంధ్ర, హైదరాబాద్ : సింగరేణి వ్యాప్తంగా ఉన్న బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇతర కీలక ఖనిజాలను అన్వేషించి వాటిని వెలికి తీసేందుకు ప్రముఖ పరిశోధన సంస్థ సీఎస్ఐఆర్- ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ) తో సంయుక్త భాగస్వామ్యంలో పని చేసేందుకు సింగరేణి కాలరీస్ కీలక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా సింగరేణి ప్రాంతాల్లో షేల్, మట్టి, సాండ్‌స్టోన్, గ్రానైట్ రాళ్లు, బొగ్గు ఫ్లై యాష్, బాటమ్ యాష్‌లలో నిక్షిప్తమై ఉన్న కీలక ఖనిజాలను వెలికితీయనున్నారు. మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సమక్షంలో ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించేందుకు అనుగుణంగా ఇరుపక్షాలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కీలక ఖనిజ రంగంలో పరస్పర సహకారం కోసం ఈ ఏడాది జూన్‌లో తొలుత ఒక అవగాహన కుదుర్చుకున్నామని, తాజా ఒప్పందంతో ఈ ప్రాజెక్టు ప్రారంభానికి బలమైన ముందడుగు పడిందని ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. సింగరేణి ప్రాంతంలోని ఓపెన్ కాస్టు గనుల్లో, ఎస్టీపీపీ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్, బాటమ్ యాష్లో, ఇక్కడి గుట్టల్లో కీలక ఖనిజాల ఉనికిని ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులలో కొన్నింటిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించబడిందని, అలాగే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విద్యుత్ ఉత్పత్తి సందర్భంగా విడుదల అయ్యే ఫ్లై యాష్ లో కూడా వీటిని కనుగొనడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే మణుగూరుకు సమీపంలోని దుర్గం గుట్ట బ్లాకులో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు శాంపిల్స్ ద్వారా నిర్ధారించారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో 14 రకాల ఖనిజాల ఉనికి కనుగొనబడిందని, వీటిలో లాంథనం, సీరియమ్, ప్రసియోడీమియం వంటి 6 రకాల లైట్ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, అలాగే ఇట్రియం, స్కాండియం, డిస్ప్రోజియం వంటి 8 రకాల హెవీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికిని కనుగొన్నామని, వీటిపై ఇంకా సంపూర్ణ పరిశీలన, విశ్లేషణ, లాభదాయకత శాతాన్ని బట్టి ఉత్పత్తి ప్రక్రియ వంటి అంశాలను ఐఎంఎంటి సంస్థ ద్వారా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ నారాయణ్ మాట్లాడుతూ.. పారిశ్రామిక వ్యర్థాల నుండి క్రిటికల్ మినరల్స్ వెలికితీత, స్వదేశీ సాంకేతిక పద్ధతుల అభివృద్ధి ప్రధాన లక్ష్యమన్నారు. భారతదేశంలో గ్రీన్ టెక్నాలజీ కి అవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, క్రిటికల్ మినరల్స్ భద్రత దిశగా ఇది గొప్ప ముందడుగు అన్నారు. ఇది లాభదాయకంగా ఖనిజాల వెలికితీత అవకాశాలకు బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలపై సి ఎస్ ఐ ఆర్ - ఐఎంఎంటి చీఫ్ సైంటిస్ట్ మరియు హైడ్రో, ఎలక్ట్రో మెటలర్జీ శాఖ హెడ్ డాక్టర్ కాళీ సంజయ్, సింగరేణి సంస్థ నుండి కార్యక్రమంలో డైరెక్టర్(పి అండ్ పి) కె.వెంకటేశ్వర్లు సంతకాలు చేశారు. ఈడీ ఎస్టీపీపీ చిరంజీవి, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎక్స్ప్లోరేషన్ బి.శ్రీనివాస్, జీఎం చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి

నేడు మహాధర్నాకు జర్నలిస్టులు తరలిరావాలి : విరాహత్ అలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తు చేపడుతున్న ధర్నాకు జర్నలిస్టు లోకం తరలి రావాలని టియుడబ్ల్యుజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ కోరారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో 12 సంవత్సరాల కాలంలో అత్యంత నిరాదరణకు గురైనవర్గం జర్నలిస్టులేననడంలో ఎంత మాత్రం సందేహం లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టుల జీవితాలు గత పుష్కర కాలంలో ఏ మాత్రం మెరుగు పడలేదని, ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు సైతం అందకుండా పోయాయని, నాడు పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక వృత్తి సౌకర్యాలు సైతం మాయమైపోయాయన్నారు. ఉద్యమ కాలంలోనూ, ఆ తర్వాత పదేళ్ల పాలనలోనూ బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమైపోయాయని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో పయనిస్తుందని, నూతన పాలసీని రూపొందించి అక్రెడిటేషన్లు జారీ చేయడం, ఆరోగ్య భద్రత కల్పించడం, ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం, అనేక వృత్తి కమిటీలను పునరుద్ధరించడం వంటి కనీస సౌకర్యాలు కల్పనలో ప్రభుత్వం తీవ్రమైన అలక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. మీడియా విషయాలను పట్టించుకోవాల్సిన సమాచార శాఖ కమిషనర్లను తరచూ మార్చడం, ఆ శాఖను నిర్వహిస్తున్న మంత్రి దాని మీద దృష్టి సారించకపోవడం జర్నలిస్టులలో ఆందోళన కలిగించిందని, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో సమాచార శాఖ పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందాలు గత రెండేళ్ల కాలంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని అనేక దఫాలు కలిసి జర్నలిస్టుల సమస్యలపైన, సంక్షేమంపైన విజ్ఞాపన పత్రాలు సమర్పించాయని, కలిసిన ప్రతిసారీ మంత్రి స్పష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చకపోవడం విచారకరమన్నారు. అంతేకాకుండా గడిచిన రెండేళ్ల కాలంలో సమాచార శాఖ కమిషనర్లకు పలుమార్లు వినతి పత్రాలు అందించినా ఎలాంటి స్పందన లేదని, ప్రభుత్వ వైఖరి పట్ల రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో సహా 33 జిల్లాల్లో జర్నలిస్టుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, దీనితో ప్రత్యక్ష కార్యాచరణకు దిగక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. మన న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి పోరుబాట పట్టాలని నవంబర్ 6న జరిగిన యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా మాసాబ్ ట్యాంక్, హైద్రాబాద్‌లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద డిసెంబర్ 3, ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించాలని టియుడబ్ల్యూజే నిర్ణయించిందన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి జర్నలిస్టులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలి, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలనే డిమాండ్లతో ధర్నా కొనసాగుతోందన్నారు.

ఘనంగా తెలుగు వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలుగు భాషా సాహిత్య వికాసమే లక్ష్యంగా ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయం 40వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం వర్సిటీలోని ఎన్టీఆర్ కళామందిరంలో ఘనంగా జరిగింది. వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా ప్రతీ యేటా వివిధ రంగాలలో నిష్ణాతులైన ఒకరిని విశ్వవిద్యాలయం ఎంపిక చేసి నగదు పురస్కారంతో విశిష్ట పురస్కారాన్ని అందజేసింది. ఈ యేడాదికిగాను సాహిత్యరంగంలో విశేష కృషి చేసిన డా. శ్రీరంగాచార్యకి లక్ష రూపాయల నగదుతోపాటు ప్రశంసా పత్రం, ప్రత్యేక జ్ఞాపికను ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణా ప్రభుత్వ పూర్వసలహాదారు డా.కె.వి.రమణాచారి విశిష్ట పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ జిలా చెందుపట్ల గ్రామంలో జన్మించి, సారస్వత రంగంలో నిత్య అధ్యయనం చేస్తూ విశేష గ్రంథ రచనలను చేసి మహబూబ్ నగర్ పాలెం ప్రాచ్యకళాశాలలో అధ్యాపకుడిగా రాణించి తన విద్యార్థులను సాహిత్య రంగంలో లబ్ధప్రతుష్టులను చేసిన సాహితీమూర్తి రంగాచార్య అని కొనియాడారు. విద్యార్థులకు విద్యతోపాటు జీవన మార్గదర్శకం చేసిన గురువులను మరచిపోకుండా గుర్తుంచుకుని సందర్భోచితంగా సత్కరించుకోవాలని వర్సిటీ విద్యార్థులకు హితబోధ చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు నిత్యానందరావుకు ప్రత్యక్ష గురువైన శ్రీరంగాచార్యకు విశిష్ట పురస్కారంతో సత్కరించుకోవడం అభినందనీయమని అన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ శ్రీ రంగాచార్య తన అధ్యాపక వృత్తిలో విద్యాపాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా బోధిస్తూ పిల్లల పట్ల పితృవాత్సల్యాన్ని చూపించేవారని అందుకు ప్రత్యక్షసాక్షిగా నేను నిలుస్తాననీ గుర్తుచేశారు. పాలెంప్రాచ్య కళాశాలలో జరిగిన అప్పటి మధుర జ్ఞాపకాలను సుమధురంగా జ్ఞప్తి చేశారు. శ్రీరంగాచార్య ఎన్నోకావ్యాలకు పరిష్కర్తగా నిలిచి చాటు పద్యాలను చమత్కారంగా రచించి పలువురిని మెప్పించారని అన్నారు. పురస్కార స్వీకర్త శ్రీరంగాచార్య మాట్లాడుతూ భాషా వైయుక్తంతో తన జీవితకాలమంతా మనోవాక్కాయకర్మలను ఆచరించి తెలుగు భాషా పరిక్షకుడిగా సాహిత్య కృషి చేస్తానని అన్నారు. ఇంతటి శిష్యజనకీర్తుడిని కావడానికి జనవందితులైన తన శిష్యగణమే కారణమని ఆనందాన్ని వ్యక్తం చేశారు. సురవరం ప్రతాపరెడ్డి పేరిట మారిన తెలుగు విశ్వవిద్యాలయం వారి ఆశయాలకనుగుణంగా తెలుగు భాషా పరిణామం మరింత వృద్ధిలోకి రావడానికి విశ్వవిద్యాలయం కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ విద్యాలయ స్థాపన లక్ష్యం, ధ్యేయం నెరవేర్చడానికి చేస్తున్న కృషిని, పురోగతిని సవివరంగా తెలిపారు. నాంపల్లి నుండి వంద ఎకరాల బాచుపల్లి ప్రాంగణంలోకి మారి అక్కడ చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమానికి విస్తరణసేవా విభాగం ఇంచార్జి ఆచార్య రాధా సారంగపాణి సమన్వయకర్తగా వ్యవహించారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాణించాలి : ప్రొ. కోదండరాం

విశాలాంధ్ర , పటాన్ చెరువు : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లి తమ సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం పటాన్ చెరు మండలంలో ఐఐటి చుక్కారామయ్య ఇష్టా విద్యాసంస్థలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 'ఇష్టా ఫెస్ట్ - 2025' సాంస్కృతిక, క్రీడా వేడుకలు విద్యార్థుల కేరింతల మధ్య ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ప్రారంభించగా, విద్యావేత్త డి వెంకటేశ్వర్ రావు ఫుడ్ ఫెస్ట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులను శాలువా కప్పి, స్మారక చిహ్నాన్ని చైర్మన్ కార్తీక్ కోట, డైరెక్టర్ కె. వినోద్ కుమార్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్సీసీ విద్యార్థులు నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి కోదండరాం మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని, ఇలాంటి ఫెస్టివల్స్ మనలోని సామర్థ్యాలను బయటకు తీసుకువస్తాయని పేర్కొన్నారు. విద్యాసంస్థలు కేవలం విద్యార్థుల్లోని ర్యాంకులను, మార్కులను చూస్తున్న ఈ రోజుల్లో వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడం కోసం ఐఐటి చుక్క రామయ్య ఇష్టా విద్యాసంస్థలు ఇలాంటి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం మంచి పరిణామమని కళాశాలలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించిన ఫిజికల్ డైరెక్టర్లను అభినందించారు. హైకోర్టు అడ్వకేట్ సుంకరి నరేష్ మాట్లాడుతూ నిత్యం చదువులతో కుస్తీలు పడుతున్న విద్యార్థులకి మూడు రోజులు పాటు స్పోర్ట్స్ మీట్,ఫుడ్ ఫెస్ట్ , కల్చరల్ ఫెస్ట్ పేరుతో విద్యార్థులు క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కళా కార్యక్రమాలు, ఫుడ్ ఫెస్ట్‌తో సందడి చేస్తూ ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించిన విద్యాసంస్థల యాజమాన్యాన్ని మరియు ఫిజికల్ డైరెక్టర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఐఐటి చుక్కారామయ్య ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్ కోట, డైరెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యను అందించడమే ఇష్టావిద్యాసంస్థల ముఖ్య ఉద్దేశం అని చెప్పారు.ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పాల్గొనడం ప్రత్యేక శోభను తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు విద్యాసంస్థల అకాడమిక్ డీన్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పటేల్ గూడ బ్రాంచ్ ప్రిన్సిపల్ రజిత,వైస్ ప్రిన్సిపల్ విజయ్ భాస్కర్ రెడ్డి,బీరంగూడ బ్రాంచ్ ప్రిన్సిపల్ తులసి,వైస్ ప్రిన్సిపల్ పవన్ కుమార్,సంగారెడ్డి బ్రాంచ్ ప్రిన్సిపల్ డాక్టర్ రవి కిరణ్ రెడ్డి,విజన్ స్కూల్ ప్రిన్సిపల్ ఇబ్రహీం, సెయింట్ జోసెఫ్ స్కూల్ కరస్పాండెంట్ జోసెఫ్ బాబు, ప్రిన్సిపల్ సెల్వం, ఫిజికల్ డైరెక్టర్లు రమేష్, వెంకట్ రెడ్డి,అరుణ్ తోపాటు విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు నైపుణ్యాల అభివృద్ధికి దోహదం

విశాలాంధ్ర, హైదరాబాద్ : విద్యార్థులలో సృజనాత్మకత, ఆవిష్కరణలు మరింత పెంపొందిస్తుందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఇన్స్పైర్ అవార్డ్స్ మానక్ ఎగ్జిబిషన్, జిల్లాస్థాయి బాల్ వైజ్ఞానిక ప్రదర్శన శ్రీ హనుమాన్ వ్యాయామశాల పాఠశాల సుల్తాన్ బజార్ నందు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సురేఖ, మాజీ రాజ్య సభ సభ్యులు హనుమాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు వి హనుమంతరావు, సెక్రటరీ మైథిలి శరన్ జిల్లా కలెక్టర్ తో కలసి పాల్గొన్నారు. ఇన్స్పైర్ అవార్డ్స్ మానక్‌లో 179 ఎగ్జిబిట్స్ ప్రదర్శన చేయబడినవి. అలాగే బాల్ వైజ్ఞానిక ప్రదర్శన నుండి 130 పైగా ఎగ్జిబిట్స్ ప్రదర్శన చేయబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు ద్వారా విద్యార్థుల భావనలు ప్రయోగశాలలో నేరుగా పాల్గొనటానికి జ్ఞానాన్ని బలోపేతం చేయడానికి ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు దేశ భవిష్యత్తు అని, చదువుతోపాటు టెక్నాలజీలో కూడా ముందుండాలని అన్నారు. ఇన్స్పైర్ అవార్డ్స్, బాల్ వైజ్ఞానిక ఇన్స్పైర్ అవార్డ్స్ అలాగే బాల్ వైజ్ఞానిక ప్రదర్శన మంచి అవకాశంగా వినియోగించుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రదర్శనలను తిలకించాలని,మంచి అవకాశం గా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సైన్స్ అంటే జీవితమని, భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని విద్యార్థులు జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో రాణించి ఫలితాలు సాధించాలని విద్యార్థులను ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రదర్శనలు చేపట్టి పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ జిల్లాస్థాయి ప్రదర్శనకు జ్యూరీలుగా వివిధ యూనివర్సిటీ ప్రొఫెసర్సుగా రావడం జరిగింది, జిల్లాస్థాయి ప్రదర్శన రెండురోజులు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ రోహిణి, డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర్లు, సైన్స్ అధికారి ధర్మేందర్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బాలేశ్వరి

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా పౌర సంబంధాల ఇంచార్జీ అధికారిగా బి. బాలేశ్వరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి మర్యాదపూర్వకంగా ఆమె కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. విధులను బాధ్యతగా చేపట్టి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

రీ-పోలింగ్ లేకుండా విధులు నిర్వర్తించాలి

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : రీ - పోలింగ్ కు అస్కారం లేకుండా ప్రిసైడింగ్, ఓ.పీఓలు విధులు నిర్వర్తించాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని రంగారెడ్డి జిల్లాలో రెవెన్యూ డివిజన్లలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల సర్పంచ్, 4668 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతోపాటు, ఓ.పీ.ఓల ర్యాండమైజేషన్ జరిపారు. అనంతరం పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, రీపోలింగ్ కు అస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, నోడల్ అధికారి శ్రీలక్ష్మి, నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు

విశాలాంధ్ర -కొత్తూరు: ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా నందిగామ సిఐ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మండలంలోని చేగూర్, బండోనిగూడ, బుగ్గోనిగూడ గ్రామాల్లో పోలీసులతో ఫుట్ మార్చ్ (పోలీసు కవాతు) నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. గ్రామాల్లోకి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల వ్యవహారంలో విధించిన నిబంధనల గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐలు కె.యాదయ్య, దేవరాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్య వ్యాపారం కాదు.. బాధ్యత : సీతా దయాకర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : విద్యనందించడం వ్యాపారం కాదు బాధ్యతగా స్వీకరించడంతోపాటు బాలలను అన్ని కోణాలలో కాపాడాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యాలదే అని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఛైర్మన్ సీతా దయాకర్ అన్నారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుల చేసిన సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ ద చిల్డ్రన్ ఇన్ ద స్కూల్ అనే కార్యక్రమానికి కమీషన్ సభ్యులు చందన, సరిత, డిఈఓ విజయ కుమారిలతో కలిసి హాజరైనారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన చిన్నారిపై ఆయమ్మ చేయి చేసుకున్నటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గాను ప్రైవేట్ స్కూల్స్ లో ఉపాధ్యాయులకు అవగాహన, కౌన్సిలింగ్స్, సేఫ్టీ మెజర్స్, పిల్లలకి కౌన్సలర్స్, సిసి కెమెరాలు, వెహికిల్స్ మెజర్స్, పోక్సో చట్టం పై అవగాహన వంటి అంశాల పై పైలెట్ ప్రాజెక్టుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను ఎంపిక చేసుకొని బాలల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారా లేదా అని పర్యవేక్షిస్తామని ఛైర్మన్ సీత దయాకర్ అన్నారు. పిల్లల భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాలలో వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. మన ఇంట్లో పిల్లల పట్ల ఎంత బాధ్యతగా ఉంటామో అంతే బాధ్యత వారిపట్ల ఉండాలన్నారు. సంఘటనలు జరిగిన తరువాత తీసుకునే చర్యలకంటే, ముందుగా తీసుకునే నివారణ చర్యలు ముఖ్యమన్నారు. ఇటువంటి సంఘటనలు తలెత్తకుండా పాఠశాల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పిల్లలకు శారీరక శ్రమ అవసరమని అందుకు గ్రౌండ్స్ లో ఆడుకోవాలని తద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. పిల్లలకు సంబంధించిన చట్టాల పట్ల పాఠశాలలోని సిబ్బంది అందరికి అవగాహన కల్పించడమే కాకుండా చట్టాలు అమలు పరచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో కమిటీలను ఏర్పాటు చేసుకొని ప్రతి నెల సమావేశమై సమస్యలను చర్చించి సమస్యలను అధిగమించేలా చూడాలన్నారు. పిల్లల పరిరక్షణ చాలా ముఖ్యమని చిన్న చిన్న నిర్లక్షాలతో పెద్ద సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఎలాంటి నిర్లక్ష్యాలకు తావు లేకుండా పూర్తి బాధ్యత స్కూల్ యాజమాన్యాలు తీసుకోవాలన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ద వహించి వారిని కాపాడాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులతో పాటు టీచర్లే ముఖ్యమని, వారి భవిష్యత్తుకు టీచర్లే బాధ్యులన్నారు. తెలంగాణాకు ఉత్తమ పౌరులను అందించే బాధ్యత టీచర్లదేనని, అందరి విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఒకరు, ఇద్దరి పట్ల నిర్లక్ష్యం వహించిన అది సరికాదన్నారు. పాఠశాలయాజమాన్యాలు తెలిపిన సమస్యలను తాము పరిశీలిస్తామని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్, ప్రైవేట్ పాఠశాలలయాజమాన్యాలు , తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు బీసీ జనసేన నేతల సన్మానం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: బీసీ జనసేన జాతీయ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కత్తి చంద్రశేఖర్ అప్ప ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ టీయుడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. మంగళవారం పట్టణంలోని దేవిగ్రాండ్ హోటల్లో టీయుడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టులను బీసీ జన సేన నేతలు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కత్తి చంద్రశేఖర్ అప్ప మాట్లాడుతూ బీసీ జనసేన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడం జరుగుతుందని వివరించారు. ఇందుకు మీడియా సహాయ సహకారాలు ఎంతో అవసరం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో బీసీ సేనలో పనిచేసిన సమయంలో జర్నలిస్టులు ఎంతో సహాయ సహకారాలు అందించారని, అదే తరహాలో బీసీ జనసేనకు సహకరించేందుకు మీడియా సోదరులు కృషి చేయాలని పేర్కొన్నారు. మేము ఎన్ని ప్రోగ్రాములు చేసిన మీడియాలో వార్తలు రాకుంటే అది వ్యర్థమే అవుతుందని అన్నారు. అందుకే మా చిరు సత్కారాన్ని జర్నలిస్టులు స్వీకరించాల్సిందిగా కోరుకుంటున్నట్లు జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ అప్ప కోరారు. ఇందులో భాగంగా టీయుడబ్ల్యూజే ఐజేయు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దన్నారం రమేష్, జిల్లా ఈసీ మెంబర్ ఇలియాజ్, డివిజన్ అధ్యక్షులు బూర్గుల ఫణింద్ర, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు సమీ, నరేందర్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జనసేన నేతలు బీసీ జనసేన జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప సంఘం ప్రధాన నాయకులు జక్కుల జలజ భాగ్యలక్ష్మి గౌడ్, స్రవంతి రాజ్ మేకల వెంకటేష్ చందులాల్ జమాల్పూర్ గద్దమీద రమేష్ పుష్పమ్మ అరుణ రాములు గౌడ్ భావన, శ్రావణి, శివలు పాల్గొన్నారు.

కరాటేతో తమను తాము రక్షించుకునే నైపుణ్యం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: నేటి సమాజంలో ఆయా రంగాలలో మహిళలూ ఉన్నత రంగాలలో రాణిస్తూ దేశాన్ని ఏలే స్థాయికి చేరుకున్నారు. నేటి సమాజంలో కొందరు మహిళలూ ఇప్పటికి తమను తాము రక్షించుకోలేని పరిస్థితి ఏర్పడిందని అలాంటి సమస్యకు చెక్ పెట్టేందుకు కుంగ్ ఫు , కరాటే వంటి యుద్ధ కళలు ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్ ద్వారా తమను తాము రక్షించుకునే నైపుణ్యాన్ని అందిస్తాయని అన్నారు. మాజీ సైనికుడు బ్లాక్ బెల్ట్ గ్రహీత భూషణ్ పటేల్. విపత్కర పరిస్థితులలో ధైర్యంగా వ్యవహరించి, తమను తాము రక్షించుకోవడంలో యుద్ధ విద్యాలు కీలకంగా ఉపయోగపడతాయని ఈ కళలు శిక్షణ తీసుకోవడం ద్వారా మానసికంగా కూడా బలపడతారని ఒత్తిడిని తగ్గించుకోవడం, ఏకాగ్రతను పెంపొందించుకోవడం మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం,ఆడపిల్లల వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలో వారి స్థాయిని పెంచడానికి కూడా దోహద పడతాయని అన్నారు. ప్రతి తల్లితండ్రులు తమ తమ ఆడపిల్లలను కుంగ్ ఫు నేర్పించి వారిని శక్తివంతులుగా తయారయ్యేలా చూడాలి. షాద్‌నగర్ పట్టణంలోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్స్ బాలరాజ్, అహ్మద్‌ఖాన్ అధ్యర్యంలో ఎంతోమంది ఈ కళను నేర్చుకొని జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఎన్నో పథకాలు సాధించారు. మీరు కూడ నేర్చుకొని ఆత్మవిశ్వాసంతో దృడంగా ఉండాలన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్ : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఉందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. మంగళవారం తిరుమలగిరి మండలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుండి 20 మంది విద్యార్థులు కలెక్టరేట్ ను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులకు కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల ద్వారా జరుగుతున్న పనితీరు, వాటి బాధ్యతలను ఏ. ఓ, సెక్షన్ అధికారులు వివరించారు. తదుపరి విద్యార్థులతో తన చాంబర్లో కలెక్టర్ హరిచందన దాసరి ముఖాముఖి లో పాల్గొని మాట్లాడుతూ ప్రైవేట్ కు దీటుగా కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలలోని మౌలిక వసతులు, ఇతర అంశాలపై విద్యార్థుల యొక్క అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచమే ఒక పాఠ్య పుస్తకమని, తమ చుట్టూ జరిగే విషయాలను విద్యార్థులు తప్పక తెలుసుకోవాలని, అలాగే విద్య, కొత్త సాంకేతికతలతో పాటు సామాజిక అంశాలపై కూడా అవగాహన ఎంతో అవసరమని కలెక్టర్ వివరించారు. విద్యారంగంలో ప్రభుత్వం అనేక మార్పులు తేవటంతో విద్యార్థుల మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ పర్యటనల వలన విద్యార్థులలో మేధాశక్తి మరింత పెరుగుతుందని అన్నారు.

పరిశ్రమల పేరుతో పేదల అసైన్ భూముల స్వాధీనం దారుణం

విశాలాంధ్ర, పటాన్ చెరువు : తమ జీవనాధారమైన అసైన్ భూములను ప్రభుత్వము స్వాధీనపర్చుకోవాలని చూస్తుందని, తరతరాలుగా అసైన్ భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న తమ బ్రతుకులు ప్రశ్నార్థకంగా మారుతాయి అని చిన్న కంజర్ల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమల స్థాపన పేరుతో ప్రభుత్వం అసైన్ భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రక్రియను ప్రారంభించిందని ఈ ప్రక్రియను బాధితులందరూ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం పటాన్ చెరువు తహసిల్దార్ కార్యాలయం ఎదుట చిన్న కంజర్ల గ్రామస్తులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. చిన్న కంజర్ల మాజీ సర్పంచ్ గాయత్రీ లక్ష్మణ్ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంద్రేశం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కు తమ అసైన్ భూములు కాపాడాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాయత్రి లక్ష్మణ్ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ పేదలైన అసైన్ రైతుల భూములను ప్రభుత్వం లాక్కోవాలని చూడడం దారుణమని మండిపడ్డారు. పెద్ద రైతులకు బాసటగా నిలవాల్సిన ప్రభుత్వమే పేదల పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించి పేద రైతుల అసైన్ భూములను స్వాధీన ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని లేని పక్షంలో గ్రామస్తుల మందిరం నిరాహార దీక్ష చేసి ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతులు చంద్రయ్య, యాదయ్య, మంజుల, కుమార్, ఎల్లయ్య, నాగభూషణం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఏపీ మహేష్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు సజావుగా సమర్ధవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. ఏపీ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నికలు డిసెంబర్ 7, 2025న నిర్వహించనున్న సందర్భంగా పోటీ అభ్యర్థులతో ఎన్నికల విధివిధానాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు సి. పి తాఫ్సీర్ ఇక్బాల్, డిసిపి శిల్పవల్లి, డి ఆర్ వో ఈ వెంకటాచారి లతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మొత్తం 37,000 మందికి పైగా ఓటర్లు బ్యాలెట్ విధానంలో తమ ఓటును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర ముంబై, రాజస్థాన్లోని జైపూర్, బిల్వాడ, ఆంధ్రప్రదేశ్లోని విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు అలాగే తెలంగాణ హైదరాబాద్‌తో పాటు ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లా లలో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. అలాగే హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కమలా నెహ్రూ పాలిటెక్నిక్ , సరోజినీ దేవి వనిత మహా విద్యాలయం నాంపల్లి లో 68 పోలింగ్ కేంద్రాలు అలాగే మరో 10 పోలింగ్ కేంద్రాలు మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్ర ప్రదేశ్ తో పాటు తెలంగాణలో తెలంగాణ మూడు జిల్లాలలో జరగనున్నాయని తెలిపారు. పోటీ అభ్యర్థులు ఎన్నికల విధివిధానాలు తప్పక పాటించాలని అలాగే ఎన్నికలు సజావుగా సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆమె తెలిపారు. పోలింగ్ ఈ నెల 7న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు చేపట్టనున్నట్లు అలాగే ఓట్ల లెక్కింపు డిసెంబర్ 8న జరుగుతుందని అదిశగా అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ ఎన్నికల నిబంధనలు, పోలింగ్ విధానం, పాటించాల్సిన మార్గదర్శకాలు, బాధ్యతలు గురించి సభ్యులకు విపులంగా వివరించారు. ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేయడం, ప్రలోభాలు ఇవ్వడం, నకిలీ ఓటు వేయడం, అనుమతి లేని వస్తువులు తీసుకురావడం, రెండుసార్లు ఓటు వేయడానికి ప్రయత్నించడం, పోలింగ్ ప్రక్రియలో అంతరాయం కలిగించడం వంటి ఏదైనా అక్రమ చర్యలు జరిపితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలులో ఉంటుందని తెలిపారు. ఓటర్లు తప్పనిసరిగా తమ గుర్తింపు పత్రాలు తీసుకువచ్చి, అనుమతించని వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకురాకుండా విధినిర్వహణ సిబ్బందితో సహకరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఇంక్ పెన్నులు, వాటర్ బాటిల్స్, సెల్ ఫోన్స్ అనుమతి లేదనితెలిపారు. ఈ సమావేశంలో శిల్పవల్లి డీసీపీ, ఏసిపి పి.ప్రవీణ్, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ ప్రసన్న, పోటీ అభ్యర్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర -కొత్తూరు: నేటి సమాజంలో విద్యార్థులు ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగి ఉండేందుకు కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మాదిరి ఎన్నికల (మాక్ పోలింగ్) కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఎంఈఓ (ప్రధాన ఉపాధ్యాయులు) అంగూర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, సిఐ నరసయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ విధివిధానాలను చిన్నారులు విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని వారు సూచించారు. ముఖ్య ఎన్నికల అధికారిగా పదవ తరగతి విద్యార్థి వివేక్, ఏఆర్ఓగా పదవ తరగతి విద్యార్థిని అనూషలు వ్యవహరించారు. ఓటు వేసే విధానాన్ని తెలుపెందుకు విద్యార్థులచే నిర్వహించిన ఈ ఎన్నికల్లో పాఠశాల హెడ్బాయిగా పదవ తరగతి విద్యార్థి కే. కార్తీక్, హెడ్ గర్ల్ గా తొమ్మిదవ తరగతి విద్యార్థిని కే. గీత మాక్ పోలింగ్ లో విజయం సాధించారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు అభినందించించారు. ఈ ఎన్నికల్లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని శిరీష ఎన్నికల నిర్వహణను పరిశీలించారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రవికుమార్, భగవంతు, శ్రీనివాస్, రాజు, సిహెచ్ సుజాత, పిడి నవనీత, ఉపాధ్యయని ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డికి ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ నివాళి

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : ఇందిరా పార్కులోని మర్రి చెన్నారెడ్డి సమాధికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వల్లాల నవీన్ యాదవ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆయన సమాధి దగ్గర పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గొప్ప దర్శనికుడు, మార్గదర్శి యావత్ దేశం చూసిన అరుదైన రాజనీతిజ్ఞుల్లో ఒకరు గవర్నర్ పదవికి వన్నె తెచ్చిన మహానుభావుడు. ప్రజాసేవలో మర్రి చెన్నారెడ్డి గారి సేవలు, నాయకత్వం, ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజాహిత నిబద్ధతతో మర్రి చెన్నారెడ్డి గారి పాత్ర అనన్య సామాన్యమని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్ హేమంత్ భోరాడేని కలసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : మంగళవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్, శేరిలింగంపల్లి జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ భోరాడే ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన నవీన్ యాదవ్‌ని శేరిలింగంపల్లి జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ భోరాడే శాలువాతో సత్కరించి అభినందించారు.

అధికారిపై లోకాయుక్తలో ఫిర్యాదు

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : వనపర్తి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై రాష్ట్ర లోకాయుక్తలో బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ ఛైర్మెన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. మంగళవారం బషీర్ బాగ్ లోని లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన అనంతరం రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై ఆధారాలతో సహా లోకాయుక్త లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యంత్రాలు, విద్యుత్ కనెక్షన్ లేని రైస్ మిల్లులకు సైతం బియ్యాన్ని కేటాయించడంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై ఏప్రిల్ నెలలో జిల్లా కలెక్టర్ , విజిలెన్స్ డిజి , సివిల్ సప్లయ్ కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ ఆయనపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. తనకు అనుకూలంగా ఉండే మిల్లర్లకు మాత్రమే ధాన్యం కేటాయిస్తూ నిబంధనలను పాటిస్తున్న మిల్లులకు బియ్యం కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అధికారి అవినీతికి సహకరిస్తున్న ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు తెలిపారు. కొంత మంది అధికారుల చర్యల కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని రాచాల కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు గాలిగల్ల సాయిబాబా, చింటు తదితరులు పాల్గొన్నారు.

అశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

విశాలాంధ్ర - మొయినాబాద్ : మండల పరిధిలోని బాకారం గ్రామంలో స్థానిక ఎన్నికల సందర్భంగా బాకారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎల్గని వెంకటేష్ గౌడ్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాకారం గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పాడుతూ నిరంతరం ప్రజల మధ్యలో తిరుగుతూ ప్రజల బాగోగులు తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలియజేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన నిరుపేదలకు అందేలా పోరాడుతానని చెప్పారు. బాకారం గ్రామ ప్రజలకు సేవ చేయాలనే ధ్యేయంతో సర్పంచ్ పదివికి పోటీ చేస్తున్నానని తెలిపారు. గ్రామాభివృద్ధి, సామాన్య ప్రజలు సమస్యల పరిష్కారం ఇవే తన ప్రాధాన్యతలు అని వివరించారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ఉంచుతానని, గ్రామ ప్రజలను ఆశీర్వాదం కోరారు.

సర్పంచి అభ్యర్థిగా సత్యవతి నామినేషన్

విశాలాంధ్ర, దమ్మపేట: మండలంలోని కొమ్ముగూడెం సర్పం చి స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా సోయం సత్యవతి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. జెమేధార్ బంజర్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి ఆమె నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు సోయం వీరభద్రం,రాజాబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతీ అదృశ్యం పై కేసు నమోదు

విశాలంధ్ర, మేడిపల్లి:యువతీ అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమా రెసిడెన్సి చెంగిచెర్లలో నివసించే బాలాంజనేయులు కూతురు వర్ష (19) గత కొంతకాలం నుండి ఒక బట్టల షాపులో పనిచేస్తుంది. నవంబరు 30న ఉదయం 6 గంటలకు ఇంట్లో నుండి వెళ్లి తిరిగి రాలేదు తన నెంబర్‌కి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుంది. ఈ విషయంపై బాలాంజనేయులు మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ అమ్మాయి ఎవరికైనా కనిపించిన మేడిపల్లి పి ఎస్ వారికి సమాచారం ఇవ్వాలని సీఐ గోవింద రెడ్డి కోరారు.

మూడవ విడత నామినేషన్ల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో,సంగారెడ్డి, గ్రామ పంచాయతీ మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మొదటి, రెండవ విడతలలో 17 మండలాలలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల షెడ్యూల్ ను అనుసరిస్తూ సజావుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ నెల 3 నుండి 5వ తేదీ వరకు మూడవ విడతగా కల్హేర్, కంగ్టి ,మనూరు, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాల పరిధిలోని 234 గ్రామ పంచాయతీలు,1960 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చునితెలిపారు. 5 చివరి తేది అన్నారు.

ప్రజల పార్కును కాపాడిన పోరాటం...

- కూలబోతున్న నకిలీ రాజ్యం
- సర్వే నంబర్లు 134, 136 ప్రభుత్వ భూమేనని ధృవీకరణ
- జనం కోసం సుదీర్ఘ పోరాటంతో
- అక్రమ నిర్మాణాల కూల్చివేత దిశగా వేగం పెరిగిన చర్యలు

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్ డివిజన్ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ప్రజల కోసం కేటాయించిన సర్వే నంబర్లు 134, 136లోని పార్కు స్థలాన్ని నకిలీ పత్రాలు దొంగ సర్వే నంబర్లు కల్పిత రిజిస్ట్రేషన్ల ఆధారంగా గత నాలుగు సంవత్సరాలుగా కబ్జా చేసుకున్న అక్రమ నిర్మాణాల గుట్టు ఇప్పుడు పూర్తిగా బయటపడింది హౌసింగ్‌శాఖ అసలు లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం పార్కుగా కేటాయించిన ఈ ప్రభుత్వ భూమిపై కొద్ది రోజుల్లోనే అక్రమ నిర్మాణాలు పుట్టుకువచ్చిన నేపథ్యంలో జనం కోసం స్వచ్ఛంద సంస్థ శేరిలింగంపల్లి సర్కిల్ జోనల్ కార్యాలయం గ్రేటర్ జిహెచ్‌ఎంసి కార్యాలయాల్లో వరుసగా ఫిర్యాదులు చేసింది. మొదట ఈ ఫిర్యాదులను పెద్దగా పట్టించుకోని జిహెచ్‌ఎంసి జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి ఇరవై నాలుగు డిసెంబరులో హైడ్రా కమిషనర్‌ను ప్రత్యక్షంగా కలసి సాక్ష్యాలతో భూమి దందా వివరించడంతో లోతుగా దర్యాప్తు ప్రారంభించింది పార్కు స్థలంలో నిర్మాణంలో ఉన్న భవనాలకు జిహెచ్‌ఎంసి నుంచే అనుమతులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఆ అనుమతులు ఎలా మంజూరు అయ్యాయో ఆరా తీశారు. శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు తమ కార్యాలయం జారీ చేసినట్లుగా సమర్పించిన పట్టా సర్టిఫికెట్ల ఆధారంగా బిల్డింగ్ అనుమతులు ఇవ్వబడ్డాయని రికార్డుల్లో కనిపించడంతో జిహెచ్‌ఎంసి రెవెన్యూ కార్యాలయానికి లేఖ రాసి నిజానిజాలు అడిగింది. అక్కడి నుంచి వచ్చిన వివరణలో ఆ పట్టాలు అసలు కార్యాలయం జారీ చేసినవికాదని లబ్ధిదారుల పేర్లు తమ రికార్డుల్లో లేవని స్పష్టం చేయడంతో పాటు ఆర్డీవో నివేదికలు రావడంతో సర్వే నంబర్లు 134, 136 ప్రభుత్వ భూమేనని అసలు లేఅవుట్‌లో పార్కుగా కేటాయించినట్టే వినియోగం ఉండాలనే విషయం పూర్తిగా ధృవీకరించబడింది. దీంతో నిర్మాణదారులు సమర్పించిన పత్రాలు నకిలీవని తేల్చిన జిహెచ్‌ఎంసి మరియు రెవెన్యూ శాఖలు కలిసి రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయింది. ఒక్క అంతస్తు ఉన్న సమయంలోనే కేసు నమోదైనా నోటీసులు జారీ అయినా నిర్మాణదారులు పెడచెవిన పెట్టి ఆరు అంతస్తుల భవనాన్ని పూర్తిచేయడం పరిస్థితి ఎంత దూరం వెళ్లిందో స్పష్టమైంది. జిహెచ్‌ఎంసి అధికారులు జులై పదకొండు సెప్టెంబరు రెండవ తేదీలలో భవనాలను సీజ్ చేసి మూసివేసినా అక్రమ నిర్మాణదారులు తాళాలు పగులగొట్టి మళ్లీ వాడుకలోకి తెచ్చుకోవడం స్థానికులను ఆగ్రహపరిచింది. ఇదే లేఅవుట్ లో జిహెచ్‌ఎంసి ఆధీనంలోని వెయ్యి నాలుగు వందల చదరపు గజాల కమ్యూనిటీ హాల్ పక్కనే ఇళ్లు భవనాలు నిశ్శబ్దంగా పెరిగేంతవరకూ అధికారులు చూసినా చూసినట్టు లేకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి ఏసీపీ వెంకటరమణకు ఏడాది పాటు ఫిర్యాదులు పెట్టినా స్పందన దున్నపోతుమీద వర్షం పడినట్టే వచ్చిందని నకిలీ పట్టాలని తెలిసినా బిల్డింగ్ అనుమతులు ఇచ్చారని సీజ్ చేసిన భవనాల తాళాలు పగులగొట్టి వాడుకలోకి తెచ్చేంత ధైర్యం వారికి రావడానికి జిహెచ్‌ఎంసి అధికారులు కోట్లలో దండుకున్నారన్న అనుమానం స్థానికుల్లో గట్టిగా ఉందని, పునాది వేసిన రోజే తాను ఫిర్యాదు చేశానని అప్పుడే చర్యలు తీసుంటే ఇవాళ ఇవి ఆకాశాన్నంటే కట్టడాల్లా ఉండేవి కావని ఈ పార్కును కాపాడాల్సిన బాధ్యత జిహెచ్‌ఎంసిదేనని కాని అదే బాధ్యతను వారు విస్మరించారని కసిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. ఆర్డీవో నివేదికల ఆధారంగా అంజనేయులు ఐత వరల జంగా రెడ్డి గుంటి బాలు కుడుకుంట్ల ఇంద్రమ్మ పేర్లపై ఉన్న నాలుగు బిల్డింగ్ అనుమతులు రద్దుకావడం క్రిమినల్ కేసులు నమోదు కావడం కట్టడాలపై ముద్రలు వేయడం వంటి చర్యలు వ్యవస్థ బిగింపు ప్రారంభమైన సంకేతాలుగా మారాయి ఈ పరిణామాల మధ్య శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నవంబరు ఇరవై ఐదవ తేదీన హైడ్రా కమిషనర్ కు లేఖ రాసి ప్రభుత్వ పార్కు స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికి అక్కడ ఉన్న అక్రమ నిర్మాణాల కూల్చివేత చేసేందుకు అవసరమైన సిబ్బంది యంత్రాంగం భద్రతా బలగాలు అందించాలని అధికారికంగా సిఫారసు చేయడం కేసులో కీలక మలుపుగా నిలిచింది హైడ్రా యంత్రాంగంతో కూల్చివేతలు చేపట్టాలని సూచించడంపై స్థానికుల్లో నకిలీ రాజ్యం రోజులు లెక్కపోతున్నాయన్న చర్చ మొదలైంది హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై పూర్తి నమ్మకం ఉందని నకిలీ పత్రాలతో నిలిచిన ఒక్క గోడ కూడా నిలవనివ్వరని పార్కును తిరిగి ప్రజలకు అందిస్తారనే విశ్వాసం ఉందని కసిరెడ్డి భాస్కరరెడ్డి పేర్కొన్నారు ఒకప్పుడు కాగితాల కుంభకోణంతో కబ్జా చేసిన అంజయ్యనగర్ పార్కు ఇప్పుడు ప్రజల హక్కుగా తిరిగి నిలబడే దశకు రావడం శేరిలింగంపల్లి సర్కిల్ ఇరవై పరిధిలో బయటపడిన ఈ అక్రమాలపై ప్రభుత్వం వేగంగా చర్యలు తీస్తుండడం జనం కోసం సుదీర్ఘ పోరాటం వృథా కాకపోదనే నమ్మకాన్ని మరింత బలపరుస్తోంది.

ఉత్తరాంధ్రలో మెటల్ క్లస్టర్

ఖనిజ ఉత్పత్తుల కంపెనీలను ప్రోత్సహించాలి

గనుల శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఉత్తరాంధ్ర కేంద్రంగా మెటల్ కు సంబంధించిన క్లస్టర్ ఏర్పాటు చేసి, విశాఖలో ఏర్పాటు కాబోయే వివిధ కంపెనీల నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ సరఫరా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఏపీ ఎండీసీని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో గనుల తవ్వకాలు, ఉచిత ఇసుక అమలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ లీజుకిచ్చిన గనులు కాకుండా, ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమ తవ్వకాలు జరిగితే వాటిని ఆర్టీజీఎస్ వ్యవస్థ ద్వారా గుర్తించేలా చూడాలి. దీని కోసం డ్రోన్, శాటిలైట్ చిత్రాలను వినియోగించుకోవాలి. అలాగే గనుల ద్వారా వచ్చే ఆదాయం విషయంలో ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను అంచనా వేసుకోవాలి. గనుల ద్వారా ఆదాయాన్ని పొందుతున్న రాష్ట్రాల్లో ఒడిషా మొదటి స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారో గమనించి, వాటిని మన రాష్ట్రంలో అమలు చేసే అంశాన్ని పరిశీలించాలి. అలాగే గనుల నుంచి వచ్చే వివిధ ఖనిజాలకు సంబంధించిన ముడి సరుకును ఇతర దేశాలకు ఎగుమతి చేయడంతోపాటు, ఆ ఖనిజాలకు వాల్యూ యాడెడ్ చేయడం ద్వారా దేశీయంగా వాటిని వినియోగించుకుని మరింత ఆదాయం వచ్చేలా చేయాలని సీఎం మార్గనిర్దేశనం చేశారు.

ఏయే ఖనిజాలు... ఏయే రంగాల్లో వాడతారో విశ్లేషించండి

"రాష్ట్రంలో లైమ్ స్టోన్, బీచ్ శాండ్, ఐరన్ ఓర్, మాంగనీస్, క్వార్ట్జ్, సిలికా శాండ్, క్లేస్, గ్రానైట్ సహా వివిధ ఖనిజాలు ఉన్నాయి. ఈ ఖనిజాలు ఏయే ఉత్పత్తులకు ముడిసరుకుగా ఉపయోగపడుతాయో విశ్లేషించండి. ఆ మేరకు ఏయే ఖనిజాలను నేరుగా ముడిసరుకు రూపంలో ఎగుమతులు చేయవచ్చు... ఏయే ఖనిజాలకు వాల్యూ యాడ్ చేసి దేశంలోనూ.. రాష్ట్రంలోనూ వినియోగించుకోవచ్చోననే అంశంపై విశ్లేషించాలి. ఆ మేరకు గనుల శాఖ ఆలోచన చేయాలి. సిమెంట్ ఫ్యాక్టరీలు ఇప్పటికే లైమ్ స్టోన్ ఖనిజాన్ని తీసుకుంటున్నాయి. ఇదే విధంగా ఐరన్ ఓర్ స్థానికంగా ఉన్న స్టీల్ పరిశ్రమలు ఉపయోగించుకుంటున్నాయి. అలాగే బీచ్ శాండ్ ద్వారా టైటానియం ఉత్పత్తులు, మాంగనీస్ ఖనిజం ద్వారా ఫెర్రో ఎల్లాయిస్ ఉత్పత్తులు, క్వార్ట్జ్-సిలికా శాండ్ ద్వారా సోలార్ ప్యానెళ్లు, సోలార్ పీవీ సెల్స్ ఉత్పత్తి, గ్లాస్ ఉత్పత్తులు, గ్రానైట్ ద్వారా కటింగ్-పాలిషింగ్ పరిశ్రమలు వంటివి వస్తాయి. ఇలాటి వాటిని ప్రోత్సహించాలి. ఇలా వాల్యూ ఎడిషన్ చేసే పరిశ్రమలను ప్రోత్సహించే దిశగా గనుల శాఖ చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాకాల పథకం ఏయే కంపెనీలకు వర్తిస్తుందో చూసి ఆయా కంపెనీలకు ఇన్సెంటివ్ ఇచ్చేలా కేంద్రంతో సంప్రదిద్దాం. అలాగే 'రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్, మెటల్ వంటి వాటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా అయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్‌టైఫస్ వ్యాధిపై అవగాహన కల్పించండి

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ వ్యాధికి సంబంధించిన కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి సౌరభ్ గౌర్‌తో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ బారిన పడి చందక రాజేశ్వరి అనే మహిళ మృతి చెందిన తరహా ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చిన్న చిన్న కీటకాలు కుడితే మృత్యువాత పడే స్థాయికి పరిస్థితి రాకూడదని... పూర్తిస్థాయిలో అవగాహన పెంచడమే దీనికి సరైన మార్గమని ముఖ్యమంత్రి చెప్పారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌర సేవలపై సీఎం సమీక్షించి, ప్రజలకు సంబంధించిన అంశాల్లో ఎక్కడా రాజీకి అవకాశం లేదని స్పష్టం చేశారు.

'మత్తు' కట్టడిలో పాలకులు విఫలం

పెంచలయ్య హత్య ఆక్షేపణీయం: గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: ప్రజా కళాకారుడు కె.పెంచలయ్య హత్యను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం తీవ్రంగా ఖండించారు. గంజాయి ముఠా ఆగడాల కట్టడిలో కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని విమర్శించారు. పెంచలయ్య హత్యకు నిరసనగా నెల్లూరు జిల్లా బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పెంచలయ్య హత్యపై రాష్ట్ర హోంమంత్రి నుంచి వివరణను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గంజాయి ముఠాల ఆగడాలు పెరిగిపోతున్నాగానీ హోంమంత్రి ఎందుకు తగు చర్యలు తీసుకోవడం లేదు? దీనిపై ప్రజలకు ఏం సమాధానం ఇస్తారు? అని ఈశ్వరయ్య ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరిట అడవుల్ని గాలించగల కేంద్ర, రాష్ట్ర పాలకులు... యువత ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ హత్యలకు, అరాచకాలకు కారణం అవుతున్న గంజాయి పంటను ఎందకు ధ్వంసం చేయలేవు? అవినీతిని, నిరుద్యోగాన్ని, ధరల పెరుగుదలను, గిట్టుబాటు ధరలను, పనికి తగ్గ ప్రతిఫలాన్ని అడిగే యువత లేకుండా చేయడమే లక్ష్యమా? మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలు మత్తులో దురాగతాలకు పాల్పడుతుంటే పాలకులు ఏం చేస్తున్నారు? అంటూ ఈశ్వరయ్య నిలదీశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా 12-18 ఏళ్ల వారు 88 లక్షల మంది ఉన్నారని జాతీయ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. గంజాయి, మత్తుకు యువత బానిసలుగా మారుతున్నారని ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తంచేశారు. గంజాయి కట్టడికి చర్యలను డిమాండ్ చేశారు.

నేడు అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన పాదయాత్ర, దీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం 10 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్ (గడియార స్థంభం) నుంచి గాంధీనగర్ ధర్నా చౌక్ వరకు ఆవేదనా పాదయాత్ర, ధర్నా చౌక్‌లో దీక్షలు జరుగుతాయని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇవి నాయుడు వెల్లడించారు. ఆయన మంగళవారం విజయవాడ దాసరిభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ జాతీయ నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు దీక్షలు ప్రారంభిస్తారన్నారు. ప్రజా సంఘాల నాయకులు హాజరై, సంఘీభావం తెలుపుతారన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులు విక్రయించి, బాధితులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వేలాది మంది డిపాజిటర్లు మనోవేదనకు, ఆర్థిక ఇబ్బందులకు గురవుతుంటే ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని దుయ్యబట్టారు. ఈ పరిస్థితుల్లో తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు తప్పడం లేదన్నారు. ఆవేదన దీక్షల్లో పెద్దఎత్తున ఏజెంట్లు, కస్టమర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విజయవాడ నగర కార్యదర్శి ఎస్‌కే షరీఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అసోసియేషన్ కమిటీ సభ్యుడు లంకా గోవిందరాజులు పాల్గొన్నారు.

ఓటుచోరీ ద్వారా బీహార్‌లో బీజేపీ గెలుపు

జేవీ సత్యనారాయణమూర్తి విమర్శ

విశాలాంధ్ర-విశాఖ: ఓటు చోరీ ద్వారానే బీహార్‌లో బీజేపీ-జేడీయూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. విశాఖ అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా సమితి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీహార్ ఫలితాలను ఎవరూ ఊహించలేదన్నారు. ప్రతిపక్షాలు ఓటు చోరీపై పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ క్షేత్రస్థాయిలో అడ్డుకోలేకపోయాయని తెలిపారు. బీహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) ద్వారా బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించారని, పెద్దఎత్తున అనుకూల ఓట్లను చేర్పించారని చెప్పారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ ఆఫీసర్లపై ఒత్తిడి తెచ్చి ప్రతిపక్షాల ఓట్లను తొలగించారని అన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాల్సి ఉండగా బీజేపీ మాత్రమే ఆ పని చేసిందని, మిగతా పార్టీలు ఏజెంట్లను నియమించలేదని అన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల్లో కూడా బీజేపీ ఇదే ఎత్తుగడ వేయనుందని తెలిపారు. ఎస్ఐఆర్‌పై ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల ముఖ్యమంత్రులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను పట్టించుకోవడం లేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలతో రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసి తనకు అనుకూలంగా మార్చుకుంటోందని విమర్శించారు. బీఎల్ఓల ఆత్మహత్యలపై ప్రధాన మీడియాలో వార్తలు రావడం లేదని, సోషల్ మీడియాలో మాత్రమే చూడగలుగుతున్నామని అన్నారు. మీడియా రంగం మొత్తం అదానీ, అంబానీ చేతిలో ఉందని, ప్రభుత్వ వ్యతిరేక వార్తలు బయటకు రానివ్వడం లేదని తెలిపారు. అధికారంలోకి రావడానికి ఓటు చోరీ మార్గాన్ని బీజేపీ ఎంచుకుందని దుయ్యబట్టారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై కేంద్రం యుద్ధం ప్రకటించిందని, ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను హత్య చేస్తున్నారని విమర్శించారు. హిడ్మాను చంపిన తరువాత రోజే చత్తీస్‌గఢ్‌లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయన్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును చంపిన తరువాత అదానీ, అంబానీ కంపెనీలు గనులు, విద్యుత్ ప్లాంట్ల కోసం 50 వేల చెట్లు నరికేశాయని తెలిపారు. విశాఖలో వన్‌టౌన్ నుండి కంచరపాలెం ప్రాంతం వరకు వాయు కాలుష్యం వల్ల ఊపిరితిత్తులకు సంబంధించి కొత్త వ్యాధి వస్తున్నట్లు కేజీహెచ్ వైద్యులు వెల్లడించారని తెలిపారు. అడవులపై హక్కుల కోసం ఆదివాసీల పోరాటం స్వాతంత్ర్యం ముందు నుండి జరుగుతోందని అన్నారు.

జగన్ హయాంలో ప్రజాధనం దుబారా

మంత్రి లోకేశ్ విమర్శలు

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ తన విమాన ప్రయాణాల కోసం ఏకంగా రూ.222 కోట్లు ఖర్చు చేశారంటూ ఓ జాతీయ మీడియా సంస్థలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజలు ఉద్యోగాలు, కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, అప్పటి సీఎం జగన్ మాత్రం ప్రజాధనాన్ని దుబారా చేశారని ఆరోపించారు. రూ.500 కోట్లతో విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించుకోవడంతో పాటు, రూ.222 కోట్లతో విమానాల్లో తిరిగారని విమర్శించారు. ఇన్నాళ్లకు అసలు నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఓ దార్శనికత (విజన్) అవసరమైతే, జగన్ మాత్రం రాష్ట్రాన్ని విహారయాత్ర (వెకేషన్)లా భావించారని లోకేశ్ ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు.

అధిష్ఠానం ఎప్పుడంటే అప్పుడే...

డీకేకు సీఎం పదవిపై సిద్ధరామయ్య

మరోసారి అల్పాహార విందు రాజకీయం

బెంగళూరు: కర్నాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ... మరోసారి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం డీకే శివకుమార్ నివాసానికి సిద్ధరామయ్య వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌కు సీఎం పదవిపై సిద్ధరామయ్య మాట్లాడుతూ అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే... అప్పుడే డీకే సీఎం అవుతారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికలపైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇద్దరు నేతలు పేర్కొన్నారు. అల్పాహారం అనంతరం డీకేతో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రైతుల సమస్యలు సహా ఇతర విషయాలపైనా చర్చించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. సీఎం మార్పుపై చర్చలు జరపడానికి పార్టీ అధిష్ఠానం పిలిస్తే తాము ఇద్దరం ఢిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా ఉన్నామని, రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తున్నామన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. డిసెంబర్ 8న కాంగ్రెస్ ఎంపీల సమావేశం నిర్వహించడానికి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల డీకే శివకుమార్ సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి... అల్పాహారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇద్దరు మీడియాతో మాట్లాడుతూ నాయకత్వ మార్పుపై కొద్ది రోజులుగా అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. బీజేపీ-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. ఇందులో భాగంగానే మరోసారి డీకే నివాసంలో భేటీ అయ్యారు. కాగా, అల్పాహారంలో నాటుకోడి కూర, ఇడ్లీ, ఉప్మా, దోశ, కాఫీ ఆస్వాదిస్తూ ప్రస్తుత పరిణామాలపై చర్చించుకున్నారు. రెండు రోజుల క్రితం ఇదే సన్నివేశం సీఎం ఇంట్లో చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి సదాశివనగర్‌లోని నివాసానికి రాగా.. బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్ ఆయనను సాదరంగా స్వాగతించారు.

'ఎస్ఐఆర్' మృతులకు రూ.2 లక్షల సాయం

అనారోగ్యానికి గురైన వారికి రూ.లక్ష : మమత

కోల్‌కతా: ఎస్ఐఆర్ కారణంగా మానసికంగా కుంగుబాటుకు గురై ఆత్మహత్య చేసుకున్నవారి కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనను ఓ అస్త్రంగా కేంద్రం ప్రయోగిస్తోందని ఆరోపించారు. ఈ ప్రక్రియ కారణంగా భయాందోళనకు గురై ప్రాణాలు తీసుకున్న వారితో పాటు అనారోగ్యానికి గురైన వారికి వెన్నుదన్నుగా ఉంటామని ఉద్ఘాటించారు. 'ప్రజలు భయాందోళనకు, మానసిక ఒత్తిళ్లకు గురి కాకుండా చూస్తాం. ప్రతి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం' అని సీఎం హామీనిచ్చారు. ఎస్ఐఆర్ కారణంగా చనిపోయిన 39 మంది కుటుంబాలకు ఆమె మంగళవారం ఆర్థిక సాయం ప్రకటించారు. నలుగురు బూత్ స్థాయి అధికారులతో పాటు మిగతా కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇస్తామన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పని భారం పెరిగి అనారోగ్యానికి గురైన ముగ్గురు బీఎల్ఓలు సహా 13 మందికి రూ.లక్ష చొప్పున ఇస్తామని అన్నారు. నవంబరు 4 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలైందని, అప్పటి నుంచి అనేక వర్గాల ప్రజలు తీవ్ర ఒత్తిళ్లకు గురయ్యారని సీఎం తెలిపారు. 'ఎస్ఐఆర్ కారణంగా ఇప్పటివరకు నలుగురు బీఎల్ఓలు సహా 39 మంది సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో కొందరు ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నాం' అని మమత అన్నారు. 14 ఏళ్లలో జరిగిన రాష్ట్ర అభివృద్ధిపై ఆమె సెక్రటేరియట్ నబన్నలో నిర్వహించిన సమీక్ష అనంతరం ఈ మేరకు మమత ప్రకటించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలైన రోజే ఉత్తర 24 పరగాణాలలోని ఖర్దా ప్రాంతానికి చెందిన ప్రదీప్ కర్ ఆత్మహత్య చేసుకున్నారని అధికారులు తెలిపారు. అప్పటి నుంచి ఎన్యుమరేషన్ దశలో చనిపోయిన వారిలో సగం మంది ఆత్మహత్య చేసుకోగా, మిగతా మరణాలు గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా సంభవించాయని అన్నారు.

'పీఎల్‌జీఏ' హై అలర్ట్: బస్తర్ ఐజీ

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ మావోయిస్టులు ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వారోత్సవాన్ని ప్రకటించారు. ఏటా ఈ ఉత్సవాన్ని మావోయిస్టులు నిర్వహిస్తారు. భద్రతా దళాల వరుస ఎన్‌కౌంటర్లతో భారీ నష్టం వాటిల్లినట్లు మావోయిస్టుల సంస్థలు మొదటిసారి అంగీకరించినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. పీఎల్‌జీఏ వారోత్సవం దృష్ట్యా భద్రతా దళాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. బస్తర్ డివిజన్‌లో భద్రత పెంచామనాష్నరు. గత 11 నెలల్లో వివిధ ఎన్‌కౌంటర్లలో తమ సభ్యుల్లో 320 మంది మరణించారని మావోయిస్టుల కరపత్రం పేర్కొన్నదన్నారు. మావోయిస్టులు తమ నష్టాలను ప్రకటించడం ఇదే మొదటిసారి, షట్‌డౌన్ హెచ్చరిక తర్వాత భద్రతా బలగాలు హైఅలర్ట్‌లో ఉన్నాయని ఐజీ తెలిపారు. వారోత్సవాల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పెట్రోలింగ్, నిఘా పెంచామన్నారు.

మెగా పీటీఎం' విద్యా విప్లవానికి శంఖారావం

టీడీపీ అధికార ప్రతినిధి రమేష్

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యా సంస్కరణలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేశ్ అన్నారు. అమరావతిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు-ఉపాధ్యాయులు-తల్లిదండ్రులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే 'పాఠశాల పండుగ మెగా పీటీఎం కార్యక్రమం రాష్ట్ర విద్యా వ్యవస్థలో కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి మూలకు చేరుకున్న ఈ కార్యక్రమం విద్యలో నూతన సంస్కృతికి బీజం వేసిందన్నారు. మెగా పీటీఎం 1.0 అపూర్వ విజయాన్ని సాధించిందని రమేష్ తెలిపారు. రాష్ట్రంలోని 44,956 పాఠశాలల్లో జరిగిన ఈ కార్యక్రమంలో 25.46 లక్షల తల్లిదండ్రులు, 27,395 పూర్వ విద్యార్థులు, 22,200 దాతలు, 36,918 ప్రజాప్రతినిధులు పాల్గొన్నారని వివరించారు. తదుపరి మెగా పీటీఎం 2.0 దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి ప్రభుత్వ-ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించబడిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 61 వేల పాఠశాలల్లో జరిగిన ఈ మహా కార్యక్రమంలో 74,96,228 మంది విద్యార్థులు, 3,32,770 ఉపాధ్యాయులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులు/సంరక్షకులు పాల్గొన్నారని తెలిపారు. ఈ అపూర్వ విజయంతో ఆంధ్రప్రదేశ్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిందని రమేశ్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ సమావేశాల కొనసాగింపుగా మెగా పిటియం 3.0ను మరింత గొప్పగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మహోత్సవంలా నిర్వహించి, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ విద్యా రంగంలో ఆదర్శంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు.

రక్షణ ప్రాజెక్టుల శంకుస్థాపనకు రండి

రాజ్‌నాథ్ సింగ్‌కు టీజీ భరత్ ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ అధునాతన రక్షణ తయారీ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతోందని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆయన ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని నాలుగు ప్రధాన రక్షణ తయారీ ప్రాజెక్టుల శంకుస్థాపనకు రావాలని ఆయనను ఆహ్వానించారు. శ్రీసత్యసాయి జిల్లాలో కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ ద్వారా డిఫెన్స్ ఎనర్జిటిక్స్ అండ్ మందుగుండు సామగ్రి ఫిల్లింగ్ కాంప్లెక్స్, మడకశిర, హెచ్ఎఫ్‌సీఎల్ ద్వారా ఆర్టిలరీ షెల్ అండ్ మల్టీమోడ్ హ్యాండ్ గ్రెనేడ్ సౌకర్యం, దొనకొండ, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ద్వారా ప్రొపెల్లెంట్ అండ్ వెపన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సౌకర్యం, అనకాపల్లిలోని బీడీఎల్ ద్వారా అండర్ వాటర్ వెపన్స్ టార్పెడో తయారీ యూనిట్‌ల శంకుస్థాపనకు రావాలని రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం అందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు అసోసియేషన్ వినతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వినతి పత్రాన్ని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత, గౌరవాధ్యక్షులు ఎస్.మంజుతో కూడిన ప్రతినిధుల బృందం మంగళవారం కమిషనర్‌ను కలిసింది. వినతిపత్రం అందజేసింది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను కమిషనర్ దృష్టికి ప్రతినిధులు తీసుకెళ్లారు. మెనూలో మార్పులు చేయాలని, మొబైల్ యాప్స్ పనిభారాన్ని తగ్గించాలని, నాణ్యమైన నిల్వలు ప్రతినెలా 5వ తేదీ లోపు సంబంధిత కేంద్రాలకు చేర్చాలని, మెనూ చార్జీలు పెంచాలని, వేతనం పెంచాలని, బిల్లులు, అద్దె, కరెంటు చార్జీలు, ఈవెంట్ బిల్లులు ప్రతినెలా చెల్లించాలని, హెల్పర్ల పదోన్నతిలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అలాగే, కొత్త 5జీ మొబైల్ ఫోన్లు, సోనామసూరి బియ్యం, నాణ్యమైన స్టేషనరీ ఇవ్వాలని కోరారు. కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ డిసెంబర్ మొదటి వారం లోపు మొబైల్ ఫోన్లు ఇస్తామన్నారు. నాణ్యమైన సరుకుల విషయంలో ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని, సకాలంలో నిల్వలను చేర్చేలా కాంట్రాక్టర్లను సూచిస్తున్నామని చెప్పారు. బకాయి బిల్లుల బడ్జెట్ తాజాగా విడుదల చేశామన్నారు. రాజకీయ ఒత్తిడి లేకుండా హెల్పరు నుండి వర్కర్‌గా పదోన్నతి కోసం నిర్దిష్ట మార్గదర్శకాలు ఇస్తామని అన్నారు. ఎంఎస్‌కేలకు మిల్క్ తంబ్ జనవరిలో తెస్తామన్నారు. జనవరి నెలంతా యాప్స్ సవరించి కేంద్ర ప్రభుత్వం పోషణ ట్రాకర్ యాప్ పెడుతుందని, బాల సంజీవిని యాప్ తెస్తున్నామని కమిషనర్ వెల్లడించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సరోజ, కౌన్సిల్ సభ్యులు విజయ, చౌడేశ్వరి, కాంతమ్మ, జులేఖ, తారాదేవి, లక్ష్మీ ఉన్నారు.

రైతుల సమస్యలు పట్టవా: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-పమిడిముక్కల: ధాన్యం కొనుగోలు సమయంలో వచ్చే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. ఆయా సమస్యల గురించి ముందస్తుగా రైతులు, రైతు సంఘాల నాయకులతో చర్చించాలని గతంలో తాను చేసిన సూచనలను రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను పెడ చెవిన పెట్టారని దుయ్యబట్టారు. కృష్ణా జిల్లా కపిలేశ్వరపురంలో రైతు సమస్యలపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ తగిన అవగాహన లేకనే చిన్న సమస్యలను కూడా జటిలమైనవిగా చేస్తున్నారని అధికారుల తీరును విమర్శించారు. రైతుల సమస్యలపై చర్చలు, సంప్రదింపులు అవశ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వం ఎందుకు వెనక్కు తగ్గిందని ప్రశ్నించారు. మిల్లర్ల వద్ద డ్రైయర్లు లేక ధాన్యంలో తేమ శాతం రైతులకు సమస్యగా మారిందని, ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో ధాన్యం కొనుగోలు సమయంలో వారు ఇబ్బంది పడాల్సి వస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. తహసీల్దార్ నవీన్ కుమార్ మాట్లాడుతూ ఒకసారి ధాన్యాన్ని కొనుగోలు చేంద్రాలక అప్పగిస్తే మిల్లర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం రైతులకు ఉండదని, ఏమైనా సమస్యలు ఉంటే కస్టోడియన్ ఆర్ఎస్‌కే సిబ్బంది చూసుకుంటారని అన్నారు. అలా జరగని పక్షంలో తన దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, సంబంధిత మిల్లర్లపై కేసు పెడతామని తహసీల్దార్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు తాతినేని శేషగిరిరావు, లంక రామకృష్ణ, టి.బాబురావు, జగమేశ్వరరావు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.